


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 329

SUNDAY Special

ఆదివారం 11-8-2024


SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మన విద్యాసంస్థల్లోనూ ప్రపంచ శ్రేణి నైపుణ్యాలు

'విద్యా రంగంలో చేసే సేవ.. దేశాభివృద్ధికి తోడ్పడుతుంది. అందుకే ఐఐటీ మద్రాస్‌కు రూ.228 కోట్ల విరాళమిచ్చాను' అని అంటున్న ప్రవాసాంధ్ర పారిశ్రామికవేత్త డాక్టర్ కృష్ణ చివుకులతో 'సాక్షి' ఇంటర్వ్యూ.


- వివరాలు 14లో



ఆరుతో సరి

విశ్వక్రీడల్లో భారత ప్రస్థానం ముగిసింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారుల ఈవెంట్స్ పూర్తయ్యాయి. మహిళల రెజ్లింగ్ ఫ్రీస్టయిల్ 76 కేజీల విభాగంలో రీతిక క్వార్టర్ ఫైనల్లో కిర్గిస్తాన్ రెజ్లర్ ఐపెరి మెదెత్ కిజీ చేతిలో ఓడిపోయింది.

- వివరాలు 12లో



చీఫ్ జస్టిస్‌నూ సాగనంపారు

బంగ్లాదేశ్‌లో విద్యార్థి సంఘాల అల్టిమేటంతో ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



నియంతృత్వంపై పోరాడుదాం

దేశంలోని నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుదామని ఆప్ నేత మనీష్ సిసోడియా పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



గాజా స్కూల్‌పై ఇజ్రాయెల్ దాడి

గాజాలోని అల్-తబిన్ స్కూల్‌పై ఇజ్రాయెల్ శనివారం ఉదయం చేసిన క్షిపణి దాడిలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



తీర్పు నేటికి వాయిదా

ఒలింపిక్స్‌లో వినేశ్ ఫొగాట్‌ను డిస్‌క్వాలిఫై చేసిన అంశంలో కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ తీర్పు 24 గంటలు వాయిదా పడింది.

వివరాలు 12లో ▸

బ్రోకర్.. జోకర్.. సర్కారే!



జాకీ, క్వీన్, కింగ్, ఆస్ అంటూ ఊరూరా అనధికార పేకాట క్లబ్బులు

ఎక్కడికక్కడ జేబులు నింపుకుంటున్న 'తమ్ముళ్లు'

నగరాలు, పట్టణాలు, పల్లెల్లో యథేచ్ఛగా సాగుతున్న దందా

అధికార, అనధికార క్లబ్‌లు దాదాపు 100

వారానికి టర్నోవర్ రూ.3,900 కోట్లు

టీడీపీ నేతలకు కమీషన్ రూ.390 కోట్లు

- అన్ని జిల్లాల్లో రోజు రోజుకూ విస్తరిస్తున్న సంస్కృతి
- ఆటగాళ్లకు సకల వసతులూ సమకూరుస్తున్న నిర్వాహకులు.. 'ఫోన్'లో కూడా లావాదేవీలు
- అటువైపు కన్నెత్తి చూడకుండా పోలీసులకూ మామూళ్లు
- కోరిన మందు, పుడ్డు కోసం ప్రత్యేక ఏర్పాట్లు.. అక్కడికక్కడే అప్పులిచ్చే వాళ్లు సిద్ధం
- వెరసి ఆస్తుల అమ్మకాలు.. కుటుంబాల్లో కలతలు

'పేకాట ప్రియుల్లారా.. రండి రండి.. అనువైన చోటు, తిండీ తిప్పల బాధ్యత మాదే.. ముక్కలూ మావే.. మీరు కేవలం డబ్బు తెచ్చుకుంటే చాలు.. అదీ కష్టం అనుకుంటే ఫోన్ పే/గూగుల్ పే అయినా ఓకే. ఇన్నాళ్లూ మీరు ఈ అదృష్టానికి దూరమయ్యారు.. ఈ ఆనందం కోసం ఎక్కడెక్కడికో పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన పనిలేదిక.. మా శిబిరానికి రండి.. మీ భద్రతకు మాదీ పూచీ.. మీకు ఏం కావాలన్నా తెచ్చి పెట్టడానికి చేతి కింద ఎంతో మంది 'జాకీ'లూ సిద్ధం.. మీరు డబ్బు గెలుచుకోవాలే గానీ 'క్వీన్' కూడా రెడీ.. పైన 'కింగ్' మనోడే.. ఇంకెందుకు ఆలోచిస్తారు? జోకర్ పడకపోయినా కూడా 'షో' చెప్పొచ్చు.. ట్రిపులెట్‌లా మీ జీవితం వెలిగిపోవచ్చు.. మీ అదృష్టం పరీక్షించుకోండి..' అని రాష్ట్రంలో పేకాడేవాళ్లను అధికార టీడీపీ నేతలు ఎక్కడికక్కడ ఆహ్వానిస్తున్నారు. ఇసుక రీచ్‌లలో అడ్డగోలు తవ్వకాలతో జేబులు నింపుకుంటున్నది సరిపోదన్నట్టు పేకాటపై పడ్డారు. చంద్రబాబు చెప్పినట్లు సొంతానికి 'ఇలా' సంపద సృష్టించుకుంటున్నారు.

- వివరాలు 10లో

హామీలు నెరవేర్చలేక

అప్పులంటూ అబద్ధాలు

'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ధ్వజం



- హామీలకు గ్యారంటీ నాదేనని ఎన్నికలప్పుడు పదేపదే చెప్పావ్
- రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ ఇప్పుడు తప్పించుకునే యత్నం చేస్తున్నావ్
- సూపర్ సిక్స్ సహా వాగ్దానాలన్నీ తు.చ. తప్పకుండా అమలు చేయాలి
- హత్యలు, విధ్వంసాలు, తప్పుడు లెక్కలు ఇకనైనా ఆపండి
- రాష్ట్రంలో దిగజారిన పాలనను గాడిలో పెట్టండి

సాక్షి, అమరావతి: 'ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాదీ అన్నారు. పైపెచ్చు రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల అప్పులున్నాయని.. అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని పదేపదే చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ తన నైజాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చి మోసం కాదా?' అని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. 'ఎన్నికలకు ముందు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

చిన్నారులపై అకృత్యాలు దారుణం



అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తున్న ప్రస్తుత కాలంలో కూడా చిన్నారులపై లైంగిక దాడులు, కిడ్నాప్‌లు, హత్యా నేరాలు పెరగడం అత్యంత దారుణమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో ▸

12 ప్రాజెక్టుల పేర్లు మార్చేసిన సర్కారు



రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన 12 సాగునీటి ప్రాజెక్టుల పేర్లను కూటమి ప్రభుత్వం మార్చేసింది. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలు 2లో ▸

'ఉచిత ఇసుక'లో విఫలమయ్యాం



'ఉచిత ఇసుక విధానం అమలు చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం విఫలమైంది. గత ప్రభుత్వంలో కన్నా ఇప్పుడు అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారు. దీనివల్ల మా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

వివరాలు 10లో ▸

ధరల దాడి



నిత్యావసరాల ధరలు ప్రజల్ని హడలెత్తిస్తున్నాయి. ఉప్పు, పప్పు, చింతపండు నుంచి కూరగాయలు వరకు రేట్లు మండిపోతున్నాయి. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలోనే అత్యధిక రేట్లు ఉండటం గమనార్హం.

వివరాలు 2లో ▸

ఇదండీ సంగతి





అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

భీకర వరదలతో అతలాకుతలమైన కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రధాని మోదీ పర్యటించారు. వరదల ధాటికి దెబ్బతిన్న వంతెనలు, ధ్వంసమైన రహదారులు, శిథిలమైన ఇళ్లను పరిశీలించారు. వరదల్లో ఆప్తులను కోల్పోయిన కుటుంబాల ఆవేదన విని చలించిపోయారు. అధైర్యపడొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

6 లో

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



అసైన్డ్ రిజిస్ట్రేషన్ల నిలిపివేత

వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములపై కల్పించిన యాజమాన్య హక్కులను హరించేలా కూటమి సర్కారు చర్యలకు దిగింది. యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా గత ప్రభుత్వం 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై విచారణ నిర్వహించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సక్రమంగానే ఉన్నా రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉంచాలని స్పష్టం చేసింది.

- వివరాలు 14లో

నిందితులెవరో తేల్చకుండా

బెదిరింపులా?



రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం దర్యాప్తులో విజయవాడ సీపీ తీరుపై ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆలోచనాపరుల విస్మయం

- రాత్రి 9 తర్వాత స్మృతివనం సిబ్బందిని బయటకు పంపిందెవరు?
- లైట్లు ఆర్పేసి రాజ్‌భవన్, సీపీ కార్యాలయానికి సమీపంలోని సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడికి తెగబడటం మీ వైఫల్యం కాదా?
- మీడియా వెంటనే సమాచారం ఇచ్చినా ఎందుకు స్పందించలేదు?
- సీసీ పుటేజీని బయటపెట్టి.. దుండగులెవరో ఎందుకు తేల్చరు?
- నిందితులను పట్టుకోకుండా సామాజిక మాధ్యమాలు, కొన్ని పత్రికలు వక్రీకరించాయని.. వాటిపై కఠిన చర్యలు తీసుకుంటా మనడంలో ఆంతర్యమేమిటి?
- ఇది భావప్రకటన, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్పించడం కాదా?
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కనుసన్నల్లో దాడిచేసిన వారిని కాపాడటమే మీ లక్ష్యమా?
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన మీరే దాన్ని ఖూనీ చేసిన వారికి వత్తాసు పలికేలా వ్యవహరించడం ధర్మమా?

- వివరాలు 3లో

మనం.. 'పొదుపు'లో ఘనం



- రూ.17,292 కోట్లతో దేశంలోనే అత్యధికం
- అన్ని రాష్ట్రాలతో పోలిస్తే మన ఏపీ వాటా 26.56%
- బ్యాంకు రుణాల మంజూరులోనూ మనవే టాప్
- ఒక్కో సంఘానికి సగటున రూ.8.8 లక్షల రుణం మంజూరు
- 2023–24లో రాష్ట్రంలోని అన్ని సంఘాలకు రూ.59,777.14 కోట్ల రుణాలు మంజూరు
- జగన్ సర్కారు పథకాలతో పెరిగిన ఆర్థిక క్రమశిక్షణ.. దీంతో నిరర్థక ఆస్తులు 0.31 శాతానికే పరిమితం

5 లో


సిఫారసులకే సర్దుబాటు!



- కూటమి నేతల లేఖలతో టీచర్ల డిప్యుటేషన్లకు రంగం సిద్ధం
- ఈ బదిలీలకు పని సర్దుబాటు ముసుగు
- మిగులు ఉపాధ్యాయులు 29,992 మంది
- బదిలీలు 1:20 నిష్పత్తిలో చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- 5 వేల మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశం?

2 లో

'గోల్డెన్ అవర్'ను మరవద్దు



డబ్బు పోగొట్టుకున్న గంటల వ్యవధిలో ఫిర్యాదుతో మేలు

సైబర్ బాధితులకు పోలీసుల సూచన

రూ.కోట్ల రికవరీలో ఇదే కీలకమంటున్న అధికారులు

సీఎఫ్‌సీఎఫ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్ వినియోగంతో డబ్బు సురక్షితంగా వెనక్కి

ఓ కేసులో 12 నిమిషాల్లో రూ.కోటి కాపాడిన ఖాకీలు

నాచారంలో ఉండే హర్ష్ అనే వ్యక్తి ఈ ఏడాది ఏప్రిల్ 27న సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి మూడు దఫాల్లో రూ.కోటి 10 లక్షలు వారు చెప్పిన బ్యాంకు ఖాతాలకు పంపారు. తాను మోసపోయినట్టు గ్రహించిన వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సీఎఫ్‌సీఎఫ్‌ఆర్‌ఎంఎస్ (సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) పోర్టల్‌లో వివరాలు అప్‌డేట్ చేశారు. కేవలం 12 నిమిషాల వ్యవధిలోనే రూ.కోటిని హోల్డ్ చేశారు. పెద్దమొత్తంలో డబ్బు లు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా ఆపగలిగారు.

- సాక్షి, హైదరాబాద్

"గోల్డెన్ అవర్.." సాధారణంగా ఈ పదం వైద్యం విషయంలో ఎక్కువగా వింటుంటాం. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటలో రోగికి అందే చికిత్స అనేది వారి ప్రాణాన్ని కాపాడడంలో కీలకం. అదే మాదిరిగా సైబర్‌నేరం జరిగిన తర్వాత కూడా వెనువెంటనే పోలీస్ దృష్టికి తీసుకెళ్లడం వల్ల సొమ్ము సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. డబ్బు పోగొట్టుకున్న తర్వాత వెనువెంటనే సైబర్ క్రైం పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వడంతో తగిన పరిష్కారం దక్కుతుందని వారు సూచిస్తున్నారు. అదేవిధంగా సైబర్ క్రైం పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని చెబుతున్నారు.

కంగారు వద్దు..1930కు డయల్ చేయండి

సైబర్ నేరగాళ్ల చేతిలో వివిధ రూపాల్లో మోసపోతున్న బాధితులు తమ బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు కట్ కాగానే ఎంతో కంగారు పడుతుంటా రు. ఈ కంగారులో వారు వెంటనే బ్యాంకులకు పరుగెత్తుతున్నారు. బ్యాంకు అధికారులు ఈ విషయం పోలీసులకు చెప్పాలనడంతో అక్కడి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళుతున్నారు. అక్కడ పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వడం.. పోగొట్టుకున్న డబ్బు మొత్తాన్ని బట్టి ఆ కేసు ఎవరి పరిధిలోకి వస్తుందన్న వివరాలు సేకరించేటప్పటికే ఎంతో సమయం వృథా అవుతోంది. సైబర్ నేరగాళ్లు గురి చూసి మరీ సెలవులు, వారాంతాల్లోనే ఎక్కువ కొల్లగొడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో అయితే విషయం పోలీసుల వరకు వెళ్లేందుకు చాలా సమయం పడుతుంది. కానీ, ఇన్ని ప్రయాసలు, అనవసర కంగారు పక్కన పెట్టి.. వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ఉత్తమమని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సూచిస్తున్నారు.

సీఎఫ్‌సీఎఫ్‌ఆర్‌ఎంఎస్ అంటే?

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టంనే సీఎఫ్‌సీఎఫ్‌ఆర్‌ఎంఎస్‌గా చెబుతారు. ఇందులో పోలీసులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల సిబ్బంది, బ్యాంకులు, ఆర్‌బీఐ, పేమెంట్ వాలెట్లు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తదితర వ్యవస్థలన్నింటికీ ఒక ఉమ్మడి వేదికగా ఈ పోర్టల్ పని చేస్తుంది. 1930 టోల్ ఫ్రీ నంబర్ నుంచి లేదా సైబర్ క్రైం పోర్టల్‌కు బాధితులు డబ్బు పోగొట్టుకున్నట్టు సమాచారం ఇవ్వ గానే సంబంధిత బ్యాంకు వాళ్లకు ఆ వివరాలు వెళతాయి. వెంటనే ఆ డబ్బు అనుమానాస్పద లావాదేవీ కింద గుర్తించి డబ్బులు హోల్డ్ చేస్తారు.

క్లుప్తంగా...

ఫోగట్... మీ వెనుక కోట్ల హృదయాలు ఉన్నాయి

- అమన్‌కు అభినందనలు
- మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పారిస్ ఒలింపిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో రెండు పోస్టులు చేశారు. శరీర బరువు స్వల్పంగా అధికంగా ఉండటంతో అనర్హత వేటు పడి కోర్టుల్లో పోరాడుతున్న వినేష్ ఫోగట్‌కు వైఎస్ జగన్ మద్దతుగా నిలిచారు. 'ప్రియమైన వినేష్ ఫోగట్... ప్రస్తుతం కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తీర్పు కోసం ఎదురు చూస్తూ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్న మీకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. కోర్టు తీర్పు ఎలా ఉన్నా కోట్లాది హృదయాలు మీ వెనుకున్నాయి' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. రెజ్లింగ్ 57 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన అమన్ సెహ్రావత్‌కు అభినందనలు తెలిపారు.

సచివాలయాల వ్యవస్థలో మార్పులకు కమిటీ?

సాక్షి, అమరావతి : గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థలో మార్పులకు కూటమి ప్రభుత్వం నలుగురైదుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వ ఆఫీసుల్లో పనుల కోసం ప్రజలు వ్యయప్రయాసలకోర్చి తరుచూ సొంత ఊరి నుంచి మండలాలు, పట్టణాలు పోయే అవసరం లేకుండా వారికి అవసరమైన అన్ని సేవలు ఇంటి వద్దే అందేలా వైఎస్ జగన్ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను నెలకొల్పింది. కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థలో మార్పులు చేయనున్నట్లు అధికార, రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

12 ప్రాజెక్టుల పేర్ల మార్పు

సాక్షి, అమరావతి: ఏపీలో 12 సాగునీటి ప్రాజెక్టుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మార్చేసింది. గోదావరి, కృష్ణా జలాలతో పల్నాడును సుభిక్షం చేయడానికి గత ప్రభుత్వం వైఎస్సార్ పల్నాడు కరవు నివారణ పథకం (వైఎస్సార్‌పీడీఎంపీ) కింద గోదావరి–పెన్నా అనుసంధానం తొలి దశ, వరికపుడిశెల ఎత్తిపోతలను చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్ పల్నాడు కరవు నివారణ పథకం పేరును రద్దు చేసి ..గోదావరి–పెన్నా అనుసంధానం తొలి దశ, వరికపుడిశెల ఎత్తిపోతలుగా ఆ ప్రాజెక్టు పేరును మార్పు చేసింది. వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పేరును ముక్త్యాల ఎత్తిపోతలుగా, వైఎస్సార్ వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పేరును వెలిగల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా, నర్రెడ్డి శివరామరెడ్డి రిజర్వాయర్ పేరును సర్వారాయసాగర్‌గా, నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ పేరును నెల్లూరు బ్యారేజీగా, మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీ పేరును సంగం బ్యారేజీగా మార్చింది. గొర్రిపాటి బుచ్చిఅప్పారావు తాటిపూడి రిజర్వాయర్ పేరును తాటిపూడి రిజర్వాయర్‌గా, అనంత వెంకటరెడ్డి హంద్రీ–నీవా సుజల స్రవంతి పేరును హంద్రీ–నీవా సుజల స్రవంతిగా, వైఎస్సార్ అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు పేరును పరిటాల రవీంద్ర ఎత్తిపోతల పథకంగా మార్చింది. బూచేపల్లి సుబ్బారెడ్డి మొగలిగుండాల మినీ రిజర్వాయర్ పేరును మొగలిగుండాల మినీ రిజర్వాయర్‌గా, రాకెట్ల నారాయణరెడ్డి ఎత్తిపోతల పేరును రాకెట్ల ఆమిద్యాల ఎత్తిపోతలుగా మార్చింది.

'ప్రకృతి సాగుతోనే కాలుష్యానికి చెక్'



సాక్షి, అమరావతి: ప్రపంచానికి సవాల్‌గా మారిన వాతావరణ కాలుష్యం, పెరుగుతోన్న ఉష్ణోగ్రతలకు చెక్ పెట్టాలంటే అది ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై 2 రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో గుల్బేంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ–2024 అవార్డు గ్రహీత శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన నాగేంద్రమ్మను ఆయన సత్కరించారు. రాష్ట్రంలో ప్రతీ కౌలురైతుకు సంక్షేమ పథకాల లబ్ధిని అందించడమే లక్ష్యంగా కౌలుదారుల చట్టం తయారు చేస్తున్నట్టు రాజశేఖర్ చెప్పారు. దీనికి మార్గదర్శకాల రూపకల్పనపై కసరత్తులో భాగంగా శనివారం కౌలు సంఘాల ప్రతినిధులు, భూ చట్టాలపై సమగ్ర అవగాహన కలిగిన హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎస్ అగర్వాల్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

'వక్ఫ్ చట్టంలో సవరణలు పెనుప్రమాదం'



సాక్షి, అమరావతి: కేంద్రం సవరణలతో తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు కొత్త చట్టం ముస్లిం సమాజానికి పెను ప్రమాదంగా పరిణమిస్తుందని ముస్లిం న్యాయవాదుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు చట్టం –1995 సవరణపై పలు అభ్యంతరాలు తెలిపారు. మసీదులు, దర్గాల నిర్వహణకు, నిరుపేదల అభివృద్ధికి ముస్లిం పూర్వీకులు అల్లాహ్ పేరుతో దానం (వక్ఫ్) చేసిన భూముల విషయంలో ఇతర సమాజాలకు సంబంధం ఉండదన్నారు. ఇది పూర్తిగా ముస్లింలకే చెందుతుందని, ఈ భూములపై వచ్చిన ఆదాయం వారికే ఉపయోగించాలన్నారు.



'బంగారం రేట్లు దిగి వచ్చినా నిత్యావసర సరుకుల ధరలు మాత్రం రోజూ భయపెడుతున్నాయి. నేను, నా భర్త నెలంతా కష్టపడితే రూ.18 వేలు వస్తాయి. ఇందులో తిండికే రూ.6 వేలకుపైనే ఖర్చవుతోంది. నిత్యావసరాల ఖర్చు నెలకు రూ.2 వేలకు పైనే పెరిగింది. వంటింటి ఖర్చులు పోనూ మిగిలిన జీతంలో సగానికిపైగా ఇంటి అద్దెకు పోతుంది. రెండు నెలలుగా ఇంటి అద్దె కూడా పెరిగింది. పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులు పోనూ చేతిలో చిల్లిగవ్వ కూడా మిగలడంలేదు. ఏదైనా అనుకోని సమస్య వస్తే అప్పుల కోసం తిప్పలు పడాల్సిందే'... విజయవాడలో రోజువారీ పనులకు వెళ్లే కార్మికురాలు శాంత ఆవేదన ఇదీ! పొట్టకూటి కోసం పట్టణాలకు వలస వచ్చినపేదలు ధరాఘాతంతో అల్లాడుతున్నారు.

ధరల దాడి!



నిత్యావసరాల ధాటికి జనం జేబులు గుల్ల

సాక్షి, అమరావతి

నిత్యావసరాలు వంటింటిని హడలెత్తిస్తున్నాయి. పొయ్యి వెలిగించకుండానే భగభగమంటున్నాయి. కందిపప్పు పట్టుకుంటే చేతులు కాలుతున్నాయి. ఉప్పు, పప్పు, చింతపండు, ఎండుమిర్చితో పాటు కూరగాయల వరకు రేట్లు మండిపోతున్నాయి. నిత్యావసరాల ధరల్లో జాతీయ సగటుతో పాటు దక్షిణాది సగటుతో పోల్చినా ఆంధ్రప్రదేశ్‌లోనే ధరలు అధికంగా ఉండటం గమనార్హం. రెండేళ్ల క్రితంతో పోలిస్తే నిత్యావసరాల రేట్లు బాగా పెరిగాయి. బియ్యం (కామన్ రకం) 12 శాతం, పెసరపప్పు 54 శాతం, ఆటా 67%, కందిపప్పు 61 శాతం, పంచదార 15 శాతం, బంగాళదుంప 21 శాతం, ఉల్లిపాయాలు 87 శాతం, టమాటాలు 50 శాతం, పాలు 6 శాతం, ఉప్పు ధరలు 30 శాతానికిపైగా పెరగడంతో జనం జేబులు గుల్లవుతున్నాయి. ప్రతి నెలా బడ్జెట్ గాడి తప్పుతోంది.

నాడు ఫోర్టిఫైడ్ గోధుమపిండి

గోధుమ పిండి సగటున కిలో రూ.48 నుంచి రూ.70కిపైగా పలుకుతోంది. దేశ వ్యాప్తంగా తమిళనాడు తర్వాత ఏపీలోనే గోధుమ పిండి రేటు ఎక్కువగా ఉంది. గత ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని కిలో ప్యాకెట్ల రూపంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రూ.11కే అందించింది.

బియ్యం బాబోయ్!



గత కొన్నేళ్లుగా బియ్యం ధరలు వినియోగదారులను ఠారెత్తిస్తున్నాయి. 2019లో సాధారణ బియ్యం కిలో రూ.36 చొప్పున ఉండగా ఇప్పుడు కిలో రూ.55కిపైగా పలుకుతోంది. సూపర్ ఫైన్ బియ్యం రూ.65 – రూ.70కిపైగా ఎగబాకింది. బాస్మతి, దావత్ బియ్యం ఏకంగా కిలో రూ.230కిపైగా ఉంది. తాజాగా బియ్యం రేట్లు తొమ్మిది రాష్ట్రాల్లో కిలో రూ.50 దాటింది. అత్యధిక బియ్యం రేట్లలో ఏపీ 5వ స్థానంలో ఉంది. బియ్యం నిల్వలను నల్ల బజారుకు తరలించడంతో రేట్లు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో నాట్లు వేసిన తర్వాత కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇది దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో బియ్యాన్ని బ్లాక్ చేసి రేట్లు పెంచే ఆలోచనలో వ్యాపారులున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా బియ్యం నిల్వలపై పరిమితులు విధించకుండా అక్రమార్కులకు కొమ్ముకాస్తూ నామమాత్రంగా రూ.1, రూ.2 తగ్గించి వినియోగదారులుకు ఇస్తున్నట్లు గొప్పగా చెప్పుకుంటోంది. వరి అధికంగా పండే పంజాబ్‌లో కిలో బియ్యం రూ.39.58 మాత్రమే ఉండగా అన్నపూర్ణగా పేరొందిన ఏపీలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి.



ఉడకని కందిపప్పు!

రాష్ట్రంలో గత ఫిబ్రవరిలో కిలో రూ.163 చొప్పున ఉన్న కందిపప్పు ప్రస్తుతం రూ.180కిపైగా చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా పీడీఎస్‌లో కందిపప్పు ఇవ్వకపోవడంతో బయట మార్కెట్‌లో వ్యాపారులు ధరలు పెంచేశారు. గోవా, అండమాన్ నికోబార్ దీవులు, మహారాష్ట్ర తర్వాత ఏపీలోనే కందిపప్పు రేటు అధికంగా ఉంది. ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోంది. తాజాగా రిటైల్ దుకాణాలు, రైతు బజార్లలో రూ.150కే ఇస్తామంటున్నా కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. ''కిలో రూ.160 ఉన్నప్పుడు కొన్న కందిపప్పును రెండు సార్లు కుక్కర్‌లో ఉడికించి మిక్సీలో తిప్పినా మెత్తగా కావడం లేదు. చేసేది లేక ప్యాకెట్ కందిపప్పు రూ.224 పెట్టి కొనుక్కెళ్లా. ఉడకని పప్పులు తక్కువ రేటుకు ఇచ్చినా ఏం చేసుకోవాలి? ఇది వినియోగదారులకు నష్టం కాదా?'' అంటూ విజయవాడలోని ఓ సూపర్ మార్కెట్‌లో వినియోగదారుడు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక్కో కుటుంబంపై నెలకు రూ.2 వేల నుంచి 4 వేలకుపైగా అదనపు భారం

జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలోనే అత్యధిక రేట్లు

దక్షిణాది సగటుతో పోల్చినా రాష్ట్రంలోనే ధరల బాదుడు

బియ్యం నిల్వల బ్లాక్‌తో మార్కెట్‌లో ఎగబాకుతున్న రేట్లు

గత రెండేళ్లతో పోలిస్తే భారీగా పెరిగిన సరుకుల ధరలు

ద్రవ్యోల్బణం రేటు పెరుగుదలలోనూ ఏపీ ముందంజ

దేశ సగటు 5.08 శాతం.. రాష్ట్రంలో ఏకంగా 5.87 శాతం

కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్న కూటమి ప్రభుత్వం

కూరగాయల కల్లోలం..

రాష్ట్రంలో రెండు నెలల క్రితం అధిక వేడి కారణంగా కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో వాటి ధరలు 40 నుంచి 60 శాతం పెరిగాయి. రైతు బజార్లలో అన్నీ కిలో రూ.50 నుంచి రూ.80కి చేరుకున్నాయి. ఇప్పుడు మళ్లీ అధిక వర్షాలు, వరదల కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతోంది. దీంతో నిత్యావసరాలకు తోడు కూరగాయల రేట్లు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో కాకరకాయల ధర కిలో ఏకంగా రూ.70, క్యారెట్ ధర రూ.90 వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల కారణంగా టమాటా, ఉల్లి, పచ్చిమిర్చి, కాలీఫ్లవర్, బీన్స్, క్యాప్సికం, అల్లం ధరలు పెరుగుతున్నాయి.

జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలోనే నిత్యావసర ధరలు ఎక్కువ (కిలో/ లీటర్లు) (రూపాయిల్లో)..

నిత్యావసరం	ఏపీ	జాతీయ సగటు	సౌత్‌జోన్
సూపర్ ఫైన్	64	-	-
ఫైన్ రైస్	56	-	55
కందిపప్పు	180-220	167	170
సన్‌ఫ్లవర్ నూనె	114-123	120	116
పెసరపప్పు	120-170	117	124
గోధుమపిండి	45-70	35	48
ఉప్పు	26	22.50	20.32
పంచదార	42-46	44	43.61
బంగాళదుంప	42-46	38	34
ఉల్లిపాయలు	35-45	43	42.56

నిన్నటి రేట్లు ఇవాళ ఉండట్లేదు..



నిత్యావసరాల ధరలు చూస్తుంటే భయం వేస్తోంది. ఒకరోజు ఉన్న రేటు మరుసటి రోజు ఉండటం లేదు. ఊహించని విధంగా మారిపోతున్నాయి. కందిపప్పు కొనలేని పరిస్థితి. పోనీ కూరగాయలైనా వండుకుందామంటే ఏది చూసినా కిలో రూ.50, రూ.100 పలుకుతున్నాయి. ఆదాయానికి, ఖర్చులకు సంబంధం లేకుండా పోయింది. చివరకు చింతపండు రసం చేసుకోవాలన్నా రేట్లు చూస్తే కొనేలా లేవు.

– అద్దంకి మౌనిక, పెదరావూరు, తెనాలి మండలం

నలుగురికి సంతోషంగా వడ్డించలేం..



పప్పులు, ఉప్పుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వంటగదిలో కూర్చుని నలుగురికి ఆనందంగా వండిపెట్టే రోజులు ఇప్పట్లో రావేమో. ఏది కొనాలన్నా రేట్లు మండిపోతున్నాయి. సంపాదించే కొద్ది మొత్తంలో నిత్యావసరాలకే సగం ఖర్చయితే సామాన్యులు ఎలా బతకాలి? బియ్యం రేట్లు కూడా విపరీతంగా పెరుగుతుంటే ఇంకేం తినాలి?

– యాదల అన్నపూర్ణ, తెనాలి

రాష్ట్రంలోని బహిరంగ మార్కెట్లలో కూరగాయల సగటు ధరలు

కూరగాయలు	కిలో (రూ.లో)
పచ్చిమిర్చి	60-70
దొండ	38-60
క్యాలీఫ్లవర్	40-62
క్యారెట్	34-90
క్యాబేజీ	30-55
వంకాయ	35-65
కాకరకాయ	45-70
బెండకాయ	35-50
పొట్లకాయ	36-55
వంకాయలు (వెల్లంకి/కాశీపట్నం)	62-85
క్యాప్సికం	60-160



ఏపీలోనే ద్రవ్యోల్బణం ఎక్కువ..

ధరల పెరుగుదల కొంతవరకు అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి ఉంటుంది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేకున్నా ఏపీలో ద్రవ్యోల్బణం అమాంతం పెరుగుతోంది. జాతీయ సగటు 5.08 శాతంతో పోలిస్తే ఏపీలో ధరల పెరుగుదల సూచీ 5.87 శాతంతో భయపెడుతోంది. ధరల పెరుగుదల సూచీ ఒడిశాలో అత్యధికంగా 7.22 శాతం, దాద్రానగర్ హవేలీలో 6.49 శాతం, బిహార్‌లో 6.37 శాతం, కర్నాటకలో 5.98 శాతం తర్వాత ఏపీ ఐదో స్థానంలో ఉంది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణలో 5.49 శాతం, తమిళనాడులో 4.75 శాతం. కేరళలో 5.83 శాతం ద్రవ్యోల్బణం రేటు ఉంది.

హామీలు నెరవేర్చలేక అప్పులంటూ అబద్ధాలు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం శ్రీలంకలా అయిపోయిందని, ఆర్థిక విధ్వంసం జరిగిందని ఊరూరా విష ప్రచారం చేశారు. అపార అనుభవం ఉంది, నన్ను మించినవారు లేరు, అమలు చేసే బాధ్యత నాదీ అని నమ్మబలికి సూపర్ సిక్స్.. సూపర్ టెన్ అంటూ చాలా చాలా వాగ్దానాలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులు రూ.10 లక్షల కోట్లు అంటున్నారు. అది కూడా అసత్యమే. స్వాక్షాత్తూ గవర్నర్‌గారితో అసెంబ్లీలో ఇలాంటి అనేక అవాస్తవాలను చెప్పించారు. ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలను ఆపేసి.. తప్పుడు లెక్కలతో ప్రజలను మోసం చేయకుండా సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలన్నీ తు.చ. తప్పకుండా అమలు చేయండి. ఇప్పటికే దిగజారిన పాలనను గాడిలో పెట్టండి' అని హితవు పలికారు. ఈ మేరకు వైఎస్ జగన్ శనివారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ట్వీట్‌లో ఆయన ఇంకా ఏమన్నారంటే..



తొలి క్షణం నుంచే ప్లేటు ఫిరాయింపు

చంద్రబాబూ..! ప్రమాణ స్వీకారం చేసిన తొలి క్షణం నుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోయిందంటూ తప్పుడు శ్వేతపత్రాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారు. అప్పులకు వడ్డీలు కట్టాలి..! అవి కట్టడానికే డబ్బుల్లేవు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ లేని అప్పులు ఉన్నట్టుగా, వాటికి లేని వడ్డీలు కడుతున్నట్టుగా పదేపదే చెబుతూ ప్రజలను మాయచేసే ప్రయత్నం చేస్తున్నారు.

రెండున్నర నెలల్లోనే ఇంత దగానా?

తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వలేదు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు అందాల్సిన రూ.20 వేలు రాలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్ పెట్టారు. వసతి దీవెనా లేదు. సున్నావడ్డీ లేనే లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకూ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేల జాడే లేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. రూ.20 వేలు చొప్పున ఇస్తానన్న మత్స్యకార భరోసా అడ్రస్సే లేదు. పేదలకు అత్యవసరమైన ఆరోగ్యశ్రీ చెల్లింపులు రూ.1,600 కోట్లు పెండింగ్ పెట్టారు. ఇంటికే వచ్చి పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది. ఇంటికి వచ్చే రేషన్ నిలిచిపోయింది. వలంటీర్లను మోసం చేశారు. విత్తనాల కోసం రైతులు మళ్లీ క్యూలో నిలబడే దుస్థితి తీసుకొచ్చారు. పంటలకు ఉచిత బీమా ఎగరగొట్టారు. స్కూళ్లలో టోఫెల్ క్లాసులు రద్దు చేశారు. ఇక విద్యా కానుక కిట్ల పంపిణీ అరకొరగానే. అది కూడా అంతా అస్తవ్యస్తం. మధ్యాహ్న భోజన పథకంలో రోజుకో మెనూ విధానం పోయింది. ఇంగ్లీషు మీడియం గాడి తప్పింది. పాఠశాలలు, గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. శాంతి భద్రతలు దారుణంగా క్షీణించాయి. రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. రాష్ట్రం మూడు హత్యలు, ఆరు విధ్వంసాలుగా వర్ధిల్లుతోంది. మహిళలకు రక్షణే లేదు. దిశ యాప్ అటకెక్కింది. రెండున్నర నెలల్లోనే ప్రజలను ఇంతలా దగా చేస్తారా చంద్రబాబూ?

రాష్ట్రం అప్పు రూ.7.48 లక్షల కోట్లే..

నిజాలు ఏమిటంటే రాష్ట్ర ప్రభుత్వ రుణాలు, విద్యుత్ కంపెనీల రుణాలు, గ్యారంటీ, నాన్ గ్యారంటీ రుణాలు అన్నీ కలిపి 2024 జూన్ నాటికి ఉన్న మొత్తం అప్పులు అక్షరాల రూ.7,48,612 కోట్లు. ఇందులో 2019లో మీరు (చంద్రబాబు) దిగిపోయేనాటికి ఉన్న అప్పులు రూ.4,08,170 కోట్లు. దీనికిపైన ఉన్నవి మాత్రమే మా హయాంలో చేసిన అప్పులు. మీ హయాంలో అప్పుల వృద్ధి రేటు (సీఏజీఆర్) 21.63 శాతం కాగా కోవిడ్ విపత్తుతో ఆర్థిక వ్యవస్థలో పెను సంక్షోభం వచ్చినా మా హయాంలో అది కేవలం 12.9 శాతమే ఉంది. ఈ వాస్తవాలన్నింటినీ గవర్నర్‌కు లేఖ రూపంలో తెలియజేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, ఆర్బీఐ నివేదికలు, కాగ్ లెక్కలు లాంటి ఆధారాలతో కూడిన సమగ్ర వివరాలు bit.ly/4dkOKru లింక్‌లో ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా చదువుకోండి చంద్రబాబూ!

సిఫారసులకే సర్దుబాటు!



సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్కూళ్ల ఉపాధ్యాయుల సర్దుబాటు బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియ ఆదివారం నాటికి పూర్తి కావాల్సి ఉండగా టీచర్, విద్యార్థుల నిష్పత్తి, సర్వీస్, స్టేషన్ అంశాల్లో ఏది ప్రామాణికంగా తీసుకోవాలన్న అంశంపై తర్జనభర్జనతో బదిలీలను సోమవారానికి వాయిదా వేశారు. పైకి మాత్రం పని సర్దుబాటు ఆధారంగా బదిలీలు అని చెబుతున్నా అంతర్గతంగా కూటమి నేతలకు కాసులు కురిపించే ప్రక్రియగా మారిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమ సిఫారసు లేఖలతో వచ్చిన వారికి బదిలీలలో ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు మంత్రులు, కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే అదనుగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సిఫారసు లేఖలతో మండలం, జిల్లా కేంద్రాలకు లేదంటే సమీపంలోని పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మొత్తం ప్రక్రియ జిల్లా స్థాయిలో జరుగుతుండటంతో భారీగా అక్రమాలకు ఆస్కారముందని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యాశాఖ లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 29,992 మంది ఉపాధ్యాయులు మిగులు కనిపిస్తుండగా ఈ ఏడాది ఇప్పటివరకు ఉద్యోగ విరమణ చేసిన వారు 2 వేల మంది వరకు ఉన్నట్టు తెలుస్తోంది. 30 మంది విద్యార్థులకు ఓ టీచర్ ఉండాలని విద్యాశాఖ నిబంధన తేవడంతో గరిష్టంగా 4 వేల నుంచి 5 వేల మందికి బదిలీకి అవకాశముంది. ఈ ఏడాది పదవీ విరమణ చేయనున్న వారిని బదిలీల నుంచి మినహాయించారు.

బదిలీలు 1: 20 ప్రకారం చేయాలని డిమాండ్

ఇటీవల ఉపాధ్యాయుల అటెండెన్స్ యాప్‌లో సిబ్బంది సర్వీసు వివరాల నమోదు కోసం ప్రత్యేక కాలమ్ జోడించారు. దీనిద్వారా ఉపాధ్యాయులంతా తమ సర్వీస్ రికార్డు వివరాలను నమోదు చేశారు. ఈ లెక్కల ప్రకారం స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) 8,773 మంది, ఎస్జీటీలు 20,469 మంది మిగులు ఉన్నట్టు తేల్చారు. ఎయిడెడ్‌లో మరో 750 మంది కలిపి మొత్తం మిగులు ఉపాధ్యాయులు 29,992 మంది ఉన్నారు. సర్దుబాటు బదిలీల్లో భాగంగా 30 మంది విద్యార్థులకు ఓ టీచర్ చొప్పున ఉండేలా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ లెక్కన సర్దుబాటు చేస్తే సెకండరీ గ్రేడ్ టీచర్లకు నష్టం జరుగుతుంది. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ నిష్పత్తిలో, ఉన్నత పాఠశాలలకు 1:45 నిష్పత్తిలో లేదా జీవో53 ప్రకారం ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల 6 నుంచి 7 వేల మందికి అవకాశం లభిస్తుందంటున్నాదీనిపై ప్రభుత్వం స్పందించలేదు. సర్దుబాటు బదిలీల్లో సమస్యలను పరిష్కరించుకునేందుకు టీడీపీ ఎమ్మెల్సీలతో చర్చించేందుకు రావాలని ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించినప్పటికీ తామనుకున్న విధంగా ప్రక్రియ ముగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సర్దుబాటు బదిలీలు తొలుత రాష్ట్ర స్థాయిలో చేపట్టాలని నిర్ణయించినా అనంతరం జిల్లా స్థాయిలో మండల యూనిట్‌గా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. కూటమి నేతలు దీన్ని ఆసరాగా చేసుకుని తమ సిఫారసు లేఖలు తెచ్చుకున్న వారిని కోరుకున్నచోటకు పంపించాలని ఆదేశిస్తున్నట్లు సమాచారం.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

- మంత్రులు ప్రారంభించాలి.. ఎంపీ, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలి
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



సాక్షి, అమరావతి: భూములకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. 15న అన్ని జిల్లాలో ప్రారంభించి 16–30 వరకు సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదివారం మెమో ఇచ్చారు. గ్రామ స్థాయిలో భూముల సమస్యలు పరిష్కారానికి ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని అందులో అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. భూ కబ్జాలు, 22ఏ జాబితా దుర్వినియోగంతో పాటు అన్ని భూ సంబంధిత విషయాలపై అర్జీలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి జిల్లాల వారీగా సదస్సుల షెడ్యూల్ రూపొందిస్తామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వినతులు స్వీకరించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ప్రత్యేక అధికారి సమీక్షిస్తారని, వచ్చిన అన్ని పిటిషన్లను.. వినతుల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జేసీలు సదస్సులకు కో–ఆర్డినేటర్లుగా ఉంటారని, సబ్ కలెక్టర్లు/ఆర్డీవోలు, తహశీల్దార్లు తమ పరిధిలోని ప్రతి గ్రామంలో సదస్సు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలన్నారు. ప్రతి సదస్సుకి తహశీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, మండల సర్వేయర్ ఇతర అన్ని శాఖలకు చెందిన వారు వెళ్లాలని, జిల్లా కలెక్టర్ జిల్లా నుంచి మండల నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరుకి సదస్సులన్నీ పూర్తి కావాలని, ఆ తర్వాత వాటికి సంబంధించిన పరిష్కారాల ఆదేశాలను 45 రోజుల్లో ఇవ్వాలని సూచించారు.

చిన్నారులపై అకృత్యాలు దారుణం

- 2023లో దేశవ్యాప్తంగా 1,62,000 మంది చిన్నారులపై నేరాలు, 83,350 మంది పిల్లల మిస్సింగ్ కేసులు
- లైంగిక వేధింపుల కేసులు 2021తో పోలిస్తే 2022లో పెరిగాయి
- పోక్సో కేసుల్లో శిక్షలు వేస్తున్నా ఆగని ఘోరాలు
- హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆవేదన



గుంటూరు వెస్ట్ : అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తున్న ప్రస్తుత కాలంలో కూడా చిన్నారులపై లైంగిక దాడులు, కిడ్నాప్‌లు, హత్యా నేరాలు పెరగడం అత్యంత దారుణమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో (జువెనైల్ జస్టిస్ కమిటీ) విభిన్న ప్రతిభావంతుల బాలల హక్కుల పరిరక్షణపై స్టేక్ హోల్డర్స్‌తో శనివారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన వార్షిక రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. రాకెట్ సైన్స్‌లో అద్భుతాలు సృష్టిస్తున్న ప్రస్తుత తరుణంలో మానవ ఆలోచనా విధానం ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. అభంశుభం తెలియని చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. జాతీయ క్రైం బ్యూరో 2023 గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 1,62,000 మంది బాలలపై నేరాలు జరిగాయన్నారు. 83,350 మంది చిన్నారుల మిస్సింగ్ కేసులు నమోదయ్యాయని.. బాలలపై కిడ్నాపింగ్, బలవంతపు నేరాలు 45 శాతం ఉన్నాయన్నారు. ఇక దేశంలో లైంగిక వేధింపులకు గురైన వారి సంఖ్య 2021 కంటే 2022లో మరింత పెరిగాయన్నారు. పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్) చట్టం ద్వారా కఠినమైన శిక్షలు వేస్తున్నా నేరాలు మాత్రం తగ్గడంలేదన్నారు. ఎన్సీఆర్బీ రికార్డు ప్రకారం.. 1,004 కేసుల్లో 900 కేసులు తెలిసినవారి కారణంగా జరిగినవేనని చెబుతూ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ భావోద్వేగానికి లోనయ్యారు. బాలలు బలహీనులు, వారేమీ చేయలేరు, ఎవరికీ చెప్పుకోలేరని చాలామంది దాడులకు తెగబడుతున్నారని.. ఈ విధానం మారాలన్నారు.

సామాజిక బాధ్యతగా బాలల రక్షణ..

సమావేశంలో జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. నరేందర్ మాట్లాడుతూ.. బాలల రక్షణను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ చట్టం అనేది రక్షణ, సంరక్షణ అవసరమైన చిన్నారుల కోసం మాత్రమే కాదని.. తీవ్రమైన నేరారోపణలకు గురయ్యే పిల్లల సంరక్షణ కోసం కూడా ఉద్దేశించబడిందని వివరించారు. చట్టాలు అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనా ఎంతో ఉందని చెప్పారు. అనంతరం.. చిన్నారులుతో ముచ్చటించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా న్యాయస్థానాల న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సాంకేతికాభివృద్ధి నేరాలకు మూలం కాకూడదు


హోం మంత్రి వంగలపూడి అనిత



సైబర్ వాక్‌థాన్‌లో అనిత, సీపీ రాజశేఖరబాబు, కలెక్టర్ సృజన, ఎమ్మెల్యేలు గద్దె, బొండా

విజయవాడ స్పోర్ట్స్: పెరుగుతున్న సాంకేతికత మానవ మనుగడకు ఉపయోగకరంగా ఉండాలే తప్ప.. సమస్యలు, నేరాలకు మూలం కాకూడదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి వనిత అన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యాన విజయవాడలో శనివారం నిర్వహించిన సైబర్ వాక్‌థాన్ (సైబర్ నేరాల అవగాహన ర్యాలీ)లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు నెలల్లో దేశవ్యాప్తంగా రూ.1,730 కోట్ల మేర సైబర్ చోరీలు జరిగాయని, గతంలో పోల్చితే ఒక్కసారిగా 24 శాతం సైబర్ నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ కమాండోలను, సైబర్ సోల్జర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కలెక్టర్ సృజన, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీని అధికారంలోకి తెద్దాం: బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు శనివారం వచ్చిన ఆయన తెలంగాణ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వాల నమోదుపై చర్చించారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలోనే పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిని నియమించనున్నట్లు చెప్పారు. కాగా ఈ సమావేశంలోనే టీటీడీపీ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు ఎం.అరవింద్ కుమార్ గౌడ్‌ను నియమిస్తారని ప్రచారం జరిగినా, మళ్లీ వాయిదా వేయడం గమనార్హం. అరవింద్ కుమార్‌గౌడ్‌తో పాటు బక్కని నర్సింహులు, నర్సిరెడ్డి, కాట్రగడ్డ ప్రసూన వంటి నాయకులు టీటీడీపీ అధ్యక్షపదవిని ఆశిస్తున్నారు.

రాజ్యాంగ నిర్మాతకే రక్షణ కరువు: కైలే



సాక్షి, అమరావతి: విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహంపై ప్రభుత్వ ప్రోద్బలంతోనే దాడి జరిగిందని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. అంబేడ్కర్ అంటే సీఎం చంద్రబాబుకు గౌరవం లేదని.. అందుకే ఆయన ఇప్పటి వరకు విజయవాడలో ఆ స్మృతివనాన్ని సందర్శించలేదని విమర్శించారు. దాడి చేసిన దుండగులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. చివరకు రాజ్యాంగ నిర్మాత విగ్రహానికే రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజానికి విజయవాడ, స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చంద్రబాబుకు ఏనాడూ ఇష్టం లేదని, ఆ స్థలాన్ని ఎవరికో కట్టబెట్టి లబ్ధి పొందాలన్నదే ఆయన ఆలోచనగా తెలిపారు. పామర్రు ప్రస్తుత ఎమ్మెల్యే కుమార్ రాజా కాదు.. వసూల్ రాజా అని కైలే అనిల్‌కుమార్ ఆరోపించారు. ఆయన పేకాట, అవినీతి, మట్టి, ఇసుక దందాను పామర్రు ప్రజలు ఇప్పటికే గుర్తించారని చెప్పారు.

రాజ్యాంగంపై దాడే: సురేంద్ర



సాక్షి, అమరావతి: విజయవాడ అంబేడ్కర్ విగ్రహంపై దాడి రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలని ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని ఖండిస్తూ శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తానని గతంలో చంద్రబాబు మాట ఇచ్చి మోసం చేశాడని గుర్తు చేశారు. చంద్రబాబు మాట తప్పితే.. వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం ప్రపంచంలోనే అత్యంత పెద్ద మహా శిల్పాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఆ మహాశిల్పం వద్ద వైఎస్ జగన్ పేరును తొలగించి, లైటింగ్‌ను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ రాష్ట్రపతి వీవీ గిరికి ద్రౌపది ముర్ము నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి వరాహ వెంకట గిరి (వీవీ గిరి)కి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళులర్పించారు. తైమూర్ లేస్టేలోని ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి శనివారం వీవీ గిరి జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వీవీ గిరి రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కాగా.. తెలుగు కుటుంబానికి చెందిన వీవీగిరి 1969 నుంచి 1974 వరకు 4వ రాష్ట్రపతిగా సేవలు అందించారు.

వరద పోటు.. కరువు కాటు

రాష్ట్రంలో కుదేలైపోతున్న వ్యవసాయ రంగం

ఇది 'అనంత' వేదన

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితి నెలకొంది. జూన్‌లో 142 శాతం అధికంగా వర్షపాతం నమోదు కాగా, జూలైలో సాధారణం కంటే 61.8 శాతం, ఆగస్టులో 48.7 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. మొత్తంగా సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సాధారణం కంటే 31.5 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. కానీ ఏకంగా 52 రోజులు వర్షమే లేకపోవడం జిల్లాలో వ్యవసాయాన్ని దెబ్బ తీసేసింది. ఐదు మండలాల్లో రెండు డ్రై స్పెల్స్ నమోదయ్యాయి. ఈ జిల్లాలో 3,46,733 హెక్టార్లు సాగు విస్తీర్ణం ఉండగా, ఇప్పటి వరకు 1,43,332 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. వేరుశనగ సాధారణ విస్తీర్ణం 1,97,884 హెక్టార్లు కాగా కేవలం 53,974 హెక్టార్లలో అంటే కేవలం 27.3 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగైంది. పత్తి 48,586 హెక్టార్లకు గాను 21,907 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ప్రకాశం జిల్లాలోనూ ఇదే దుస్థితి. ఈ జిల్లాల్లో 3.87 లక్షల ఎకరాల సాగు లక్ష్యం కాగా, కేవలం 66 వేల ఎకరాల్లోనే సాగయింది.

- ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల రైతులకు వరద పోటు
- కోనసీమలో సాగు చేయలేక పొలాల్ని ఖాళీగా వదిలేస్తున్న రైతులు
- పలు ప్రాంతాల్లో 50 రోజులకు పైగా తీవ్ర లోటు వర్షపాతం
- సాగు మొదలై 70 రోజులవుతున్నా.. 49 శాతం దాటని పంటల సాగు

కోస్తాలో అతివృష్టి.. రాయలసీమ, ప్రకాశంలో అనావృష్టి



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం ఉప్ప వంక గ్రామంలో వర్షం లేక వాడిన వేరుశెనగ పంట


రాష్ట్రంలో ఖరీఫ్ సాగు లక్ష్యం 85.26 లక్షల ఎకరాలు

ఇప్పటి వరకు సాగైంది 40 లక్షల ఎకరాలు-49%

గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలోనే సాగైంది 39 లక్షల ఎకరాల్లో

2022 ఖరీఫ్‌లో ఇదే సమయానికి సాగయింది 48 లక్షల ఎకరాల్లో

ప్రధానంగా వరి 48% సాగవగా, వేరుశనగ 40, పత్తి 55, కంది 57% విస్తీర్ణంలో సాగయ్యాయి.



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓ పక్క అతివృష్టి, వరదలు.. మరో ప్రాంతంలో అనావృష్టి. రెండూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతను అతలాకుతలం చేస్తున్నాయి. ఖరీఫ్ మొదలై 70 రోజులు దాటినా ఆశించిన స్థాయిలో పంటల సాగు లేదు. వేసిన పంటలు కొన్ని చోట్ల నీట మునగ్గా, మరికొన్ని ప్రాంతాల్లో ఎండిపోతున్నాయి. ఈ విపత్కర సమయంలో రైతుకు అండగా నిలవాల్సిన సమయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో రైతాంగాన్ని మరింతగా ఊబిలోకి నెడుతోంది. ప్రభుత్వ అసమర్థత కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం కుదేలైపోయింది.

రాష్ట్రంలో జూన్ నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు కురిసిన వర్షాన్ని పరిశీలిస్తే 286 మిలీమీటర్లు కురవాల్సి ఉండగా, ఇప్పటికే 370.4 మిల్లీమీటర్లు కురిసింది. అంటే 29.5 శాతం అధికం. రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లన్నీ నిండుగా ఉన్నాయి. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగడం, వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పలు ప్రాంతాల్లో వరదలు వచ్చాయి. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో భారీ నష్టం వాటిలింది. ఇదే సమయంలో రాయలసీమ జిల్లాల్లో, ప్రకాశం జిల్లాలో మాత్రం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ జిల్లాల్లో చాలా చోట్ల గత 50 రోజులకు పైగా వర్షపు చుక్క లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ జిల్లాల్లో జూన్‌లో అధిక వర్షపాతం నమోదైనప్పటికీ, జూలై నుంచి ఈ నెల మొదటి వారం వరకు చుక్క వాన పడలేదు.

2 లక్షల ఎకరాల్లో పంటలు వరద పాలు

భారీ వర్షాలు, కృష్ణా, గోదావరి నదుల వరద ఉధృతికి ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎర్ర కాలువకు పోటెత్తిన వరద రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఖమ్మం జిల్లాలో ప్రారంభమయ్యే ఈ కాలువ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, అత్తిలి మండలాల్లోని 1.49 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తోంది. ఇటీవలి భారీ వర్షాలకు ఈ జిల్లాలో 13 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. వర్షాలు, వరదలతో ముంపు నీరు దిగే దారి లేక గోదావరి డెల్టాలో సాగు చేయలేక వేలాది ఎకరాలను రైతులు ఖాళీగా వదిలేస్తున్నారు. ఇప్పటికే 25 వేల ఎకరాలను సాగు చేయలేక ఖాళీగా వదిలేశారు.

రాయలసీమలో 40 శాతానికి మించని సాగు

వర్షాభావ పరిస్థితుల వలన రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సగటున 40 శాతానికి మించి పంటలు సాగవని పరిస్థితి నెలకొంది. తిరుపతి, కర్నూల్లో ఒకింత మెరుగ్గా ఉంది. ప్రకాశం జిల్లాలో 19 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగవగా, అన్నమయ్య జిల్లాలో 23 శాతం, వైఎస్సార్ జిల్లాలో 28 శాతం, చిత్తూరు జిల్లాలో 32 శాతం, అనంతపురంలో 40 శాతం, నంద్యాలలో 47 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 50 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. రాయలసీమలో అత్యధికంగా సాగయ్యే వేరుశనగ పంట ఇప్పటి వరకు 40 శాతానికి మించలేదు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావంతో కనీస సాగు కూడా లేదు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ పత్తి, కంది, జొన్న పంటల్లో ఎదుగుదల కన్పించడంలేదు. ఎకరాకు వేరుశనగకు రూ. 20 వేలు, కందికి రూ.10 వేలు, పత్తికి రూ.15 వేల చొప్పున ఇప్పటికే పెట్టుబడులు పెట్టారు. పంటలు ఎదుగూ బొదుగూ లేకపోవడంతో పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి కన్పించడంలేదు. ప్రత్యామ్నాయంగా ఉలవలు, అలసంద, జొన్న, కొర్ర, పెసర నాటుకోవాలని శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. అదను దాటిపోవడంతో మెజార్టీ రైతులు ప్రత్యామ్నాయ పంటలూ వేయడంలేదు. పొలాల్ని ఖాళీగా వదిలేస్తున్నారు.

అశనిపాతంలా ప్రభుత్వ నిర్ణయాలు

ఆపత్కాలంలో రైతులకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం అన్నదాతను మరింత కుంగదీసే నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. గతంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన కార్యక్రమాలకు బాబు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం చేస్తామంటూ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని చంద్రబాబు అటకెక్కించేశారు. ప్రీమియం బకాయిలు చెల్లించకపోవడంతో ఖరీఫ్-2023 సీజన్‌కు సంబంధించి ప్రస్తుత సీజన్‌లో అందాల్సిన పంటల బీమా పరిహారమూ రైతులకు దక్కలేదు. మరొకపక్క పైసా భారం పడకుండా రైతులకు ఎంతో మేలు చేస్తున్న ఉచిత పంటల బీమాపైనా బాబు ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ పథకాన్ని ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వరకు మాత్రమే అమలు చేస్తామని చెప్పడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కౌలు రైతులకు అండగా నిలుస్తున్న పంట హక్కు సాగుదారుల చట్టాన్ని చాప చుట్టేయాలని బాబు సర్కారు నిర్ణయించింది.

ఆర్బీకేల ద్వారా ఎరువుల సరఫరా లేనట్టే..

గత ఐదేళ్లుగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) రైతాంగానికి అన్ని విధాలుగా అండదండగా నిలిచాయి. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు అన్నీ గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా అందేవి. దీంతో రైతులు ట్రాక్టర్లు, ఆటోలకు ఖర్చు పెట్టుకొని మండల కేంద్రాలు లేదా పట్టణాలకు వెళ్లి వీటిని తెచ్చుకోవాల్సిన వ్యయప్రయాసలు తప్పాయి. సమయానికి ఎరువులు, మందులు చల్లడంవల్ల పంటలకు మేలు కలిగేది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్బీకే వ్యవస్థను బాబు కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఈ కష్టకాలంలో రైతులకు వెన్నంటి నిలవాల్సిన ఆర్బీకే సిబ్బందిని మరుగుదొడ్ల సర్వే వంటి వ్యవసాయేతర పనులకు ఉపయోగిస్తోంది. సొసైటీలకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్బీకేల ద్వారా ఎరువుల సరఫరా నిలిపివేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ సీజన్ ప్రారంభమయ్యే సమయానికే 62 వేల టన్నుల ఎరువులను ఆర్బీకేలలో నిల్వ చేశారు. ఆ తర్వాత ఒక్క టన్ను కూడా కేటాయించబోమని ప్రభుత్వం తెగేసి చెప్పింది. ఇప్పుడు అనేక ఆర్బీకేల్లో ఎరువులు దొరక్క రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్బీకేల్లో ఉన్న కొద్దిపాటి ఎరువులను స్థానిక టీడీపీ నేతలు వారు చెప్పినవారికే ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రైతులంతా గతంలోలా మండల కేంద్రాలు లేదా సమీపంలోని పట్టణాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగు మందుల సరఫరాను కూడా బాబు ప్రభుత్వం నిలిపివేసింది. కనీసం రైతులు కోరుకున్న విత్తనాలను కూడా సరఫరా చేయడం లేదు. బీపీటీ 5204, జేఎల్‌జీ 384 వంటి విత్తన రకాలు బ్లాక్ మార్కెట్‌కి తరలిపోయాయి. దళారులు వీటిని ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు విక్రయిస్తూ రైతును దోపిడీ చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. సీజన్ ప్రారంభమై 70 రోజులైనా పూర్తి స్థాయిలో ఈ క్రాప్ నమోదు కాలేదు. సీసీఆర్సీ కార్డులు రెన్యువల్ చేసుకున్న కౌలు రైతులకు సరిపడిన మేరకు రుణ పరపతి కల్పించడంలేదు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను మొక్కుబడి తంతుగా మార్చేశారు. కరువుతో అల్లాడుతున్న రాయలసీమ జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటలపై అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

నారు వేసి వదిలేశాం



అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామంలోని నాకున్న 4 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పంటకు విత్తనాలు చల్లుకున్నాం. నారుమడి సిద్ధం చేసిన నాటి నుంచి నెలరోజులు వర్షం కురిసింది. ముంపునీరు దిగే పరిస్థితి కనిపించడంలేదు. భారీ వర్షాల కారణంగా రెల్లుగడ్డ గ్రామంల్లో సుమారు 200 ఎకరాల్లో ముంపు ఏర్పడి నారుమళ్లు పూర్తిగా కుళ్లిపోయాయి. ఖరీఫ్‌లో వరి నాట్లు వేసే పరిస్థితి లేదు. భారీ వర్షాలతో పంట ముంపు బారిన పడుతుండటంతో కనీసం పెట్టుబడి కూడా దక్కడంలేదు. అల్లవరం మండలంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారం లేకపోతే వ్యవసాయం చేయడానికి ఏ రైతూ ముందుకు రాడు.

– మొల్లేటి రామభద్రరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఆదుకొనే పరిస్థితులు కనిపించడంలేదు



ఎర్రకాల్వ వరదకు ఆరుగాలం శ్రమ వరదలో కొట్టుకుపోయింది. ఎకరాకు రూ.15 వేల ఖర్చు చేసి ఊడ్పులు ఊడ్చిన తర్వాత ముంపు వచ్చింది. నాలుగు రోజుల తర్వాత వరద తగ్గితే మళ్లీ నారుమడులు వేశాం. దమ్ము చేయించాం. దీనికి మరో ఐదు వేల రూపాయలు ఖర్చయింది. మొత్తం ఎకరాకు రూ.20 వేలు ఖర్చయ్యింది. ఒక్క ఆరుళ్ల గ్రామంలోనే వెయ్యి ఎకరాలకు ముంపు వచ్చింది. ప్రభుత్వం ఆదుకుంటే గట్టెక్కుతాం. కానీ ఆదుకొనే పరిస్థితులే కనిపించడంలేదు.

– సతీష్, రైతు, ఆరుళ్ల, ప.గోదావరి జిల్లా

ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏదీ?



ప్రస్తుత ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో వేరుశనగ, 4 ఎకరాల్లో కంది సాగు చేసా. ఇప్పటివరకు వేరుశనగ పంటకు రూ.60 వేలు, కందికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. వర్షాల్లేకపోవడంతో పంట ఎండిపోయింది. రూ.లక్ష పెట్టుబడి కోల్పోయాను. ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– నాగభూషణం, కదిరిదేవరపల్లి, అనంతపురం జిల్లా

పెట్టుబడి సాయమైనా జమ చేయలేదు



ఖరీఫ్‌లో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ఓ వైపు అధిక వర్షాలు, మరో వైపు వర్షాభావ పరిస్థితులు. ఇటువైపు పంటలు మునిగిపోతుంటే.. అటువైపు పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేయడంలేదు. ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీ అమలు చేయకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నాం.

– జి.ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నిందితులెవరో తేల్చకుండా బెదిరింపులా?

- రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం దర్యాప్తులో విజయవాడ సీపీ తీరుపై ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆలోచనాపరుల విస్మయం
- రాత్రి 9 తర్వాత స్మృతివనం సిబ్బందిని బయటకు పంపిందెవరు?

సాక్షి, అమరావతి: రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం ఘటన కేసు దర్యాప్తులో విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆలోచనాపరులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు బరితెగించిన ఆగంతకులెవరో తేల్చకుండా.. ఆ సంఘటనను వక్రీకరించిన పత్రికలు, సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించడంపై విస్తుపోతున్నారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్పించడం కాదా? అని నిలదీస్తున్నారు. విజయవాడ నడిబొడ్డున రాజ్‌భవన్, పోలీసు కమిషనర్ కార్యాలయానికి కూత వేటు దూరంలోని అంబేడ్కర్ స్మృతివనంలో సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు ఈనెల 8న రాత్రి కొందరు దుండగులు తెగబడ్డారు. స్మృతివనంలో పనిచేస్తున్న సిబ్బందిని రాత్రి 9 గంటలకు అక్కడి నుంచి బయటకు పంపి లైట్లన్నీ ఆర్పేసి సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ సీఎం జగన్ పేరును ధ్వంసం చేశారు. ఈ ఘటన జరుగుతుండగానే మీడియా ప్రతినిధులు పోలీసు కమిషనర్‌కు తెలిపేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. స్మృతివనం వద్దకు చేరుకున్న మీడియా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆలోచనాపరులను చూసి ఆగంతకులు పారిపోయారు. లేదంటే అంబేడ్కర్ విగ్రహం విధ్వంసానికి గురయ్యేదని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యోన్మాదంపై ఆగ్రహజ్వాల..

సామాజిక అభ్యున్నతి ద్వారానే దళిత వర్గాల తలరాత మారుతుందని బాబా సాహెబ్ అంబేడ్కర్ నినదించి ఆగస్టు 8వతేదీ నాటికి సరిగ్గా 95 ఏళ్లు. అదే రోజు విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ మూకలు ఉన్మాదంతో పేట్రేగిపోవడం దేశవ్యాప్తంగా యావత్ దళిత సమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది. స్వయంగా ప్రభుత్వమే పూనుకుని రాజ్యాంగ నిర్మాతపై దాడికి ఉన్మత్త మూకలను ప్రేరేపించడంపై ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆలోచనాపరులు మండిపడుతున్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనలో నిందితులెవరో తేల్చాలని ఉద్యమిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కొందరు అధికారులు, పోలీసుల సమక్షంలో సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు బరితెగించారని స్పష్టం చేస్తున్నారు. జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతో ఎంపిక చేసిన కొందరు అధికారుల సమక్షంలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగినట్లు స్పష్టమవుతోందని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని విధ్వంసం చేసేందుకు తెగబడ్డ ఉన్మాదులెవరో తేల్చకుండా కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తూ సామాజిక వర్గాలు, దళిత సంఘాలను రెచ్చగొడుతూ వైషమ్యాలను సృష్టిస్తున్నాయని విజయవాడ సీపీ ఎస్వీ రాజశేఖరబాబు వ్యాఖ్యానించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సీపీ గారూ.. సమాధానం చెబుతారా?

- రాజ్‌భవన్, పోలీసు కమిషనర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న స్మృతివనంలో లైట్లన్నీ ఆర్పేసి అంబేడ్కర్ విగ్రహంపై కొందరు ఆగంతకులు దాడి చేయడం భద్రతా వైఫల్యం కాదా?
- అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేస్తున్నారనే సమాచారాన్ని మీడియా మీకు అందించడానికి ప్రయత్నించినప్పుడు మీరు అందుబాటులోకి రాలేదన్నది వాస్తవం కాదా?
- మీడియా ప్రతినిధులు, అంబేడ్కర్ ఆలోచనాపరులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున స్మృతివనం వద్దకు చేరుకోవటాన్ని చూసే కదా ఆగంతకులు పారిపోయారు? ఆ తర్వాతే అక్కడికి పోలీసులు వచ్చారన్నది నిజం కాదా?
- అంబేడ్కర్ స్మృతివనం చుట్టూ సీసీ కెమెరాలున్నాయి. వాటి ఫుటేజీని బయటపెట్టి నిందితులెవరో ఎందుకు తేల్చరు?
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కనుసన్నల్లో ఎంపిక చేసిన పచ్చమూకలే అంబేడ్కర్ విగ్రహంపై దాడికి తెగబడ్డాయన్న నిజం బయటపడుతుందనే సీసీ ఫుటేజీని బహిర్గతం చేయడం లేదా? ఇది ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సింది పోయి ఖూనీ చేసిన వారికి వత్తాసు పలకడం కాదా?
- సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును అప్పటికే ధ్వంసం చేశారు. స్మృతివనం వద్దకు మీడియా, అంబేడ్కర్ ఆలోచనాపరులు, ప్రజాస్వామ్యవాదులు చేరుకునే సరికి ఆగంతకులు పారిపోయారు. లేదంటే అంబేడ్కర్ విగ్రహాన్ని విధ్వంసం చేసే వారన్నది వాస్తవం కాదా?
- అంబేడ్కర్ విగ్రహంపై దాడి ఘటనను బహిర్గతం చేయడం మీ దృష్టిలో వక్రీకరించడమా? అది సామాజిక వర్గాలను, దళిత సంఘాలను రెచ్చగొట్టి వర్గాల మధ్య వైషమ్యాలు సృష్టించడమా?

అంబేడ్కర్ జోలికి వస్తే సహించం



విజయవాడలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



చిత్తూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహంపై దాడి యత్నంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

కొవ్వొత్తులతో ప్రదర్శనలు చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, నెట్‌వర్క్: విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర్ స్మృతివనంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి జరిగిన ప్రయత్నాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నిరసించారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు శనివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శనలు చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహం జోలికి వస్తే సహించబోమని నినదించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద కొవ్వొత్తులతో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

- గుంటూరు నగరంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా తదితరులు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో రాస్తారోకో, కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. యర్రగొండపాలెంలో జరిగిన నిరసనలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

- అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేసి, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేత ఈర లక్కప్ప ఆధ్వర్యంలో, హిందూపురంలో పార్టీ నేత దీపిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కర్నూలులో మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. కల్లూరులో జరిగిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- విశాఖ నగరంలో వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు ఆధ్వర్యంలో, అనకాపల్లిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో, అడ్డరోడ్డు కూడలిలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఇచ్ఛాపురంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, రణస్థలంలో పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పాతపట్నంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి పాల్గొన్నారు.
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొయ్యలగూడెం, ఉంగుటూరు, దెందులూరు, నరసాపురం, కైకలూరు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో, తాళ్లపూడిలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో, రాజానగరంలో పార్టీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. కాకినాడ జిల్లా జగ్గంపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

తండ్రి కుమారుని ప్రేమించుచున్నాడు.
గనుక ఆయన చేతికి సమస్తము అప్పగించి యున్నాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి రా.3.34 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** స్వాతి తె.5.42 వరకు (తెల్లవారితే సోమవారం),తదుపరి విశాఖ, **వర్జ్యం:** ఉ.9.34 నుండి 11.18 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.47 నుండి 5.35 వరకు, **అమృతఘడియలు:** రా.7.54 నుండి 9.41 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.26
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జగదీప్ ధన్‌ఖడ్ (రాజ్యసభ చైర్మన్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఒకటేదైనా ఆఖరు అవటం కోసం మనం ఎదురుచూస్తూ ఉన్నామంటే అర్థం... అందులో మనం ఆరంభం నుంచి కూడా ఎంతగానో అలసిపోయి ఉన్నామని!

అసలైతే బడ్జెట్ సమావేశాలు రేపు సోమవారంతో ఆఖరు అవాలి! కానీ రెండు రోజుల ముందే శుక్రవారం నాడు ముగిం చేయటం వల్ల మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంది. సభలో ఖర్గే, జైరాం రమేశ్, డెరెక్ ఒబ్రియన్, జయా బచ్చన్... ఒక్కొక్కరూ ఒక్కో విధంగా నన్ను చిత్రవధ చేశారు.

రాజ్యసభ చైర్మన్‌గా ఈ ఇరవై రోజులూ నేను పడిన నరకంతో పోలిస్తే... పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా మూడేళ్లు నేను మమతా బెనర్జీతో పడిన నరకమే ఎంతో నయంగా ఉన్నట్లు నాకిప్పుడు అనిపిస్తోంది!

సభలో ఖర్గే ఎప్పుడేం డిమాండ్ చేస్తారో తెలియదు. జైరాం అన్యమానం నా వైపు చూస్తూ ఎందుకు నవ్వుతుంటారో తెలియదు. ఒబ్రియన్ ఎందుకు అనవసరంగా గొంతు పెంచి మాట్లాడతారో తెలియదు. జయా బచ్చన్ తన పేరును ఎలా సంబోధిస్తే ఎలా రియాక్ట్ అవుతారో తెలియదు.



సభలో 87 మంది బీజేపీ సభ్యులు ఉన్నారు. సమానంగా అపోజిషన్ కూటమిలో 87 మంది ఉన్నారు. బలం సరి సమానంగా ఉందని చెప్పి, అకారణంగా ఎవరైనా బరిలోకి దిగుతారా?! ఇదేమీ రాజ్యసభలో జరుగుతున్న 87 కిలోల కేటగిరీలోని రెజ్లింగ్ కాదు కదా!!

సభలో జమ్మూ–కశ్మీర్ జమాఖర్చులపై సీరియస్‌గా చర్చ జరుగుతున్నప్పుడు ఖర్గే హఠాత్తుగా పైకి లేచి.. "చైర్మన్ సర్... ఎమర్జెంట్ ఇష్యూ సర్..." అన్నారు.

బడ్జెట్‌పై మాట్లాడుతున్న ఎంపీని ఆపి, "ఖర్గేజీ! ఏంటి అంత ఎమర్జెన్సీ?" అని అడిగాను.

"రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ని డిస్‌క్వాలిఫై చెయ్యటం మీద మనం డిస్కస్ చెయ్యాలి చైర్మన్ సర్! వినేశ్‌కు ఒలింపిక్స్‌లో జరిగిన తీవ్రమైన అన్యాయానికి మా హృదయం ద్రవించిపోతోంది..." అన్నారు ఖర్గే. మా హృదయం అంటే... 'ఇండియా' కూటమి హృదయం అని అతని భావన కావచ్చు.

"మీరే కాదు ఖర్గేజీ! రాష్ట్రపతి, ప్రధాని, నేను... దేశం యావత్తూ ద్రవీభవన స్థితిలోనే ఉంది..." అన్నాను.

"అందుకే అంటున్నా చైర్మన్ సర్, బడ్జెట్‌ను పక్కన పెట్టి వినేశ్ మీద డిస్కషన్ పెట్టండని..." అన్నారు ఖర్గే. వెంటనే కూటమి ఎంపీలంతా అయనకు సపోర్టుగా బల్లలు చరిచారు!

"ఖర్గేజీ! సభను జరగనీయకుండా మీరిలా మీ కూటమి సభ్యులతో కలిసి పట్టు పట్టటం కూడా వినేశ్‌ను అగౌరవపరచటమే..." అన్నాను". ఆ మాటకు వ్యతిరేకంగా కూటమి ఎంపీలంతా మళ్లీ బల్లలు చరిచారు.

"అసలు దీని వెనుక ఎవరున్నారో తేల్చాలి చైర్మన్ సర్..." అన్నారు ఖర్గే!

వినేశ్‌ని డిస్‌క్వాలిఫై చెయ్యటం వెనుక బ్రిజ్‌భూషణ్ ఉండి ఉంటారని ఖర్గే అనుమానం. బ్రిజ్ భూషణ్ వెనుక 'ఎవరైనా' ఉండి ఉండాలని ఖర్గే ఆకాంక్ష. బ్రిజ్ భూషణ్‌పై వినేశ్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు కనుక అది మనసులో పెట్టుకుని బ్రిజ్ భూషణ్ 'ఎవరితోనో' చెప్పించి, వినేశ్‌ను డిస్‌క్వాలిఫై చేయించి ఉంటారని ఆయన ఊహ.

"ఎవరి అనుమానాలకూ, ఆకాంక్షలకు, ఊహలకు సభలో చోటు లేదు ఖర్గేజీ..." అన్నాను.

మళ్లీ కూటమి అరుపులు, కేకలు, జైరాం నవ్వులు, జయా బచ్చన్ ముక్కు విరుపులు.

చైర్మన్ అంటే గౌరవం లేదు. కనీసం చైర్మన్ కూర్చునే చైర్‌కు ఇవ్వాల్సిన రెస్పెక్ట్ కూడా లేదు. కుర్చీలో ఉన్న వ్యక్తిని బట్టే కుర్చీకి విలువ అన్నట్లు ఉంది వారి ప్రవర్తన. మరి కుర్చీకి దానికదిగా ఉండే విలువ ఏమైనట్లు? సభ్యులుగా వాళ్లకు ఉండాల్సిన బాధ్యత ఏమిటన్నట్లు?!

వీటిని బడ్జెట్ సమావేశాలు అనేకంటే, 'రాజ్యసభ చైర్మన్ అవమానపడిన సమావేశాలు' అనటమే బాగుంటుంది.

ఇది రాజ్యాంగంపై దాడే!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



ఆకతాయిల పని కాదది. పథకం ప్రకారమే జరిగింది. ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతోనే జరిగింది. అదేదో చాటుమాటు ప్రాంతం కాదు. నిర్జన ప్రదేశం కాదు. విజయవాడ నడిగడ్డ. నగరంలోనే ఏక్ నంబర్ బిజినెస్ రాస్తా. బందర్ రోడ్. రాత్రి తొమ్మిది గంటల వేళ ఆ రోడ్డు మీద ప్రవహించే రణగొణ పీక్ స్థాయిలో ఉంటుంది. అటువంటి సమయంలో అంబేడ్కర్ స్మృతివనం లోకి కొందరు వ్యక్తులు 'పనిముట్ల'తో ప్రవేశించి, సందర్శకు లను వెళ్లగొట్టి, లైట్లార్పేసి దాడికి తెగబడ్డారంటే... ఈ దాడికి స్వయానా పోలీసు యంత్రాంగమే కాపు కాసిందంటే... అధికార పీఠం అండదండలు లేవని ఎలా అనుకోగలం? అందుకే ఈ దాడి రాజ్య ప్రేరేపితం.

మీడియా ప్రతినిధులతోపాటు పలువురు పురజనులు హుటాహుటిన అక్కడికి చేరుకోకపోతే ఆ దాడి ఎంతదూరం వెళ్లేదో? టాప్ ప్రయారిటీ టాస్క్‌గా అక్కడున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించగలిగారు. ఇంకా ముందు కెళ్లడం జనం రాకతో కుదరలేదు. స్మృతి వనంలోకి దొంగల్లా ప్రవేశించి, లైట్లార్పేసి దాడికి తెగబడుతున్న వైనంపై సమా చారం అందించినా వెంటనే పోలీసులు స్పందించకపోవడం ఏమిటి? ప్రతిపక్ష నాయకుడి పేరునే కదా తొలగించింది... విగ్రహంపై దాడి జరగలేదు కదా అనే సన్నాయి నొక్కులు పాలక పార్టీ తైనాతీల నోటి వెంట వినబడుతున్నాయి. ఈ లెక్కన ప్రతిపక్షాలకు చెందిన వారి ఇళ్లల్లో అక్రమంగా ప్రవేశించి దొంగతనం చేసినా ఫరవాలేదన్న మాట. పోలీసులు రక్షణ కూడా కల్పిస్తారేమో! నంద్యాల జిల్లాల్లో ఒక వైసీపీ కార్యకర్తను పట్టిగ్గా తెగనరుకుతుంటే ఆ హంతకులకు రక్షణగా పోలీసులు నిలబడిన వైపరీత్యాన్ని కూడా ఈ వారమే చూడవలసి వచ్చింది. ఏపీలో కొత్త రాజ్యాంగం అమల్లోకి వచ్చిందా?

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ అంతస్సారం... సర్వమానవ సమతావాదం. ఈ సిద్ధాంతానికీ ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్న ఎన్డీఏ కూటమి భావజాలానికీ అస్సలు పొసగదు. కూటమి పెద్దన్న భారతీయ జనతా పార్టీకి ఏ మాత్రం గిట్టదు. బీజేపీ తోలుబొమ్మను ఆడించే తెర వెనుక ఆరెస్సెస్‌కు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చే యాలన్నది చిరకాల వాంఛ. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించింది. నాలుగు రోజుల్లోనే (నవంబర్ 30) ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' దాన్ని ఆడిపోసుకోవడం మొదలుపెట్టింది.

భారత రాజ్యాంగంలో భారతీయతే లేదని 'ఆర్గనైజర్' దుయ్యబట్టింది. ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలైన స్పార్టాకు లైకర్గస్‌లాగా, ఏథెన్స్‌కు సోలాన్ లాగా భారత్‌కు మనువు ఉండగా, ఆయన రూపొందించిన మనుస్మృతి ఉండగా ఈ రాజ్యాంగమెందుకని 'ఆర్గనైజర్' ప్రశ్నించింది. ఈ మనుధర్మ శాస్త్రం ఎటువంటిదో తెలిసిందే కదా! అసమానతలతో కూడిన కుల వ్యవస్థను సమర్థించిన శాస్త్రం. దళితులనైతే వర్ణవ్యవస్థకు ఆవల బహిష్కృతులుగా, అస్పృశ్యులుగా పరిగణించిన న్యాయ సంహిత ఇది. స్త్రీలకు స్వాతంత్ర్యం అవసరం లేదని కూడా మనుస్మృతి అభిప్రాయపడింది. 'పితా రక్షతి కౌమారే, భర్తా రక్షతి యౌవనే, రక్షంతి స్థవిరే పుత్రా, న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' (బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కుమా రుని రక్షణలో ఉండాలి. స్త్రీలకు స్వతంత్రత అవసరం లేదు)... ఇదీ మనుస్మృతి!

ఇటువంటి మనుధర్మ సంహిత భారత రాజ్యాంగంగా ఉండాలని ఒక్క 'ఆర్గనైజర్' మాత్రమే కోరుకోలేదు. ఆరెస్సెస్ సిద్ధాంతవేత్తగా ప్రసిద్ధుడైన గురు గోల్వాల్కర్ (బంచ్ ఆఫ్ థాట్స్), ఆరెస్సెస్‌కు ప్రాతఃస్మరణీయుడైన వినాయక్‌రావు దామోదర్ సావర్కర్‌లు కూడా వివిధ సందర్భాల్లో అభిలషిం చారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తొలి రోజుల్లోనే కాదు, ఆ తర్వాతి కాలంలో కూడా ఆరెస్సెస్ అభిప్రాయం మారలేదని ప్రముఖ కన్నడ రచయిత దేవనూర్ మహాదేవ ఆరెస్సెస్‌పై రాసిన ఒక చిన్న పుస్తకంలో నిరూపించారు. ఆ సంస్థ 1993 జనవరిలో విడుదల చేసిన శ్వేతపత్రంలో భారత రాజ్యాంగాన్ని 'విదేశీ భావాలతో కూడిన హిందూ వ్యతిరేక సంహిత'గా అభిశం సించారని మహాదేవ రాశారు.

ఆరెస్సెస్ అనే సంస్థ ప్రస్తుతం మూడు అంతర్లీన లక్ష్యాల కోసం పనిచేస్తున్నదని మహాదేవ వివరించారు. భారతదేశ ఫెడ రల్ స్వభావానికి విరుద్ధంగా కేంద్రీకృత అధికార స్థాపన మొదటి లక్ష్యం. ఇక రెండవది – మనుధర్మ శాస్త్రం ప్రబోధించిన

స్థూలంగా మనుషులంతా సమానం కాదని మనుధర్మ శాస్త్రం అభిప్రాయపడుతుంది. మనుషుల్లో కొందరు ఉత్తమ జాతులవారు, కొందరు నీచ జాతులవారు. ఈ నీచ జాతులవారు ఉత్తమ జాతులను సేవిస్తూ జీవిం చాలి. అన్ని జాతుల్లోనూ పురుషుల స్థాయి ఎక్కువ. స్త్రీల స్థాయి తక్కువ. పురుషుల అడుగుజాడల్లో వారి పాద ధూళిని తలదాల్చుతూ స్త్రీలు మనుగడ సాగించాలి. ఇటువంటి మనువాద తుప్పు భావాలను చీల్చి చెండా డుతూ మనుషులంతా ఒక్కటేనని చాటిచెప్పిన నవీన ధర్మశాస్త్రం అంబేడ్కర్ విరచిత భారత రాజ్యాంగం. ఇటువంటి రాజ్యాంగంతో మనువాదులు రాజీపడటం అంత సులభసాధ్యమేమీ కాదు. అందుకే గడిచిన డెబ్బయ్ ఐదేళ్లుగా ఈ రాజ్యాంగంపై, దాన్ని రచించిన బాబాసాహెబ్‌పై వివిధ రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయి. రాజకీయ రంగంలో మనువాదుల ప్రాబల్యం కారణంగానే రాజ్యాంగాన్ని తు.చ. తప్పకుండా అమలు చేయడం ఇప్పటి దాకా సాధ్యం కాలేదు.

ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబు నాయకత్వం మొదలైన దగ్గర నుంచీ తెలుగుదేశం పార్టీలో వచ్చిన భావజాల మార్పు దాన్ని బీజేపీకి సహజ మిత్రపక్షంగా మార్చింది. కాకుల్ని కొట్టి గద్దలకు వేయడం ఆ పార్టీ ఆర్థిక సిద్ధాంతంగా మారింది. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన కాలంలో నిజాం షుగర్స్, ఆంధ్ర పేపర్, ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్ తదితర 56 ప్రభుత్వరంగ సంస్థలను చంద్రబాబు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమో, మూసివేయడమో చేశారు. ప్రైవేట్ వ్యక్తులు బాగా బలిస్తే... వారి దగ్గర నుంచి జారిపడే చిల్లరతో పేదలు బతికేస్తారనే ట్రికిల్‌డౌన్ ఆర్థిక సిద్ధాంతం చంద్రబాబుది. భారత రాజ్యాంగం కోరుకున్న పేదల సాధికారతతో ఈ ఆర్థిక సిద్ధాంతానికి సాపత్యం కుదరదు.

వర్ణాశ్రమ ధర్మం. అసమానతలతో కూడిన కుల వ్యవస్థను కాపాడటం – సమాజంపై ఆర్యుల ఆధిపత్యాన్ని రుద్దడం మూడవది. ఆర్యులంటే ఎవరు? వర్ణాశ్రమంలో వారి స్థానాలేమిటి? తదితర అంశాలపై వివరణలు అవసరం కాకపోవచ్చు. ఇదిగో ఈ మూడు లక్ష్యాల సాధనలో భాగంగానే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల సిలబస్ సవరణ, మతాంతీకరణ వ్యతిరేక బిల్లును తేవడం తదితర చర్యలు చేపట్టిందని మహాదేవ అభియోగం.

స్థూలంగా మనుషులంతా సమానం కాదని మనుధర్మ శాస్త్రం అభిప్రాయపడుతుంది. మనుషుల్లో కొందరు ఉత్తమ జాతులవారు, కొందరు నీచ జాతులవారు. ఈ నీచ జాతుల వారు ఉత్తమ జాతులను సేవిస్తూ జీవించాలి. అన్ని జాతుల్లోనూ పురుషుల స్థాయి ఎక్కువ. స్త్రీల స్థాయి తక్కువ. పురుషుల అడుగుజాడల్లో వారి పాదధూళిని తలదాల్చుతూ స్త్రీలు మనుగడ సాగించాలి. ఇటువంటి మనువాద తుప్పు భావాలను చీల్చి చెండాడుతూ మనుషులంతా ఒక్కటేనని చాటిచెప్పిన నవీన ధర్మ శాస్త్రం అంబేడ్కర్ విరచిత భారత రాజ్యాంగం. ఇటువంటి రాజ్యాంగంతో మనువాదులు రాజీపడటం అంత సులభసాధ్య మేమీ కాదు. అందుకే గడిచిన డెబ్బయ్ ఐదేళ్లుగా ఈ రాజ్యాంగం పై, దాన్ని రచించిన బాబాసాహెబ్‌పై వివిధ రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయి. రాజకీయ రంగంలో మనువాదుల ప్రాబల్యం కారణంగానే రాజ్యాంగాన్ని తు.చ. తప్పకుండా అమలు చేయడం ఇప్పటి దాకా సాధ్యం కాలేదు.

ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబు నాయకత్వం మొదలైన దగ్గర నుంచీ తెలుగుదేశం పార్టీలో వచ్చిన భావజాల మార్పు దాన్ని బీజేపీకి సహజ మిత్రపక్షంగా మార్చింది. కాకుల్ని కొట్టి గద్దలకు వేయడం ఆ పార్టీ ఆర్థిక సిద్ధాంతంగా మారింది. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో నిజాం షుగర్స్, ఆంధ్ర పేపర్, ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్ తదితర 56 ప్రభుత్వ రంగ సంస్థలను చంద్రబాబు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమో, మూసివేయడమో చేశారు. ప్రైవేట్ వ్యక్తులు బాగా బలిస్తే... వారి దగ్గర నుంచి జారిపడే చిల్లరతో పేదలు బతి కేస్తారనే ట్రికిల్‌డౌన్ ఆర్థిక సిద్ధాంతం చంద్రబాబుది. భారత రాజ్యాంగం కోరుకున్న పేదల సాధికారతతో ఈ ఆర్థిక సిద్ధాంతా నికి సాపత్యం కుదరదు.

పేద వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యనూ, వైద్యాన్నీ ఆయన అందనీయలేదు. కనీస వైద్య సేవలు కూడా ఉచితంగా అందడానికి వీల్లేదని యూజర్ ఛార్జీలను ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదే! వరస కరువుకాటకాలతో, నకిలీ ఎరువులు, పురుగుల మందుల వాడకంతో చితికిపోయిన రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇవ్వడానికి వీల్లేదని ఆయన చెప్పిన పాఠాలు ఎప్పటికీ తెలుగు ప్రజలు మరిచిపోరు. విభజిత రాష్ట్ర ముఖ్య మంత్రిగా కూడా ఈ ఆర్థిక విధానాలకే ఆయన కట్టుబడి ఉన్నారు. ఆర్థిక రంగంలోనే కాదు, సామాజిక రంగంలోనూ ఆయన భావజాలానికీ, మనుస్మృతికీ మధ్యన పెద్దగా తేడాలుం డవు. తన కులతత్వ ఆలోచనలు, పురుషాహంకార అభిప్రాయా లను దాచుకోవడం కూడా ఆయనకు సాధ్యపడలేదు. విభజిత రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే బీసీల తోకలు కత్తిరిస్తానని ఆయన బహిరంగంగానే బెదిరించారు. 'ఎస్సీ కులాల్లో పుట్టా లని ఎవరు కోరుకుంటార'ని ప్రెస్‌మీట్‌లోనే ఈసడించు కున్నారు. 'న్యాయస్థానాల్లో జడ్జీ పదవులకు బీసీలు పనికిరా రం'టూ కేంద్రానికి లేఖలు రాశారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా' అని తన మనువాద భావాలను బయటపెట్టుకున్నారు.

ఈ మనువాద రాజకీయాలకు పూర్తి భిన్నంగా గడిచిన ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగింది. భారత రాజ్యాంగ లక్ష్యాల సాధన ఆశయంగా, సుస్థిర అభివృద్ధి ధ్యేయంగా సాగిన ఆయన ఐదేళ్ల పరిపాలన దేశం ముందు ఒక ఆదర్శ నమూనాను ఆవిష్కరించింది. ఈ నమూనాపై జరిగిన విద్వేషపూరిత విష ప్రచారం బహుశా ప్రపంచంలోని ఏ దేశంలో కూడా ఎప్పుడూ

ఈ మనువాద రాజకీయాలకు పూర్తి భిన్నంగా గడిచిన ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగింది. భారత రాజ్యాంగ లక్ష్యాల సాధన ఆశయంగా, సుస్థిర అభివృద్ధి ధ్యేయంగా సాగిన ఆయన ఐదేళ్ల పరిపాలన దేశం ముం దు ఒక ఆదర్శ నమూనాను ఆవిష్కరించింది. ఈ నమూ నాపై జరిగిన విద్వేషపూరిత విష ప్రచారం బహుశా ప్రపంచంలోని ఏ దేశంలో కూడా ఎప్పుడూ జరిగి ఉండదు. సమాజంలోని పేదవర్గాల సంక్షేమానికీ, మధ్య తరగతి కలల సాకారానికీ, మహిళల సాధికారతకూ మనువాద సంపన్న వర్గాలు మనస్ఫూర్తిగా సహకరిం చవు. ఈ వర్గాలను చంద్రబాబు ఏకం చేసుకున్నారు. వారి వద్దనున్న సకల అస్త్రశస్త్రాలు, హంగు ఆర్భాటాలతో యుద్ధానికి దిగారు. విద్వేషపు విషవాయువులతో కార్పెట్ బాంబింగ్ చేశారు. ఒక్కో నియోజకవర్గం ఒక్కో భోపాల్ మాదిరిగా విషవాయువులతో ఉక్కిరి బిక్కిరైంది.

విష ప్రచారాన్ని కొంతమందైనా నమ్మి ఉండవచ్చు. అరచేతిలో చూపెట్టిన వైకుంఠానికి మరికొంతమంది మోసపోయి ఉండవచ్చు. వోట్ ఫర్ డెమోక్రసీ (వీఎఫ్‌డీ), అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థలు బల్లగుద్ది చెబుతున్నట్టుగా ఈవీఎమ్‌లలో మాయాజాలం జరిగి ఉండవచ్చు. ఈ మాయాజాలంలో దేశంలోనే అత్యధికంగా యాభై లక్షల ఓట్లు ఆంధ్రప్రదేశ్ లోనే ఉన్నట్టు వీఎఫ్‌డీ వాదిస్తున్నది. కారణమేదైనా చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అలవాటు ప్రకారం చేతిలోని వైకుంఠాన్ని చెట్టెక్కించారు. ముసుగు చీల్చుకొని మనువాదం బయటకొచ్చింది.

జరిగి ఉండదు. సమాజంలోని పేదవర్గాల సంక్షే మానికీ, మధ్య తరగతి కలల సాకారానికీ, మహిళల సాధికా రతకూ మనువాద సంపన్న వర్గాలు మనస్ఫూర్తిగా సహకరిం చవు. ఈ వర్గాలను చంద్రబాబు ఏకం చేసుకున్నారు. వారి వద్ద నున్న సకల అస్త్ర శస్త్రాలు, హంగు ఆర్భాటాలతో యుద్ధానికి దిగారు. విద్వేషపు విషవాయువులతో కార్పెట్ బాంబింగ్ చేశారు. ఒక్కో నియోజకవర్గం ఒక్కో భోపాల్ మాదిరిగా విష వాయువులతో ఉక్కిరి బిక్కిరైంది.

విష ప్రచారాన్ని కొంతమందైనా నమ్మి ఉండవచ్చు. అరచేతిలో చూపెట్టిన వైకుంఠానికి మరికొంతమంది మోస పోయి ఉండవచ్చు. వోట్ ఫర్ డెమోక్రసీ (వీఎఫ్‌డీ), అసోసి యేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థలు బల్లగుద్ది చెబుతున్నట్టుగా ఈవీఎమ్‌లలో మాయాజాలం జరిగి ఉండ వచ్చు. ఈ మాయాజాలంలో దేశంలోనే అత్యధికంగా యాభై లక్షల ఓట్లు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నట్టు వీఎఫ్‌డీ వాదిస్తున్నది. కారణమేదైనా చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అలవాటు ప్రకారం చేతిలోని వైకుంఠాన్ని చెట్టెక్కించారు. ముసుగు చీల్చు కొని మనువాదం బయటకొచ్చింది.

మహిళా సాధికారతపై దాడి జరిగింది. 'అమ్మ ఒడి', 'చేయూత' వగైరా పథకాలు ఆగిపోయాయి. పేద విద్యార్థుల నాణ్యమైన చదువుపై దాడి జరిగింది. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన తదితర కార్యక్రమాలు పట్టాలు తప్పాయి. 'ఫ్యామిలీ డాక్టర్' మాయ మయ్యాడు. 'ఆరోగ్యశ్రీ'నీ నీరుకార్చారు. పాలనా వికేంద్రీకర ణకు చాపచుట్టారు. వలంటీర్ వ్యవస్థ మాయమైంది. ఆర్బీకేల సేవలు ఆవిరయ్యాయి. విత్తనాల కోసం ఐదేళ్ల తర్వాత రైతులు మళ్లీ క్యూలైన్లలో రోజుల తరబడి నిలబడుతున్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రభుత్వ వైద్యశాలలపై ప్రైవేటీ కరణ కత్తి వేలాడుతున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర రహదారులపై సైతం టోల్ వసూలుకు రంగం సిద్ధమైంది. రాజ్యాంగ లక్ష్యాలపై వరసగా దాడులు జరుగుతున్నాయి. అంబే డ్కర్ స్మృతివనంపై జరిగిన దాడిని ఒక ప్రతీకాత్మక దాడిగానే పరిగణించాలి. విజయవాడ నడిబొడ్డున ఆకాశమెత్తు అంబేడ్క రుడి మహాశిల్పాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఇది ఆంధ్రా మనువాదుల్లో కడుపు మంటకు కారణమైంది. నలభ య్యేళ్ల నాటి కారంచేడు కండకావరం తిమ్మిరి ఇంకా వదల్లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించి కొంత ఆనందాన్ని పొంది ఉండవచ్చు. ముందు ముందు మరిన్ని దాడులు జరగవచ్చు. ఆ దాడుల అసలు లక్ష్యం – భారత రాజ్యాంగం మాత్రమే!

vardhelli1959@gmail.com

అరుణాశయ బుద్ధమూర్తి




తెలకపల్లి రవి

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనాయకుడు బుద్ధదేవ్ భట్టాచార్య మృతి ప్రగతిశీల రాజకీయాలు, ప్రజా స్వామిక విలువలు కోరుకునేవారందరికీ విచారం కలిగించింది. రాజకీయ విభేదా లకు అతీతంగా ఆయనకు నేతలు నివాళు లర్పించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన నిబద్ధత, నిజాయితీ, నిరాడం బరత్వం, నిష్కపటత్వం వంటి విశిష్టతలను వారు గుర్తు చేసు కుంటున్నారు. దేశంలో కీలకమైన బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రానికి పదకొండేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా సాదాసీదా అపార్ట్‌మెం ట్‌లోనే ఆఖరి దాకా జీవితం గడిపిన ఆదర్శం ఆయనది. కమ్యూ నిస్టు ఉద్యమం సృష్టించిన త్యాగధనులలో మూడవ తరానికి చెందిన బుద్ధదేవ్ ప్రెసిడెన్సీ కాలేజీలో సాహిత్యం చదువుకుని విద్యార్థి సంఘాల ద్వారా 1966లో వామపక్ష ఉద్యమంలో ప్రవే శించారు.

1977లో తొలి వామపక్ష ప్రభుత్వంలో సమాచార, సాంస్కృ తిక మంత్రిగా చేరిన ఆయన 1982లో ఓడిపోయినా 1987లో మళ్లీ గెలిచి బాధ్యతలు చేపట్టారు. 1996లో జ్యోతిబాసు అనా రోగ్యం తర్వాత కీలకమైన హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగి దేశంలోనే కొత్తరికార్డు నెలకొల్పిన మహానాయకుడు జ్యోతిబాసు తర్వాత వామపక్ష కూటమి భవిష్యత్తు ఏమవుతుందనే సవాళ్లకు సమర్థమైన సమాధానంగా బుద్ధదేవ్ నిలిచారు. 2000 నుంచి పదకొండేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1985 నుంచి కేంద్ర కమిటీ, తర్వాత పొలిట్‌బ్యూరో సభ్యుడుగా సీపీఎంలో ముఖ్యపాత్ర పోషించారు. యువమంత్రిగా, డివైఎఫ్ఐ నాయకుడుగా 1979లో ఆయన వరంగల్‌లో ఉమ్మడి రాష్ట్ర తొలి మహాసభలకు రావడం ఈ రచయితకు గుర్తుంది. పాతికేళ్ల తర్వాత 2005లో అదే వరం గల్‌లో సీపీఎం మహాసభలలో బుద్ధదేవ్ చేసిన కీలక ప్రసంగంలో అప్పటికి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీ మత తత్వ రాజకీయాలపై నిశిత విమర్శలు అనువదించాను కూడా! "గుజరాత్‌లో జరిగిన దారుణాలకు సాటి ముఖ్యమంత్రిగా నేను సిగ్గుపడుతున్నాను" అని అప్పుడాయన అన్నారు. మృదుభాషిగా పేరొందిన బుద్ధదేవ్ రాజకీయ విషయాల్లో అంత నిక్కచ్చిగా ఉండేవారు.

నివాళి



బుద్ధదేవ్ భట్టాచార్య (1944-2024)

బుద్ధదేవ్ భట్టాచార్య హయాంలో తొలి రెండు ఎన్నికల్లోనూ ఫ్రంట్ విజయాలు కొత్త చరిత్ర సృష్టించాయి. 2006 ఎన్నికలలో వామపక్షాలకు 294కు 235 స్థానాలు వచ్చాయి. దానికన్నా ముందు 2004 లోక్‌సభ ఎన్నికలలోనూ 35 స్థానాలు వచ్చాయి. పార్లమెంటులో మొత్తం 60 స్థానాలతో వామపక్షాలు, అందులో 42 సీట్లతో సీపీఎం పాత్ర, ప్రభావాలు శిఖరాగ్రానికి చేరాయి. ఆ మద్దతే లేకపోతే కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వమే ఉండేది కాదు. కాంగ్రెస్ ఆ రాజకీయ సందేశాన్ని సవ్యంగా అర్థం చేసుకుని ఉంటే... అణు ఒప్పందం చిచ్చు పెట్టకపోతే చరిత్ర మరోలా ఉండేది.

బుద్ధదేవ్ సైద్ధాంతికంగా కొత్తపుంతలు తొక్కుతున్నారనీ, దార్శనికతతో పిడివాదాన్ని వదిలేశారనీ ఒక వైపున లేనిపోని పొగడ్తలు... మరోవైపున భూములు లాక్కొంటున్నారనే ప్రచారా లకు బడా మీడియా వేదికైంది. సరళీకరణ విధానాలను, భూ దోపిడీని వ్యతిరేకించినవే వామపక్షాలు కాగా ఆ ముద్రతో వాటిపైనే దాడి చేయడం బూర్జువా వర్గాల వ్యూహమైంది. వామపక్ష ఫ్రంట్ టార్గెట్‌గా సింగూరు, నందిగ్రామ్ ఘటన లపై అదేపనిగా ప్రచారాలు జరిగాయి. సింగూర్‌లో టాటా కార్ల ఫ్యాక్టరీ దాదాపు పూర్తవుతుంటే దాన్ని అడ్డుకోవడానికి ఆ రోజుల్లో మమతా బెనర్జీ చేసిన హడావిడి మర్చిపోరానిది. కాంగ్రెస్, మమతా బెనర్జీ బుద్ధదేవ్ ప్రభుత్వాన్ని ఓడించడమే పరమార్థంగా వ్యవహరించాయి. మావోయిస్టు పార్టీ కూడా గొంతు కలిపింది. వాటిలో కొన్ని తప్పొప్పులు లేవని కాదు గాని ప్రజలకు ఉపాధి పెంచాలన్నదే బుద్ధదేవ్ సంకల్పంగా ఉండేది. ఆ పరిణామాలపై చాలా సమీక్షలే జరిగాయి. అనేక అధికారిక నివేదికలు కూడా వచ్చాయి. ఇప్పుడు వాటిని సాకల్యంగా చూస్తే ఎవరికైనా పూర్తి నిజాలు తెలుస్తాయి. "టాటాలే బెంగాల్ నుంచి తరలిపోవడం వల్ల రాష్ట్రానికి చెప్ప లేని నష్టం జరిగింది. నేను ఎక్కడ తప్పు చేశానా అని కొన్నిసార్లు ఆశ్చర్యం కలుగుతుంటుంది. భూ సేకరణే తప్పా లేక భూ సేకరణ జరిగిన విధానమా? నేను ప్రతిపక్షాలపై మరీ మెతగ్గా వ్యవహరించానా? ఆ అనుభవాల నుంచి మనం పాఠాలు తీసు కోవాలి" అని ఆయన చెప్పారు.

బుద్ధదేవ్, జ్యోతిబాసు వంటివారు భద్రలోక్ అనీ, మమతా దీదీ ప్రజల మనిషని ప్రచారం చేసిన వారే ఇప్పుడు ఆమె నిరం కుశ పోకడలపై విరుచుకుపడుతున్నారు. మోదీ ఏకపక్షపాలన ముదిరాక ఆమె కూడా అనేక రాజకీయ విన్యాసాలతో ఉనికి కాపాడుకుంటున్నారు. బుద్ధదేవ్ మాత్రం 'మోదీ హఠావో, మమతా హఠావో' నినాదంతోనే రాజకీయ జీవితం ముగించారు. 34 ఏళ్ల పాటు పాలించిన వామపక్ష ప్రభుత్వం 2011లో ఓడి పోయాక నిర్బంధాలు తట్టుకుని బుద్ధదేవ్ గట్టిగా నిలబడ్డారు. ఆరోగ్యం సహకరించినంతవరకూ సమావేశాలలో, సభలలో పాల్గొంటూ, ఉద్యమాన్ని నిలబెట్టడంలో తన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. 2011లో ఓడిపోయిన తన నియోజకవర్గమైన జాదవ్ పూర్‌లో 2017లో పెద్ద మెజార్టీతో సీపీఎం అభ్యర్థినే గెలిపించు కోగలిగారు. ఆయన భార్య మీరా భట్టాచార్య, కుమారుడు సుచేతన్ కూడా ఆశయాల బాటలో తోడుగా నిలిచారు. ఎవరు ఎంత చెప్పినా పామ్ అవెన్యూలోని తన నిరాడంబర 'టు బెడ్ రూమ్ ఫ్లాట్' నివాసాన్ని మార్చుకోవడానికి బుద్ధదేవ్ ఒప్పు కోలేదు. ప్రభుత్వంలో ఉన్నప్పటికీ పాత అంబాసిడర్ కారునే ఆఖరు వరకూ ఆయన వాడారు.

2023లో మోదీ ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటిస్తే తీసుకోవడానికి నిరాకరించారు. ఆనారోగ్యంలో పరా మర్శించే పేరిట మమతా బెనర్జీ లేదా అప్పటి గవర్నర్ జగదీప్ ధన్‌ఖడ్ వంటివారు రాజకీయాలు చేయబోతే సాగనివ్వలేదు. ఇవన్నీ ఆయన వ్యక్తిత్వ ఒరవడికి అద్దం పడతాయి. ఆయన మరణానంతరం అధికారిక గన్ సెల్యూట్‌ను కూడా కుటుంబ సభ్యులు నిరాకరించారు.

కళా, సాహిత్య రంగాల్లో బుద్ధదేవ్ భట్టాచార్య కృషిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన రచయిత, కవి, నాటకకర్త కూడా! ఇన్ని రాజకీయాల సిద్ధాంత ఘర్షణల మధ్యనా టాగోర్ కవితలను 500 దాకా కంఠోపాఠంగా చెప్పేవారట! సంక్లిష్టమైన ఆధునిక రచయితలు కాఫ్కా, మార్క్వెజ్ వంటి వారి రచనలను ఆయన బెంగాలీలోకి అనువదించారు. సమాంతర చిత్రాలకు పేరెన్నికగన్న కొల్‌కతాలో నందన్ కానన్ కళాభవన్ పేరిట ఒక శాశ్వత వేదికను ఏర్పాటు చేయడానికి మంత్రిగా చొరవ తీసుకున్నారు. ప్రసిద్ధ బెంగాలీ రచయిత సుకాంత భట్టాచార్య ఆయన బాబాయి. తన ఆత్మకథను రెండు భాగాలుగా వెలువ రించారు బుద్ధదేవ్. 'ఫిర్‌దేఖా', 'ఫిర్‌దేఖా 2' అనే ఆ రెండు సంపుటాల్లో జీవితాన్ని రాజకీయ పాలనానుభవాలను నెమరు వేసుకున్నారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా బెంగాలీలు ఆయనను ఎంత ప్రేమించారు, దేశం ఎంత గౌరవిం చింది అనడానికి అంతిమఘట్టంలో ప్రదర్శితమైన గౌరవాభిమా నాలే నిదర్శనం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు, విశ్లేషకులు

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని వేకువ జామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని మల్లన్నకు నిర్వహించే రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన తదితర ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు.

15 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. 14న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల్లో 15న పవిత్రాల ప్రతిష్ఠ, 16న పవిత్ర సమర్పణ, 17న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. కాగా, పవిత్రోత్సవాల్లో 14న అంకురార్పణ కారణంగా సహస్ర దీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.15న తిరుప్పావడతో పాటు 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలు రద్దుకానున్నాయి.

గుప్తనిధుల ముఠా గుట్టురట్టు

పోలీసుల అదుపులో పది మంది ముఠా సభ్యులు




పోలీసుల అదుపులో ముఠా సభ్యులు


మార్కాపురం: వాడుకలో లేని రైసుమిల్లులో గుప్తనిధులు తవ్వుతున్న అంతర్ జిల్లా ముఠాను ప్రకాశం జిల్లా, మార్కాపురం రూరల్, పట్టణ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. జిల్లాలోని దర్శి, దొనకొండ, పల్నాడు జిల్లా వినుకొండ, కొచ్చర్లకోట, త్రిపురాంతకం, వెలిగండ్ల గ్రామాలకు చెందిన సుమారు 10 మంది ముఠాగా ఏర్పడ్డారు. ఓ స్వామీజీ పట్టణ శివార్లలోని తర్లుపాడు రోడ్డులో వాడుకలో లేని రైస్ మిల్లులో గుప్తనిధులు ఉన్నాయని చెప్పడంతో వీరంతా వారం రోజులుగా తవ్వకాలు చేపట్టారు. సుమారు 40 అడుగుల గుంత తవ్వారు. ఈ విషయం శనివారం బయటకు పొక్కడంతో మార్కాపురం రూరల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తవ్వకానికి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఎక్కడైనా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనం.. 'పొదుపు'లో ఘనం

రూ.17,292 కోట్లతో దేశంలోనే అత్యధికం

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు పొదుపు.. క్రెడిట్ లింకేజి విషయంలోనూ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ కార్యక్రమం, వాటి పనితీరుపై 2023-24 వార్షిక నివేదికను శనివారం నాబార్డు విడుదల చేసింది. దేశంలోని ఈ సంఘాల పొదుపు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. అంతకుముందు నాలుగేళ్లు కూడా ఏపీనే అగ్రగామిగా నిలిచింది. స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలు, సున్నా వడ్డీ వంటి ప్రోత్సాహకాలతోనే ఇలా ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నివేదిక స్పష్టంచేసింది. - సాక్షి, అమరావతి





నిజానికి.. గతంలో చంద్రబాబు హయాంలో నిర్వీర్యమైన పొదుపు సంఘాలను వైఎస్ జగన్ సర్కారు గత ఐదేళ్లుగా గాడిన పెట్టడమే కాకుండా దేశంలోనే ఉత్తమ పనితీరు కనబరిచే స్థాయికి తీసుకెళ్లింది. అన్ని రాష్ట్రాల్లో కలిపి పొదుపు సంఘాల సొమ్ము (2023-24 మార్చి నాటికి) రూ.65,089.15 కోట్లు అయితే.. ఇందులో దక్షిణాది రాష్ట్రాల పొదుపు రూ.29,409.06 కోట్లు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని సంఘాల పొదుపు దేశంలోనే అత్యధికంగా రూ.17,292.16 కోట్లుగా ఉందని నివేదక వెల్లడించింది. అంటే దేశంలో మన రాష్ట్ర వాటా 26.56 శాతంగా ఉంది.

సగటు పొదుపు ఏపీలోనే అత్యధికం..

2023-24లో దేశంలోని మహిళా సంఘాల సగటు పొదుపులో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని నాబార్డు నివేదిక స్పష్టంచేసింది. ఇక్కడ ఒక్కో సంఘం సగటు పొదుపు రూ.1,57,321లుగా ఉంది. బ్యాంకులు కూడా ఏపీ పొదుపు సంఘాలకే అత్యధికంగా రుణాలు మంజూరు చేస్తుండడంతో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే.. 2023-24లో బ్యాంకుల రుణాల పంపిణీలో రూ.59,777 కోట్లతో ఏపీ మొదటి స్థానంలో ఉండగా కర్ణాటక రూ.25,253 కోట్లతో రెండో స్థానంలో, తెలంగాణ రూ.20,932 కోట్లతో మూడో స్థానంలో.. పశ్చిమ బెంగాల్ రూ.20,671 కోట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయని నివేదిక వెల్లడించింది. ఒక్కో పొదుపు సంఘం సగటు రుణ పంపిణీలోకూడా ఏపీ రూ.8.8 లక్షలతో అగ్రస్థానంలో ఉందని, ఆ తరువాత కేరళ రూ.7.7 లక్షలు, తమిళనాడు రూ.6.7 లక్షలతో ఉన్నాయి.

సున్నా వడ్డీతో సంఘాలు బలోపేతం

ఇదిలా ఉంటే.. సకాలంలో రుణాలు చెల్లించే పొదుపు సంఘాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సున్నావడ్డీ (వడ్డీలేని రుణాలు) రుణాలను అమలుచేసిందని కూడా నివేదిక పేర్కొంది. ఫలితంగా.. పొదుపు సంఘాలు బలోపేతం కావడమే కాక గ్రామీణ కుటీర పరిశ్రమలు పరిపుష్టి సాధించాయని తెలిపింది. అంతేకాక.. 2014లో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసంచేయడంతో స్వయం సహాయక సంఘాలు అప్పుల్లో కూరుకుపోవడమే కాకుండా సంఘాల నిరర్థక ఆస్తులు పెరిగిపోయాయి. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఇవి గణనీయంగా తగ్గాయి. 2014-19 మధ్య బాబు హయాంలో 5.86 శాతంగా ఉన్న నిరర్థక ఆస్తులు 2023-24 నాటికి అవి 0.31 శాతమేనని నివేదిక తెలిపింది.

మన 'పరపతి' కూడా పెరిగింది..

ఇక 2014-2019 మధ్య చంద్రబాబు చేసిన దగాకు పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల పరపతి పూర్తిగా దిగజారిపోయింది. అప్పట్లో చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పిన రుణమాఫీ మాటలు నమ్మి వీరు నిలువునా మోసపోయారు. ఆయన అధికారం చేపట్టగానే ప్లేటు ఫిరాయించి రుణమాఫీ చేయబోనని అడ్డం తిరగడంతో పొదుపు సంఘాల అప్పులు పెరిగిపోవడంతో రుణాల మంజూరుకు బ్యాంకులు వెనుకాడాయి. దీంతో.. సంఘాలు సీ, డీ గ్రేడ్‌లకు పడిపోయాయి. మరోవైపు.. 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల తేదీ నాటికి ఉన్న అప్పులు రూ.25,570.79 కోట్లను నాలుగు విడతల్లో సంఘాలకు చెల్లించారు. అంతేకాక.. బాబు ఎగ్గొట్టిన సున్నావడ్డీని జగన్ సర్కారు పునరుద్ధరించి దీనికింద రూ.4,969.04 కోట్లను పొదుపు అక్క చెల్లెమ్మలకు చెల్లించారు. దీంతో రాష్ట్రంలో పొదుపు సంఘాల పరపతి అమాంతం పెరిగింది. ఆసరా, సున్నా వడ్డీతో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల్లో ఆర్థిక క్రమశిక్షణ పెరగడంతో ఇప్పుడు దేశంలోనే అత్యధిక క్రెడిట్ లింకేజీ గల పొదుపు సంఘాలుగా మనవి నిలిచాయి. బాబు హయాంలో (2014-19) పొదుపు సంఘాల క్రెడిట్ లింకేజీ 43.6 శాతం ఉంటే ఇప్పుడు 89 శాతంగా ఉంది. దీంతో గత ఐదేళ్లుగా రాష్ట్రంలోని పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు పెరుగుతూనే ఉన్నాయి.

కొత్త చట్టాల ప్రకారం కేసు డైరీలు నిర్వహించాల్సిందే

- పోలీసులకు హైకోర్టు అక్షింతలు
- దర్యాప్తు అధికారులందరికీ సూచనలివ్వాలని డీజీపీకి ఆదేశం
- ఎన్ఎస్‌యూఐ నాయకుడి హత్య కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ



సాక్షి, అమరావతి: వివిధ కేసుల్లో దర్యాప్తు అధికారులంతా పార్ట్-1 కేసు డైరీ (సీడీ)ని నిబంధనలు నిర్దేశించిన విధంగా నిర్వహించి తీరాలని హైకోర్టు స్పష్టం చేసింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 192కు అనుగుణంగా కేసు డైరీలను నిర్వహించాలని తేల్చి చెప్పింది. ఇలా చేయడం వల్ల రికార్డుల ప్రామాణికత, దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరుగుతుందని తెలిపింది. పోలీసుల కేసు డైరీలను పరిశీలిస్తే అవేవీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లేదంది. అందువల్ల సీడీల నిర్వహణ విషయంలో రాష్ట్రంలోని దర్యాప్తు అధికారులందరికీ తగిన సూచనలు చేయాలని డీజీపీని ఆదేశించింది. ఈ విషయంలో తామిచ్చిన తీర్పు కాపీని డీజీపీకి పంపాలని రిజిస్ట్రార్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కేసీ కృష్ణారెడ్డి, కేసీ నాగార్జునరెడ్డి, కేసీ సాయిప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. సంపత్‌కుమార్ హత్య కేసులో వీరి ప్రమేయం ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలు న్నాయంది. అందువల్ల వారి బెయిల్ పిటిషన్లను కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఇటీవల తీర్పు వెలువరించారు.

సంచలనం సృష్టించిన సంపత్‌కుమార్ హత్య


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన సంపత్‌కుమార్ ఈ ఏడాది మే 30న దారుణ హత్యకు గురయ్యారు. భూ వివాదమే సంపత్‌కుమార్ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. హత్య చేసిన ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారిచ్చిన వాంగ్మూలం ఆధారంగా సంపత్‌కుమార్‌తో భూ వివాదం ఉన్న న్యాయవాదులు కేసీ కృష్ణారెడ్డి, ఆయన కుమారులు కేసీ నాగార్జునరెడ్డి, కేసీ సాయిప్రసాద్‌రెడ్డిలను ప్రధాన నిందితులుగా చేర్చారు. ఈ నేపథ్యంలో వారు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ చక్రవర్తి విచారణ జరిపారు. వాదనల సమయంలో సంపత్‌కుమార్ హత్య కేసుకు సంబంధించిన కేసు డైరీని పరిశీలించారు. కేసు డైరీ నిబంధనలకు అనుగుణంగా లేని విషయాన్ని గమనించి సీడీ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంపత్‌కుమార్ హత్యతో పిటిషనర్లకు సంబంధం ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని స్పష్టమవుతోందని.. ఈ దృష్ట్యా పిటిషనర్లకు ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని న్యాయమూర్తి తేల్చి చెబుతూ వారి పిటిషన్లను కొట్టేశారు.

శ్రీశైలంలో తగ్గిన వరద



నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు కృష్ణమ్మ పరుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్/సత్రశాల (రెంటచింతల)/అచ్చంపేట: శ్రీశైలం డ్యాంకు జూరాల, సుంకేసుల నుంచి 2,02,702 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం నుంచి 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగులకు తెరచి దిగువకు 2,69,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో రాత్రి 10 గంటలకు నాలుగు గేట్లను మూసివేసి 6 గేట్ల ద్వారా నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 12 క్రస్ట్‌గేట్ల ద్వారా మొత్తం 3,41,340 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏడీ ఎస్.జయశంకర్, ఏఈ జయపాల్ తెలిపారు. ఎగువ నాగార్జున సాగర్ నుంచి వరదనీరు భారీగా పులిచింతల ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉన్నప్పటికీ కేవలం 35.818 టీఎంసీలను మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. 24 క్రస్ట్ గేట్లు ఉండగా 15 గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు.



■ తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ శనివారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. - తిరుమల/తిరుచానూరు(చంద్రగిరి)



■ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ శనివారం దర్శించుకున్నారు. పంచహారతుల సేవలో పాల్గొన్న న్యాయమూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)



■ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

పలు రైళ్ల దారి మళ్లింపు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): గుంటూరు డివిజన్‌లోని కొండ్రపోలు-విష్ణుపురం సెక్షన్‌లలో జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్-సంత్రగచ్చి (07221) ఎక్స్‌ప్రెస్ నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా నడవాల్సిన ఈ రైలును ఈ నెల 13న వయా కాజీపేట, వరంగల్, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. అదే విధంగా భువనేశ్వర్-పూణే (22882) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13న నల్గొండ, గుంటూరుకు బదులుగా వయా విజయవాడ, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణించనుంది.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల పొడిగింపు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇప్పటికే ప్రకటించిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. నర్సాపూర్-బెంగళూరు (07153) ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 27 వరకు, బెంగళూరు-నర్సాపూర్ (07154) ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 28 వరకు, ధనాపూర్-బెంగళూరు (03245) ఈ నెల 14న, బెంగళూరు-ధనాపూర్ (03246) ఈ నెల 16న, ధనాపూర్-బెంగళూరు (03251) ఈ నెల 11, 12 తేదీలలోను, బెంగళూరు-ధనాపూర్ (03252) ఈ నెల 13, 14 తేదీలలోను, ధనాపూర్-బెంగళూరు (03259) ఈ నెల 13న, బెంగళూరు-ధనాపూర్ (03260) ఈ నెల 15న, ధనాపూర్-బెంగళూరు (03247) ఈ నెల 15న, బెంగళూరు-ధనాపూర్ (03248) ఈ నెల 17న, ధనాపూర్-బెంగళూరు (03241) ఈ నెల 16న, బెంగళూరు-ధనాపూర్ (03242) ఈ నెల 18న రైళ్లను నడవనున్నట్లు తెలిపారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ(అనకాపల్లి): సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గవ యూనిట్ వార్షిక మరమ్మతుల అనంతరం శుక్రవారం రాత్రి 10.15 గంటలకు పునఃప్రారంభించారు. నాల్గవ యూనిట్‌లో వార్షిక మరమ్మతుల నిర్వహణ కోసం గత 50 రోజుల కిందట యూనిట్‌లో విద్యుదుత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఉద్యోగులు, కార్మికులు శ్రమించి అన్ని విభాగాలకు సంబంధించిన నిర్వహణ పనులను పూర్తి చేసి శుక్రవారం రాత్రి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించామని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు.

కోళ్లు దొంగిలించిన టీడీపీ నాయకులు

నిలదీసినందుకు దంపతులపై దాడి.. గాయాలతో ఆస్పత్రిపాలు



మదనపల్లె: కోళ్లు దొంగిలించడంపై టీడీపీ నాయకులను ప్రశ్నించినందుకుగాను దారి కాసి దంపతులపై దాడి చేశారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు..పొన్నేటిపాళ్యం పంచాయతీ సవరంవారిపల్లెలో కొద్దిరోజులుగా గ్రామస్తులకు చెందిన కోళ్లు మాయమవుతున్నాయి. గ్రామానికి చెందిన శ్యామసుందర్, గాయత్రి దంపతులకు చెందిన రూ.15 వేల విలువ చేసే 6 కోళ్లు చోరీకి గురయ్యాయి. ఈ చోరీలు చేస్తున్న వ్యక్తులు టీడీపీ నాయకులేనని తెలియడంతో..గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టాలని శ్యామసుందర్ దంపతులు నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు జన్నే దివాకర్ పొలంలో పనులు చేసుకుంటున్న శ్యామసుందర్ వద్దకు వెళ్లి 'మా పైనే పంచాయతీ పెట్టాలని చూస్తావా' అని గొడవకు దిగాడు. ఈలోపు స్థానికులు అక్కడికి చేరుకోవడంతో దివాకర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో తన భార్య గాయత్రికి ఆరోగ్యం బాగోలేకపోతే వైద్యం కోసం మదనపల్లెకు ద్విచక్ర వాహనంలో శ్యామసుందర్ బయలుదేరగా దివాకర్, జన్నే చంద్రశేఖర్, నిశాంత్, మరికొందరు గ్రామ సమీపంలో దంపతులపై కర్రలతో దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. తన భర్తపై దాడి చేయవద్దని గాయత్రి వేడుకుంటున్నా... వినిపించుకోకుండా.. 'మేం టీడీపీ వాళ్లం.. అనుకుంటే ఏమైనా చేస్తాం. ఎవరికి చెప్పుకుంటావో, చెప్పుకో' అంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం దాడి ఘటనపై తాలూకా పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

ప్రియుడి మోజులో.. భర్తనే కడతేర్చింది..

- కిరాయి హంతకులు, ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం
- భర్త గొంతుకు తాడు బిగించి దారుణంగా హత్య
- ఒంగోలు పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హత్య కేసులో ఆరుగురి అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రియుడి మోజులో పడి ఆమె ఏకంగా భర్తనే హతమార్చింది. తన వ్యవహారం బయట పడేసరికి భర్త మందలించడం.. భర్త బతికుంటే తమ 'బంధం' కష్టమని భావించిన ఆ మహిళ.. కిరాయి ముఠా, ప్రియుడి సాయంతో కట్టుకున్న భర్తనే దారుణంగా కడతేర్చింది.. ప్రకాశం జిల్లాలో సంచలనం సృష్టించిన పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చల్లా వెంకటనరేంద్రబాబు హత్య కేసులో మృతుడి భార్యతో సహా మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కేసు వివరాలను ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం మీడియాకు వెల్లడించారు.

ఆ యువకుడికి అలా దగ్గరైంది..

ఒంగోలులోని పీఎఫ్ ఆఫీసులో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే చల్లా వెంకటనరేంద్రబాబు పొదిలిలోని పీఎస్ఆర్ కాలనీ మూడో లైనులో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీప్రియ, ఇద్దరు పిల్లలు. వారి ఇంటి ఎదురుగా అద్దె ఇంట్లో ఉంటున్న కొండ శశికుమార్ అనే యువకుడికి లక్ష్మీప్రియ దగ్గరైంది. వారి వ్యవహారం తెలిసిన నరేంద్ర.. ఇద్దరినీ తీవ్రంగా మందలిస్తూ వస్తున్నాడు. దీంతో ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడు శశితో కలిసి పథకం రచించింది. ఆమె ఇంట్లో ఉన్న బంగారు నగలను తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో నెల్లూరుకు చెందిన కిరాయి హంతకులతో రూ.2 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున నరేంద్ర గాఢ నిద్రలో ఉన్న సమయంలో శశితో పాటు.. నెల్లూరు కిరాయి ముఠాకు చెందిన నలుగురు యువకులు కలిసి నరేంద్ర గొంతుకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. మృతదేహాన్ని వంటగదిలోకి తీసుకెళ్లి తాడుతో వేలాడ దీశారు. భార్యభర్తల గొడవలతో విసిగివేసారి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించేందుకు యత్నించారు. ఇదిలా ఉండగా, కిరాయి ముఠాతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా తొలుత రూ.50 వేలు మాత్రమే అడ్వాన్స్‌గా చెల్లించారు. మిగిలిన డబ్బు కోసం వారు ఫోన్లు చేస్తుండటంతో భయపడిపోయిన శశి పోలీసులకు లొంగిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు నిందితులు.. లక్ష్మీప్రియతో పాటుగా ఆమె ప్రియుడు కొండ శశికుమార్, నెల్లూరు కిరాయి ముఠాకు చెందిన షేక్ నహీద్, షేక్ ఫజ్లూ, సయ్యద్ సిద్దిక్, షేక్ ముబారక్‌లను అరెస్టు చేసినట్టు ఎస్పీ దామోదర్ వివరించారు.

● తెలంగాణ

డార్క్ వెబ్‌లో హెరాయిన్ ఆర్డర్.. స్పీడ్ పోస్ట్‌లో డెలివరీ!

- అస్సాం నుంచి ఖమ్మంకు తెప్పించుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- డెలివరీ తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు

ఖమ్మం క్రైం: సాధారణంగా మానవ కొరియర్ల ద్వారా డ్రగ్స్ సరఫరా జరుగుతుంటుందన్న విషయం తెలిసిందే. కానీ మాదక ద్రవ్యాల రవాణా, సరఫరాపై ప్రభుత్వం, పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో డ్రగ్స్ బానిసలు కొత్తదారులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా ఓ యువకుడు డార్క్ వెబ్‌లో ఆర్డర్ పెట్టి స్పీడ్ పోస్ట్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకున్న ఉదంతం ఖమ్మంలో వెలుగుచూసింది.

అస్సాం నుంచి...

ఖమ్మం టూటౌన్ ప్రాంతానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మత్తుపదార్థాలకు అలవాటుపడ్డాడు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న అతను అక్కడ పోలీసు నిఘా ఎక్కువగా ఉండటంతో ఖమ్మంకు తెప్పించుకుంటే ఎవరికీ అనుమానం రాదని భావించాడు. ఇందుకోసం హ్యాకర్లు, మాఫియా, ఉమెన్ ట్రాఫికింగ్, ఆయుధాల స్మగ్లింగ్ చేసేవారు ఉపయోగించే డార్క్ వెబ్ (తమ గుర్తింపు, జాడను ఇతరులకు తెలియనివ్వకుండా ఇంటర్నెట్‌లోని హిడెన్ వెబ్‌సైట్లను ఉపయోగించేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇందులోని సమాచారం ఎన్‌క్రిప్ట్ అయి ఉండటం వల్ల గూగుల్ లాంటి సాధారణ సెర్చ్ ఇంజన్లు ఈ వెబ్‌సైట్లను చూపించలేవు. టార్, ఐ2పీ లాంటి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ బ్రౌజర్ల ద్వారా ఆయా సైట్లను ఉపయోగించొచ్చు) ఎంచుకున్నట్లు సమాచారం. ఆపై తన క్రెడిట్ కార్డు, ఇతర యాప్‌లు వాడకుండా క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లింపులు చేసి హెరాయిన్‌ను అస్సాంలోని సిల్చుకురి నుంచి బుక్ చేసుకున్నాడు. అయితే దీన్ని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు చెందిన సాంకేతిక బృందం పసిగట్టింది. స్పీడ్ పోస్ట్ పార్సిల్ నంబర్‌ను హెరాయిన్ సరఫరాదారు ఖమ్మం యువకుడికి పంపడంతో అస్సాంలో పార్సిల్ మొదలైనప్పటి నుంచి నిఘా వేసింది. ఈ నెల 8న ఖమ్మం చేరుకున్న పార్సిల్‌ను 9న ఆ యువకుడికి డెలివరీ చేస్తుండగా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతోపాటు ఖమ్మం టూటౌన్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పార్సిల్‌లో మ్యాగజైన్ మాత్రమే ఉండటంతో తొలుత యువకుడు బుకాయించాడు. అధికారులు మ్యాగజైన్‌లోని ఒక్కో పేజీని పరిశీలిస్తుండగా మధ్యలో ఓ కాగితానికి టేప్ వేసి ప్లాస్టిక్ కవర్‌లో ఉంచిన 2 గ్రాముల హెరాయిన్ బయటపడింది. హెరాయిన్‌ను స్వాధీనం చేసుకొని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడి కెరీర్ దృష్ట్యా అతనితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యుత్ విమానం వచ్చేస్తోంది...

ఏకధాటిగా 800 కి.మీ. ప్రయాణం • 2030 నాటికి అందుబాటులోకి!

ప్రపంచమంతటా విద్యుత్ వాహనాల హవా పెరిగిపోతోంది. అదే బాటలో త్వరలో పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ విమానం కూడా రానుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే 805 కిలోమీటర్ల దూరం వెళ్లగలిగేలా దీన్ని తయారు చేస్తున్నట్టు నెదర్లాండ్స్‌కు చెందిన ఎలిసియాన్ అనే స్టార్టప్ కంపెనీ ప్రకటించింది. ఈ9ఎక్స్‌గా పిలుస్తున్న ఈ విమానంలో 90 మంది ప్రయాణించవచ్చు. దీన్ని 2030 నాటికి వాణిజ్యపరంగా అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ చెబుతోంది. ''అప్పటికల్లా విద్యుత్ బ్యాటరీల సామర్థ్యం బాగా పెరుగుతుంది. కనుక మా విమానం ప్రయాణ రేంజ్, మోసుకెళ్లగలిగే ప్రయాణికుల సంఖ్య కూడా కచ్చితంగా పెరుగుతాయి'' అని కంపెనీ డిజైన్, ఇంజనీరింగ్ డైరెక్టర్ రేనార్డ్ డి వ్రైస్ వివరించారు. వీలైనంత తక్కువ బరువు, అదే సమయంలో పూర్తిస్థాయి భద్రత, గరిష్ఠ సామర్థ్యం ఉండేలా విమానాన్ని డిజైన్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ''ఈ9ఎక్స్ చూసేందుకు 1960ల నాటి జెట్ మాదిరిగా ఉంటుంది. ఇందులో 8 ప్రొపెల్లర్ ఇంజన్లు, బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ230లను కూడా తలదన్నేలా 42 మీటర్ల పొడవైన రెక్కలుంటాయి'' అని తెలిపారు. ఒక్కసారి మార్కెట్లోకి వచ్చిందంటే దేశీయంగా తక్కువ దూరాలకు తమ విమానమే బెస్ట్ ఆప్షన్‌గా మారుతుందని ధీమా వెలిబుచ్చారు. ''అంతేకాదు, వాయు, శబ్ద కాలుష్యం కారణంగా విమానాల రాకపోకలపై ఆంక్షలున్న ద్వితీయశ్రేణి నగరాలకు మా విమానం వరప్రసాదమే కాగలదు. పైగా ప్రయాణ సమయంలో విమానం లోపల ఎలాంటి శబ్దాలూ విన్పించవు. ఇది ప్రయాణికులకు చక్కని అనుభూతినిస్తుంది. ప్రస్తుత విమానాల్లో క్యాబిన్ లగేజీ పెద్ద సమస్య. మా విమానంలో క్యాబిన్ లగేజీ సామర్థ్యాన్ని బాగా పెంచడంపైనా డిజైనింగ్‌లో ప్రత్యేక దృష్టి పెట్టాం. అదనపు క్యాబిన్ లగేజ్ ప్రయాణికులకు బాగా ఆకట్టుకునే అంశంగా నిలుస్తుంది'' అని చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



అరగంటలో చార్జింగ్

ఎలక్ట్రిక్ వాహనం అనగానే ప్రధానంగా ఎదురయ్యే సమస్య చార్జింగ్. విపరీతమైన పోటీ నెలకొని ఉండే దేశీయ వైమానిక రంగంలో విమానం ఎంత త్వరగా తర్వాతి ప్రయాణానికి సిద్ధమవుతుందన్నది చాలా కీలకం. ముఖ్యంగా చౌక విమానయాన సంస్థలకు ప్రయాణికుల ఆదరణను నిర్ణయించడంలో దీనిదే కీలక పాత్ర. ''ఈ అంశంపైనా ఇప్పట్నుంచే దృష్టి సారించాం. అరగంటలోనే విమానం ఫుల్ చార్జింగ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం'' అని వ్రైస్ చెప్పారు.

అదానీ అక్రమాల్లో సెబీ చీఫ్‌కు భాగస్వామ్యం

విదేశీ డొల్ల కంపెనీల్లో వాటాలు

• మరో బాంబు పేల్చిన హిండెన్‌బర్గ్



న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మరోసారి బాంబు పేల్చింది. పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకలతో సాక్షాత్తూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధబీ పురీ బోచ్‌కు, ఆమె భర్త ధవళ్ బోచ్‌కు సంబంధముందని తీవ్ర ఆరోపణలు చేసింది! అందుకే అదానీ ఆర్థిక అవకతవకలపై లోతుగా విచారణ జరిపేందుకు సెబీ పెద్దగా ఆసక్తి చూపడం లేదని అభిప్రాయపడింది. బెర్ముడా, మారిషస్‌ల్లోని అదానీ గ్రూప్ డొల్ల కంపెనీల్లో మాధబీ దంపతులకు వాటాలున్నట్టు శనివారం రాత్రి విడుదల చేసిన తాజా నివేదికలో హిండెన్‌బర్గ్ వెల్లడించింది. ''ఆ కంపెనీల్లో వారిద్దరూ కోటి డాలర్ల మేరకు 'పెట్టుబడులు' పెట్టినట్టు చూపారు. పెట్టుబడులకు భారత్‌లో ఎన్నో మ్యూచువల్ ఫండ్లు తదితరాలుండగా ఏరి కోరి పన్ను ఎగవేతదారుల స్వర్గధామంగా పేరొందిన దేశాల్లో, అదీ అదానీలకు చెందిన డొల్ల కంపెనీల్లోనే పెట్టడం ఆశ్చర్యకరం. అదానీల ఆర్థిక అవకతవకల్లో ఏకంగా తమ చీఫే భాగస్వామి కావడంతో లోతుగా విచారణ జరిపేందుకు సెబీ వెనకడుగు వేసింది'' అని పేర్కొంది. అదానీల విదేశీ నిధుల మూలాలపై సెబీ విచారణ తేల్చిందేమీ లేదంటూ అప్పట్లో సుప్రీంకోర్టు కూడా ఆక్షేపించిందని హిండెన్‌బర్గ్ గుర్తు చేసింది. అంతకుముందు, 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ సంస్థ శనివారం ఉదయమే ఎక్స్‌లో పోస్టు పెట్టింది.

నాటినుంచీ దుమారమే

అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుందంటూ 2023 జనవరి 23న హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక దుమారం రేపడం తెలిసిందే. ధరలు పెంచిన షేర్లను తనఖా పెట్టి భారీ రుణాలు పొందిందని, అకౌంటింగ్ మోసాలకూ పాల్పడిందని నివేదిక పేర్కొంది. బెర్ముడా, మారిషస్ దేశాల్లో అదానీ కుటుంబం డొల్ల కంపెనీలు పెట్టి వాటి ద్వారా అవినీతికి, నగదు అక్రమ బదలాయింపుకు పాల్పడుతోందని ఆరోపించింది. చైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ వీటిని నియంత్రిస్తున్నట్టు పేర్కొంది. ఈ నివేదిక దెబ్బకు అప్పట్లో అదానీ షేర్లు భారీగా పతనమయ్యాయి. దాని సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్ల మేరకు హరించుకుపోయింది. ఈ ఉదంతం రాజకీయంగా కూడా ఇప్పటికీ జాతీయ స్థాయిలో పెను ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. అధికార బీజేపీ, విపక్ష ఇండియా కూటమి మధ్య పరస్పర ఆరోపణలకు కారణమవుతూ వస్తోంది. అయితే హిండెన్‌బర్గ్ నివేదిక వెనక కుట్ర దాగుందన్న వాదనలూ ఉన్నాయి.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

మరో నలుగురికి తీవ్రగాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు జవాన్లు నేలకొరగ్గా మరో నలుగురు జవాన్లు సహా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదుల కదలికలపై నిఘా సమాచారం అందుకున్న భద్రతా బలగాలు కొకెర్‌నాగ్ ప్రాంతం అహ్లాన్ గగర్‌మండులో 10 వేలఅడుగుల ఎత్తులోని అటవీప్రాంతంలో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. తనిఖీలు జరుపుతున్న బలగాలపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు దిగారు. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో ఆరుగురు జవాన్లు, ఇద్దరు పౌరులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరు జవాన్లు అమరులైనట్లు అధికారులు వెల్లడించారు. మిగతా వారు చికిత్స పొందుతున్నారన్నారు. తప్పించుకుపోయిన ఉగ్రమూకల కోసం గాలింపు కొనసాగుతోందని వివరించారు.

నలుగురు ఉగ్రవాదుల స్కెచ్ విడుదల

జూలై 8వ తేదీన కథువా జిల్లాలోని మచెడిలో భద్రతా బలగాలపై దాడికి పాల్పడిన నలుగురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఊహా చిత్రాలను రూపొందించారు. ఆచూకీ తెలిపిన వారికి రూ.20 లక్షల రివార్డు ప్రకటించారు. అప్పటి ఘటనలో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ సహా ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

చీఫ్ జస్టిస్‌నూ సాగనంపారు

సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌ను కూడా

• బంగ్లాలో బలవంతపు రాజీనామాలు
• గంటలోపు తప్పుకోవాలంటూ సీజేకు అల్టిమేటం
• లేదంటే జడ్జిల ఇళ్లను ముట్టడిస్తామని బెదిరింపు
• సుప్రీంకోర్టును భారీగా ముట్టడించిన విద్యార్థులు



సీజే ఒబైదుల్ హసన్

ఢాకా: బంగ్లాదేశ్‌లో విద్యార్థి సంఘాల హల్‌చల్ కొనసాగుతూనే ఉంది. బలవంతపు రాజీనామాల పర్వానికి ఇంకా తెర పడలేదు. షేక్ హసీనా హయాంలో ఉన్నత స్థాయి పదవుల్లో నియమితులైన వారంతా తప్పుకోవాల్సిందేనని సంఘాలు అల్టిమేటం జారీ చేశాయి. దాంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒబైదుల్ హసన్ (65), సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రౌఫ్ తాలుక్‌దార్ శనివారం రాజీనామా చేశారు. సుప్రీం న్యాయమూర్తులందరితో కూడిన సీజే అత్యవసరంగా ఫుల్ కోర్టును సమావేశపరుస్తున్నారన్న వార్తలతో ఉదయం నుంచే కలకలం రేగింది. మహమ్మద్ యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించి దేశ వ్యతిరేక శక్తులకు దన్నుగా నిలవడమే ఈ భేటీ ఆంతర్యమని విద్యార్థి సంఘాల నేతలతో పాటు పలువురు ప్రభుత్వ సలహాదారులు కూడా ఆరోపించారు. సీజే, ఇతర సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాజీ ప్రధాని షేక్ హసీనా తాబేదార్లంటూ దుయ్యబట్టారు. దాంతో దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు, నిరసనలు తీవ్రతరమయ్యాయి. సీజే, ఇతర న్యాయమూర్తులు గంటలోపు తప్పుకోవాలని విద్యార్థి సంఘాలు అల్టిమేటమిచ్చాయి. విద్యార్థులు, యువత సుప్రీంకోర్టును భారీ సంఖ్యలో ముట్టడించారు. దాంతో ఫుల్ కోర్టు భేటీని సీజే రద్దు చేశారు. మధ్యాహ్నం మీడియా ముందుకొచ్చారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటు దేశవ్యాప్తంగా జడ్జిలందరి క్షేమం దృష్ట్యా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన రాజీనామా లేఖను వెంటనే అధ్యక్షునికి పంపినట్టు న్యాయ సలహాదారు వెల్లడించారు. ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా రాజీనామా చేశారు.



జడ్జిలంతా రాజీనామా చేయాలంటూ సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

జస్టిస్ మహ్మద్ అష్ఫకుల్ ఇస్లాంను తాత్కాలిక సీజేగా నియమించారు. తాలుక్‌దార్ రాజీనామాను ఇంకా ఆమోదించలేదని సర్కారు పేర్కొంది. ఢాకా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మక్సూద్ కమాల్ తదితర ఉన్నతాధికారులెందరో రాజీనామా బాట పట్టారు. యువత, విద్యార్థుల ఆందోళనలతో హసీనా సోమవారం ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశం వీడటం తెలిసిందే.

మైనారిటీలపై అవే దాడులు...

బంగ్లావ్యాప్తంగా హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. హసీనా తప్పుకున్న నాటినుంచి గత ఆరు రోజుల్లో కనీసం 205కు పైగా మతపరమైన దాడుల ఉదంతాలు చోటుచేసుకున్నట్టు హిందూ సంఘాలు వెల్లడించాయి. దాంతో మైనారిటీలంతా భయాందోళనల నడుమ గడుపుతున్నట్టు వివరించాయి. ఇందుకు సంబంధించిన వివరాలతో మధ్యంతర ప్రభుత్వాధినేత యూనుస్‌కు బహిరంగ లేఖ రాశాయి. తమకు భద్రత కల్పించాలని కోరాయి. గత ఐదారు రోజుల్లో దేశవ్యాప్తంగా 230 మంది హింసాకాండకు బలయ్యారు. దాంతో గత జూలై నుంచి చనిపోయిన వారి సంఖ్య 560 దాటింది. తమపై, తమ కుటుంబాలపై దాడులకు నిరసనగా వేలాది మంది హిందువులు శనివారం వరుసగా రెండో రోజు కూడా ఢాకాలో నిరసనలకు దిగారు. 'హిందువులను కాపాడండి' అంటూ నినాదాలు చేశారు.

మైనారిటీలను కాపాడుకుందాం: యూనుస్

మైనారిటీలపై జరుగుతున్న దాడులను యూనుస్ తీవ్రంగా ఖండించారు. ''మైనారిటీలు మన దేశ పౌరులు కారా? ఇది చాలా నీచమైన చర్య'' అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. దేశంలోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులకు ఎలాంటి హానీ కలగకుండా కాపాడాల్సిందిగా యువతకు పిలుపునిచ్చారు. హసీనా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను ముందుండి నడిపిన పాతికేళ్ల విద్యార్థి అబూ సయీద్‌ను దేశ ప్రజలంతా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జూలైలో తలెత్తిన ఈ ఆందోళనలకు తొలుత బలైన విద్యార్థుల్లో అబూ కూడా ఉన్నాడు.

క్రీమీలేయర్ పేరిట చిచ్చు పెట్టొద్దు: ఖర్గే



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీల్లోని క్రీమీలేయర్‌కు రిజర్వేషన్లు వర్తింపజేయకూడదన్న ఆలోచనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం చెప్పారు. ఈ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న భాగాన్ని తొలగించాలని, ఇందుకోసం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. క్రీమీలేయర్ పేరిట ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేయొద్దని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్‌ను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఒక విధానం రూపొందించాలని సుప్రీంకోర్టు తీర్పులో న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. క్రీమీలేయర్‌కు రిజర్వేషన్లు నిరాకరించాలని ఆయన సూచించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో అస్పృశ్యత ఉన్నంతకాలం రిజర్వేషన్లు ఉండాల్సిందేనని మల్లికార్జున ఖర్గే తేల్చిచెప్పారు. రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విధానానికి ముగింపు పలికేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.


కేబినెట్ కార్యదర్శిగా టి.వి.సోమనాథన్



న్యూఢిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి టి.వి.సోమనాథన్ శనివారం కేబినెట్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఐదేళ్ల కిందట కేబినెట్ కార్యదర్శిగా నియమితులైన రాజీవ్ గౌబా స్థానంలో సోమనాథన్‌ను నియమిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈనెల 30న సోమనాథన్ బాధ్యతలు స్వీకరించి రెండేళ్ల పాటు కేబినెట్ కార్యదర్శిగా కొనసాగుతారు. 1987 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన సోమనాథన్ తమిళనాడు కేడర్‌కు చెందిన వారు. ప్రస్తుతం ఆయన కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా ఉన్నారు. కేబినెట్ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టే వరకు సోమనాథన్‌ను కేబినెట్ సెక్రటేరియట్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా కూడా నియమించారు. సోమనాథన్ సీఏ, కంపెనీ సెక్రటరీ (సీఎస్)లో ఉత్తీర్ణులయ్యారు. కలకత్తా యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, హౌసా (ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో మాట్లాడతారు), హిందీ, తమిళం.. మొత్తం ఐదు భాషలు వచ్చు. సోమనాథన్ ప్రధాని కార్యాలయం (పీఎంవో) అదనపు కార్యదర్శిగా 2015–2017 కాలంలో పనిచేశారు. వ్యయ కార్యదర్శిగా 2019లో నియమితులై.. 2021 ఏప్రిల్‌లో ఆర్థికశాఖ కార్యదర్శి అయ్యారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా, చెన్నై మెట్రో కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. వరల్డ్ బ్యాంక్‌లోనూ కొంతకాలం సేవలందించారు. ఇదిలా ఉండగా.. కేంద్ర హోంశాఖ కార్యదర్శి కుమార్ భల్లా ఐదేళ్ల పదవీకాలం ఈనెల 22తో ముగియనుంది. ఆయన స్థానంలో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే మరొకరిని నియమించే అవకాశం ఉంది.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

• వయనాడ్ వరద బాధితులకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
• వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



హెలికాప్టర్ నుంచి బాధిత ప్రాంతాల్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

వయనాడ్: భీకర వరదలతో అతలాకుతలమైన కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. వరదల ధాటికి కొట్టుకుపోయిన గ్రామాలు, దెబ్బతిన్న వంతెనలు, ధ్వంసమైన రహదారులు, శిథిలమైన ఇళ్లను పరిశీలించారు. సహాయక శిబిరంలో బాధితులతో స్వయంగా మాట్లాడారు. వరదల్లో ఆప్తులను కోల్పోయిన కుటుంబాల ఆవేదన విని చలించిపోయారు. అధైర్యపడొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వెంట కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ తదితరులు ఉన్నారు.

బురద దారుల్లో మోదీ నడక

ప్రధాని మోదీ తొలుత ఢిల్లీ నుంచి కేరళలోని కన్నూర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి వయనాడ్ జిల్లాలోని చూరమల, ముండక్కై, పుంచిరిమట్టామ్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించారు. తర్వాత కాల్పెట్టాలో దిగారు. రోడ్డు మార్గంలో చూరమలకు చేరుకున్నారు. బురద, రాళ్లతో నిండిపోయిన దారుల్లో కాలినడకన కలియదిరిగారు. వరద బీభత్సాన్ని స్వయంగా అంచనా వేశారు. ప్రభుత్వ అధికారులతో, సహాయక సిబ్బందితో మాట్లాడారు. సహాయక చర్యలు, క్షేత్ర స్థాయి పరిస్థితులను అధికారులు వివరించారు. అనంతరం ప్రధానమంత్రి మెప్పడిలో సహాయక శిబిరానికి చేరుకొని, బాధితులతో సంభాషించారు. వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. సర్వం కోల్పోయామంటూ బోరుమని విలపించారు. ప్రధాని మోదీ వారిని ఓదార్చారు. భుజాలపై చేతులు వేసి మాట్లాడారు. గూడు లేని తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు కోరగా, తప్పకుండా ఇస్తామంటూ మోదీ చెప్పారు. పలువురు చిన్నారులతోనూ ఆయన సంభాషించారు. వరదల తర్వాత భారత సైన్యం నిర్మించిన 190 అడుగుల బెయిలీ వంతెనపై కాసేపు నడిచారు. మోదీ పర్యటన సందర్భంగా చూరమలలో రహదారికి ఇరువైపులా వందలాది మంది జనం గుమికూడారు. ప్రధానమంత్రి నుంచి సహాయం అర్థించడానికి వచ్చామని వారు చెప్పారు.



బాధిత కుటుంబానికి చెందిన చిన్నారితో మాట్లాడుతున్న మోదీ

న్యాయం, వైద్యం... అత్యంత ఖరీదు!

• ఆదాయంలో మూడొంతులు వైద్యానికే
• సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆవేదన

చండీగఢ్: ''వైద్య, న్యాయ వృత్తుల రెండింటి లక్ష్యమూ ఒక్కటే. అంకితభావంతో కూడిన సేవ ద్వారా వ్యక్తులకు, సమాజానికి హితం చేకూర్చడం. సంక్షేమమే వాటి మూల సూత్రం. కానీ, సమాజ హితానికి పాటుపడేందుకే పుట్టుకొచ్చిన అతి కీలకమైన ఆ రెండు రంగాలూ నేడు అదే సమాజానికి అందుబాటులో లేకుండా పోవడం ఆశ్చర్యకరం'' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యంగా ప్రైవేట్ రంగం రాకతో 1980ల నుంచి భారత్‌లో వైద్యం బాగా వ్యాపారమయంగా మారిపోయిందన్నారు. ''పలు ఔషధాల ఖరీదు భరించలేనంతగా పెరిగిపోయింది. గ్రామీణుల ఆదాయంలో ఏకంగా 77 శాతం, పట్టణ ప్రాంతాల్లో 70 శాతం వైద్య ఖర్చులకే పోతోంది'' అని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య కళాశాలు చూడాల్సిన అవసరముంది. ఇది వాటి సామాజిక బాధ్యత కూడా'' అని హితవు పలికారు. శనివారం చండీగఢ్‌లో పీజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 37వ స్నాతకోత్సవంలో సీజేఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువ వైద్యులను ఉద్దేశించి ప్రసంగించారు.



రోగుల పట్ల దయ, సహానుభూతి ఉండాలని వారికి ఉద్బోధించారు. ''భారత్ ఇన్నొవేషన్ల కేంద్రంగా మారడం అభినందనీయం. కానీ వాటి ఫలాలు అతి కొద్దిమందికే పరిమితం అవుతుండటం బాధాకరం. కనుక వైద్య రంగంలో కీలక పరిశోధనలకు యువ డాక్టర్లు శ్రీకారం చుట్టాలి'' అని ఆకాంక్షించారు.

టెక్నాలజీ వాడకం పెరగాలి

టెక్నాలజీ ద్వారా కోర్టుల పనితీరులో జవాబుదారీతనం పెరగడమే గాక న్యాయప్రక్రియ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజేఐ అభిప్రాయపడ్డారు. ''పారదర్శకత, ప్రజాస్వామ్యం, అందరికీ సమన్యాయం వంటి విలువల పరిరక్షణకు టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోంది. కక్షిదారులు కూడా ఉన్నచోటి నుంచే వారి కేసుల విచారణను ప్రత్యక్షంగా వీక్షించే వీలు కల్పిస్తోంది'' అని చెప్పారు. గత నాలుగేళ్లలో సుప్రీంకోర్టు ఏకంగా 8 లక్షలకు పైగా కేసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించిందని గుర్తు చేశారు. పెండింగ్ భారాన్ని తగ్గించేందుకు కోర్టుల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు.

ఇరాన్ అణు విభాగం చీఫ్‌గా ఎస్లామీ



టెహ్రాన్: ఇరాన్ అణు విభాగం అధిపతిగా మహ్మద్ ఎస్లామీ(67)ని అధ్యక్షుడు పెజెష్కియాన్ మరోసారి నియమించారు. 2021లో అప్పటి అధ్యక్షుడు ఎబ్రహీం రైసీ ఈయన్ను మొదటిసారిగా అణు విభాగానికి అధిపతిగా నియమించారు. ఎస్లామీ అంతకు ముందు 2018లో అధ్యక్షుడు రౌహానీ హయాంలో రవాణా, పట్టణాభివృద్ధి శాఖమంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు. అమెరికాలోని డెట్రాయిట్, టొలెడో యూనివర్సిటీల నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టాలు అందుకున్న ఎస్లామీకి దేశ సైనిక పరిశ్రమలకు సంబంధించి విస్తారమైన అనుభవముంది. ఇరాన్ అణు విధానానికి ప్రత్యక్షంగా తోడ్పాటునందిస్తున్నారంటూ 2008లో ఇరాన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్‌గా ఉన్న ఎస్లామీపై ఐరాస ఆంక్షలు విధించింది.

50 గ్రాముల రాయి... రూ.850 కోట్ల ఖరీదు!

స్మగ్లింగ్ చేస్తుండగా పట్టివేత

పట్నా: అత్యంత విలువైన రేడియో ధార్మిక పదార్థమైన కాలిఫోర్నియంను గుట్టుచప్పుడు కాకుండా స్మగ్లింగ్ చేస్తుండగా బిహార్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారినుంచి 50 గ్రాముల కాలిఫోర్నియంను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఏకంగా రూ.850 కోట్ల దాకా ఉంటుందని గోపాల్‌గంజ్ ఎస్పీ స్వర్ణ్ ప్రభాత్ వెల్లడించారు! గ్రాము ధర రూ.17 కోట్లు పలుకుతుందని ఆయన వివరించారు. ''పక్కా సమాచారం మేరకు జిల్లా ఇన్వెస్టిగేషన్ విభాగం, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఎస్టీఎఫ్ సంయుక్తంగా రంగంలోకి దిగాయి. యూపీ, బిహార్ సరిహద్దులో మోటార్‌బైక్ మీద వస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా కాలిఫోర్నియం దొరికింది'' అని తెలిపారు. దీనిపై అణు ఇంధన శాఖకు కూడా సమాచారం ఇచ్చామన్నారు.



ఎందుకింత ఖరీదు?

కాలిఫోర్నియం అత్యంత అరుదైన రేడియోధార్మిక పదార్థం. ఇది ప్రకృతిలో సహజంగా లభించదు. ప్రయోగశాలల్లో హెచ్చు పీడనంతో కూడిన ఐసోటోప్ రియాక్టర్లలో తయారు చేయాల్సి ఉంటుంది. ఎంతగానో శ్రమించిన మీదట అత్యంత స్వల్ప పరిమాణాల్లో మాత్రమే తయారవుతుంది! దీన్ని తయారు చేయగల సామర్థ్యమున్న అణు రియాక్టర్లు రెండే ఉన్నాయి! ఒకటి అమెరికాలో, రెండోది రష్యాలో. 1950లో భౌతిక శాస్త్ర పరిశోధకులు స్టాన్లీ గెరాల్డ్ థాంప్సన్, కెనెత్ స్ట్రీట్ జూనియర్, అల్బర్ట్ గిరోసో, గ్లెన్ టి.సీబోర్గ్ దీన్ని తొలిసారిగా తయారు చేశారు. ఈ రేడియో ధార్మిక పదార్థాన్ని భూగర్భంలో బంగారు, వెండి నిల్వల అన్వేషణతో పాటు ఇంధన క్షేత్రాల్లో చమురు, నీటి పొరలను గుర్తించేందుకు ఉపయోగిస్తారు.



ఇజ్రాయెల్ క్షిపణి దాడి అనంతరం గాజాలోని స్కూల్ భవనంలో పరిస్థితి

గాజా స్కూల్‌పై ఇజ్రాయెల్ దాడి

100 మందికి పైగా దుర్మరణం

డెయిర్–అల్–బలాహ్: గాజా నగరంపై ఇజ్రాయెల్ ఆర్మీ మరోసారి విరుచుకుపడింది. పాలస్తీనా శరణార్థులు తలదాచుకుంటున్న అల్–తబీన్ స్కూల్‌పై శనివారం ఉదయం జరిగిన క్షిపణి దాడిలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా డజన్ల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. హమాస్‌తో 10 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంలో జరిగిన అత్యంత భీకర దాడుల్లో ఇదొకటని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. స్కూల్లోని హమాస్ కమాండ్ సెంటర్ లక్ష్యంగానే దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ ప్రకటనను హమాస్ ఖండించింది. దాడి తీవ్రతకు విశాలమైన ఆ పాఠశాల భవనం శిథిలాల దిబ్బగా మారి, గ్రౌండ్ ఫ్లోర్‌లో మొండిగోడలు మాత్రమే మిగిలున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. 100కు మృతదేహాలను స్థానికులు తమ ఆస్పత్రికి తీసుకువచ్చారని అల్–అహ్లి ఆస్పత్రి డైరెక్టర్ ఫదెల్ నయీమ్ చెప్పారు. స్కూలు భవనంలోని మసీదులో ప్రార్థనలు చేస్తుండగా హెచ్చరికల్లేకుండా ఈ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సుమారు 6 వేల మంది తలదాచుకుంటున్న ఈ భవనంపై 3 క్షిపణులు పడ్డాయని అధికారులు చెప్పారు. చాలా మృతదేహాలు గుర్తు పట్టేందుకు కూడా వీలులేనంతా ఛిద్రమయ్యాయన్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందున, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు.

నియంతృత్వంపై పోరాడదాం: సిసోడియా

న్యూఢిల్లీ: దేశంలో నియంతృత్వం కొనసాగుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఆరోపించారు. నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. నియంతృత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రతిపక్షాలన్నీ ఒక్కటై బిగ్గరగా గర్జిస్తే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 24 గంటల్లో జైలు నుంచి బయటకు వస్తారని చెప్పారు. నిజాయతీకి ప్రతిరూపమైన కేజ్రీవాల్‌ను కుట్రపూరితంగా జైల్లో పెట్టారని మండిపడ్డారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తీహార్ జైలు నుంచి విడుదలైన సిసోడియా శనివారం 'ఆప్' కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు.


17 నెలల తర్వాత స్వతంత్రమైన సూర్యోదయం



తన భార్యతో కలిసి తేనీరు సేవిస్తున్న ఫొటోను మనీష్ సిసోడియా శనివారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. 17 నెలల తర్వాత స్వతంత్రమైన సూర్యోదయాన మొదటి తేనీరు అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎంపీలపై అనర్హత వేటు వేయండి

• ఇంటింటికీ హామీ పథకం.. ఓటర్లకు లంచమే
• అలహాబాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం



ప్రయాగ్‌రాజ్: కాంగ్రెస్ పార్టీ తరఫున ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన 99 మంది ఎంపీలపై అనర్హత వేటు వేయాలని, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ పార్టీ చేపట్టిన ఇంటింటికీ హామీ పథకం.. చట్టప్రకారం ఓటర్లకు లంచమివ్వడమే అవుతుందని అలహాబాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కాంగ్రెస్ ప్రలోభపర్వాన్ని అడ్డుకోవడంలో విఫలమైన ఎన్నికల సంఘాన్ని (ఈసీ) బాధ్యులుగా చేయాలని కోరింది. రాజకీయ పార్టీలు ఇలా చేయడం తగదని మే 2న ఈసీ మార్గదర్శకాలు జారీచేసినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డుల పంపిణీని కొనసాగించిందని పేర్కొంది. తద్వారా ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాత విధానాన్ని ఉల్లంఘించిందన్నారు. ఈ పిల్ విచారణార్హతను అలహాబాద్ హైకోర్టు నిర్ణయించనుంది.

సాక్షి 24|7 తమిళనాడు

TAMILNADU

ఆదివారం : 11 : ఆగస్టు : 2024

ట్రోఫీ ఆవిష్కరణ



చెన్నైలో ఈనెల 11, 15, 18, 25 తేదీల్లోనూ, సెప్టెంబరు 8, 15, 22, 29 తేదీల్లోనూ, అక్టోబరు 6,13 తేదీలలో పీపీఎల్ క్రికెట్ అండ్ వాలీబాల్ టోర్నీ జరగనుంది. వండలూరులోని ఈశ్వర్ క్రికెట్ అకాడమీలో జరిగే ఈ టోర్నీ పాల్గొనే జట్ల వివరాలను శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా జెర్సీల తో పాటు విజేతలకు అందించే ట్రోఫీలను ఆవిష్కరించారు. – సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ. 5.82 కోట్లు

అన్నానగర్: తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ భక్తుల ఆదాయాన్ని ప్రతి నెలా లెక్కిస్తారు. ఆలయ ధర్మకర్త కమిటీ నేతృత్వంలో శుక్రవారం ఆలయ వసంత మండపంలో లెక్కింపు చేపట్టారు. ఇందులో శివకాశి పదినేన్ సిద్ధర్ మఠం గురుకుల వేద పాఠశాల సాగు కమిటీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో మొత్తం రూ.5.82 కోట్లు కానుకగా వచ్చాయి. అదేవిధంగా 3.78 కేజీల బంగారం, 49 కిలోల 288 గ్రాముల వెండి, 1,535 విదేశీ కరెన్సీలను భక్తులు కానుకగా సమర్పించారు.

అనుమతి లేకుండా నిరసన

- ఆమ్‌స్ట్రాంగ్ భార్య, దర్శకుడు రంజిత్‌పై కేసు

కొరుక్కుపేట: బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన 1,500 మంది సభ్యులపై రెండు సెక్షన్ల కింద కేసు నమోదైంది. అందులో ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులుగా ఉన్న ఆమ్‌స్ట్రాంగ్ భార్య పార్కొడి, దర్శకుడు రంజిత్ ఉన్నారు. వివరాలు.. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆమ్‌స్ట్రాంగ్ జూలై 5న హత్యకు గురయ్యారు. ఈ కేసులో పలువురు రౌడీలు, వివిధ పార్టీల సభ్యులను అరెస్టు చేశారు. ఈ కేసులో ఆమ్‌స్ట్రాంగ్ హత్య వెనుక ఉన్న నేరస్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ చెన్నైలోని వళ్లువర్ కోట్టం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన జరిగింది. బహుజన్ సమాజ్ పార్టీ తరపున జరిగిన ఈ నిరసనలో గందరగోళం నెలకొంది. చైర్మన్ ఆనందన్ తోపాటు పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు. ఇందులో ఆర్మ్‌స్ట్రాంగ్ భార్య పార్కొడి తమ బిడ్డతో కలిసి హాజరయ్యారు. అదేవిధంగా సినీ దర్శకుడు రంజిత్, నటుడు దీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు పా.రంజిత్ ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు తోడుగా ఉన్న వారే మద్దతు పలకడం దిగ్భ్రాంతికరమన్నారు. నిరసన సందర్భంగా హత్యకు కారణమైవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనందన్, ఇతర నాయకులు, ఆర్మ్ స్ట్రాంగ్ భార్య పార్కుడి కోరారు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా నిరసన తెలిపినందుకు గాను ఆమ్‌స్ట్రాంగ్ భార్య పార్కొడి, దర్శకుడు రంజిత్ సహా 1,500 మందిపై నుంగంబాక్కం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రొఫెసర్ల నియామకాల్లో అక్రమాలు

- దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు

కొరుక్కుపేట: అన్నాడీఎంకే హయాంలో ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ 2018లో వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపాలని మద్రాసు హైకోర్టు శనివారం మద్రాస్ యూనివర్సిటీని ఆదేశించింది. వివరాలు.. మద్రాసు యూనివర్సిటీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా ప్రొఫెసర్లను నియమించారని, ఈ అవకతవకలపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసేందుకు యూనివర్సిటీకి అధికారం ఇస్తూ 2018 సిండికేట్ సమావేశంలో తీర్మానం చేశారు. దీని ఆధారంగా విచారణ కమిటీ వేయాలని సయ్యద్ రహమతుల్లా కోరారు. హైకోర్టు యాక్షన్ ఆర్డర్ 2018లో యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 2019లో మద్రాసు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాటి డి.కృష్ణకుమార్, న్యాయమూర్తి జస్టిస్ బి.పి. బాలాజీ బెంచ్ విచారించింది. ఫిర్యాదుపై చెన్నై యూనివర్సిటీ పూర్తిస్థాయి విచారణ జరపాలని, ప్రొఫెసర్ల నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో దర్యాప్తును 6 నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించింది.

పెళ్లయిన రెండు నెలల్లోనే ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

అన్నానగర్: చెన్నై వ్యాసర్పాడి కృష్ణసామి వీధికి చెందిన జయమదన్ (29) ఐటీ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మరో ఐటీ కంపెనీలో పనిచేస్తున్న జెన్నిఫర్‌తో రెండు నెలల క్రితం వివాహమైంది. జెన్నిఫర్ శనివారం ఉదయం పనికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న జయమదన్ అకస్మాత్తుగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలపై వ్యాసర్‌పాడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లకురిచి కల్తీ మద్యం కేసు

- విచారణకు హాజరుకాని 11 మందికి మళ్లీ సమన్లు

కొరుక్కుపేట: ఈ ఏడాది జూన్ 19న కాళ్లకురిచ్చి, కరుణాపురం, శేషసముద్రం పక్కనే ఉన్న శంకరాపురం తదితర గ్రామాల్లో విష మద్యం తాగి 229 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో కళ్లకురిచ్చి, సేలం, విల్లుపురం, పుదువ జిప్‌మార్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ 68 మంది మృతి చెందారు. ఈ ఘటనపై సీబీసీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో మద్యం వ్యాపారులు 24 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి గోకుల్‌దాస్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌ను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదేశించారు. ఈ కేసులో ఏకసభ్య కమిషన్ మొత్తం 150 మందిపై విచారణ పూర్తి చేసింది. కాగా వివిధ కారణాలతో విచారణ కోర్టుకు హాజరుకాని 11 మందికి మరోసారి సమన్లు జారీ చేయాలని శనివారం నిర్ణయించింది.

ఆరు బోగీలతో మెట్రో

నాలుగు నుంచి ఆరు బోగీలతో కూడిన మెట్రో రైలు చెన్నైలో త్వరలో పట్టాలెక్కనుంది. ఇలాంటివి 28 రైళ్ల కొనుగోలుకు చెన్నై మెట్రో రైల్ యాజమాన్యం తాజాగా నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి సైతం మంజూరు చేయడంతో రైళ్ల కొనుగోలు ప్రక్రియపై అధికారులు దృష్టి సారించనున్నారు.

- 28 రైళ్ల కొనుగోలుకు నిర్ణయం
- కేంద్రం అనుమతితో కసరత్తు వేగవంతం



సాక్షి,చెన్నై: రాజధాని నగరం చెన్నైలో ఫేజ్– 1 పనులు ముగియడంతో విమానాశ్రయం నుంచి కోయంబేడు మీదుగా సెంట్రల్‌కు, సెయింట్‌థామస్ మౌంట్ – ఆలందూరు – సెంట్రల్‌మీదుగా విమ్కో నగర్‌కు మెట్రో రైలు సేవలు సాగుతున్నాయి. ఈ సేవలకు అమిత స్పందన రావడంతో ఫేజ్– 2లో మరో మూడు మార్గాలుగా మాధవరం – సిరుచ్చేరి, మాధవరం – షోళింగనల్లూరు, పూందమల్లి – లైట్ హౌస్‌ను ఎంపిక చేసే పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అయితే ఈ పనులకు కేంద్రం నిధులు కేటాయించక పోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై రాష్ట్ర ప్రభుత్వం, మెట్రో యాజమాన్యం పరిశీలన చేపడుతున్నారు. అదే సమయంలో చెన్నై విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా పరందూరులో నిర్మించనున్న మరో విమానాశ్రయానికి సైతం మెట్రో మార్గం రూపు రేఖల నమూనా సిద్ధమైంది. పూందమల్లి నుంచి 43.66 కి.మీ దూరం వంతెన మార్గంలో పరందూరుకు రూ. 10,712 కోట్ల ఖర్చుతో పనులకు కార్యాచరణ రూపొందించారు. ఈ మార్గంలో 19 రైల్వే స్టేషన్లు, మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు, మాల్స్ తదితర నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సమగ్ర నివేదికలో రూపొందించి కేంద్రం అనుమతిని పొందారు. అదే సమయంలో చెన్నై జరుగుతున్న మెట్రో పనులకు తోడుగా ప్రస్తుతం పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా రైళ్లను కొనుగోలు చేయడానికి మెట్రో యాజమన్యం కసరత్తు వేగవంతం చేసింది.

28 రైళ్ల కొనుగోలుకు నిర్ణయం

చెన్నైనగరంలో ప్రస్తుతం 54 కి.మీ దూరం రెండు మార్గాల్లో రోజుకు 45 రైళ్లను నడుపుతున్నారు. రోజుకు సుమారు 3 లక్షల మంది మెట్రో రైలు సేవలను వినియోగిస్తున్నారు. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో అదనంగా రైళ్ల కొనుగోలు తప్పనిసరిగా మారాయి. అదే సమయంలో ప్రస్తుతం నాలుగు బోగీలతో కూడిన మెట్రోరైలు పట్టాల మీద దూసుకెళ్తోంది. రానున్న కాలంలో ఆరు బోగీలతో కూడిన మెట్రో రైలు, డ్రైవర్ రహితంగా మెట్రో రైలు సేవల అంటూ అధికార వర్గాలు కసరత్తు చేపట్టారు. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కేంద్రం అనుమతి కోసం నివేదికను మెట్రో రైలు అధికారులు పంపించారు. ఇందుకు ప్రస్తుతం కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చినట్లుగా తెలిసింది. రూ. 2,820 కోట్లతో 28 రైళ్లను ఆరు బోగీలతో కొనుగోలు చేయడానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే కేంద్రం నుంచి నిధులు అనుమానం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రపంచ బ్యాంక్ లేదా మరేదేనీ బ్యాంక్‌ల నుంచి రుణాలు పొందే దిశగా మెట్రో వర్గాలు ప్రయత్నాలను వేగవంతం చేశాయి.



మెట్రో రైలు

కాటేసిన అప్పులు

- కొడుకు, కుమార్తె సహా దంపతుల బలవన్మరణం

సాక్షి, చెన్నై: దిండిగల్‌కు చెందిన ఓ స్వర్ణకారుడు భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి పుదుచ్చేరిలోని ఓ హోటల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. దిండిగల్‌కు చెందిన చంద్రశేఖర్ (52) స్వర్ణ కారుడు. అతనికి భార్య సరస్వతి (48), కుమారుడు సుదర్శన్ (25), కుమార్తె సౌమ్య (22) ఉన్నారు. వీరు ఈనెల 7వ తేదీన కుటుంబ సమేతంగా పుదుచ్చేరికి వచ్చారు. పుదువాయి ముత్తుమారియమ్మన్ ఆలయం రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గది తీసుకున్నారు. వాస్తవానికి వీరు శుక్రవారమే గది ఖాళీ చేయాల్సి ఉంది. అయితే, తమకు అదనంగా మరో రోజు సమయం కావాలని సిబ్బందిని కోరాడు. ఈ మేరకు శనివారం ఉదయం ఖాళీ చేయాల్సి ఉంది. ముందుగానే గది అద్దెతో పాటు అన్ని రకాల చార్జీలు చెల్లించడంతో చంద్రశేఖర్‌కు అక్కడి సిబ్బంది కాస్త సమయం ఇవ్వడానికి నిర్ణయించారు. ఉదయం గది నుంచి బయటకు ఎవరూ రాక పోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ జయశంకర్ నేతృత్వంలోని పోలీసులు అక్కడికి చేరుకుని స్పేర్ కీతో గది తలుపు తెరిచి లోపలికి వెళ్లి చూడగా అక్కడ చంద్రశేఖర్ కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడి పడి ఉండడం వెలుగు చూసింది.

లేఖలో..

మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గదిలో నుంచి ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలు కరిగించే వ్యాపారంలో నష్టం రావడం, అప్పులు పెరగడం, అప్పు ఇచ్చిన వారి నుంచి వేదింపులు ఉండటం వంటి అంశాలను చంద్రశేఖర్ లేఖలో ప్రస్తావించారు. అయితే తమను వేధించిన వారి వివరాలను మాత్రం తెలియజేయలేదు.

పొన్ మాణిక్య వేల్‌పై సీబీఐ గురి



మీడియాతో మాట్లాడుతున్న పొన్ మాణిక్య వేల్

సాక్షి, చెన్నై: మాజీ ఐజీ పొన్ మాణిక్య వేల్‌ను సీబీఐ టార్గెట్ చేసింది. ఆయనపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో శనివారం చెన్నై శివారులోని పాలవాక్కంలోని నివాసంలో సోదాలు నిర్వహించారు. పొన్ మాణిక్య వేల్ వద్ద విచారణ జరిపారు. వివరాలు.. విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగం ఐజీగా పొన్ మాణిక్య వేల్ పని తీరు గతంలో ప్రశంసలు అందుకుంది. పదవీ విరమణ అనంతరం కూడా మద్రాసు హైకోర్టు సైతం ఆయన్ని విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగంలో పర్యవేక్షణాధికారిగా గతంలో నియమించింది. ఈ మేరకు ఆయన తన సేవలను అందించారు. అయితే ఆయనపై గతంలో సస్పెండ్‌కు గురైన తిరువళ్లువర్ డీఎస్పీగా పనిచేసిన ఖాదర్‌భాష చేసిన పలు ఆరోపణలు చర్చకు దారి తీశాయి. అంతర్జాతీయ ముఠాతో పొన్ మాణిక్య వేల్ చేతులు కలిపారని, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. కోర్టును సైతం ఆయన ఆశ్రయించడంతో వ్యవహారం ముదిరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం పొన్ మాణిక్య వేల్‌పై సీబీఐ విచారణకు ఆదేశించింది.

కేసు నమోదుతో విచారణ

కోర్టు ఆదేశాలతో రిటైర్డ్ ఐజీ పొన్ మాణిక్యవేల్‌పై సీబీఐ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిని వ్యతిరేకిస్తూ అప్పీల్‌కు ఆయన వెళ్లారు. విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించడంతో సీబీఐ రంగంలోకి దిగింది. శనివారం ఉదయాన్నే పాలవాక్కంలోని ఆయన నివాసానికి నలుగురు సీబీఐ అధికారులతో కూడిన బృందం వెళ్లింది. ఆయన ఇంట్లో సోదాలు జరిగినట్లు సంకేతాలు వెలువడ్డాయి. కొన్ని గంటల పాటు ఆయన వద్ద విచారణ జరిపారు. అనంతరం సీబీఐ అధికారులు వెళ్లి పోగా మీడియా ముందుకు పొన్‌మాణిక్య వేల్ వచ్చారు. తానేమిటో, తన పని తీరు ఏమిటో, తన నిజాయితీ ఏమిటో తన మనసాక్షికి తెలుసునని వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో చోరీకి గురైన విగ్రహాలు దేశ విదేశాలలో ఉన్నట్టుగా గుర్తించి విచారణ చేపట్టి, వాటిని ఇక్కడకు తాను తీసుకొచ్చానని, స్మగ్లర్లను అరెస్టు చేసి కట కటాలలోకి నెట్టానని వ్యాఖ్యలు చేశారు. మరణించే వరకు తాను ఇలాగే ఉంటానని, ఏ రాజకీయ పార్టీకి వత్తాసు పలకనని, ఏ పార్టీలోనూ చేరనని స్పష్టం చేశారు.

వ్యక్తిగత స్వార్థంతో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

- పిటిషనర్‌కు రూ.50,00 జరిమానా విధించిన మద్రాసు హైకోర్టు

కొరుక్కుపేట: తమిళనాడు తాగునీటి సరఫరా విభాగంలో టెండర్ల వ్యవస్థ , పరిపాలనా అవకతవకలకు సంబంధించి కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు నిర్వహించాలని కుంబకోణంకు చెందిన కన్నన్ స్వామినాథన్ చెన్నై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి డి. కృష్ణకుమార్, న్యాయమూర్తి బాలాజీ ముందుకు వచ్చింది. తాగునీటి సరఫరా విభాగం తరపున పిటిషనర్ సోదరుడు గణపతి స్వామినాథన్ ఇప్పటికే టెండర్ తీసుకున్నారు. అయితే ఈసారి తమ వారికి టెండర్లు రాకపోవడంతో, పిటిషనర్ సోదరుల వ్యక్తిగత లాభం కోసం ఈ పిటిషన్ వేసినట్లు తేలింది. అదే సమయంలో లాయర్ వాదిస్తున్న సమయంలో తరచూ అడ్డు తగలడంతో న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత పిటిషన్‌ను కొట్టివేస్తూ, పిటిషనర్ కన్నన్ స్వామినాథన్ రూ. 50,000 జరిమానాగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించారు.

ఫార్ములా కార్ రేస్ పోటీలను వ్యతిరేకిస్తూ..

- సుప్రీంకోర్టులో అన్నాడీఎంకే పిటిషన్



కార్ రేస్

సాక్షి, చెన్నై : ఫార్ములా కార్ రేస్ – 4 ఇండియన్ ఛాంపియన్ షిప్ పోటీలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో శనివారం అన్నాడీఎంకే పిటిషన్ దాఖలు చేసింది. చెన్నై వంటి రద్దీతో కూడిన నగరం రోడ్లలో నైట్ స్ట్రీట్ సర్క్యూట్‌గా కార్ రేస్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు, క్రీడా కారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారత దేశంలోనే ప్రప్రథమంగా నైట్‌స్ట్రీట్ సర్క్యూట్‌గా ఫార్ములా కార్ రేస్ –4కు గత ఏడాది చర్యలు తీసుకున్నారు. డిసెంబర్‌లో జరగాల్సిన ఈ పోటీలు మిఛాంగ్ తుఫాన్ కారణంగా వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఈనెల 30, 31, సెప్టెంబర్1వ తేదీ తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో ప్రామోటర్ ఆఫ్ ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్(ఆర్‌పీపీఎల్) నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈ పోటీ చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్ మైదానం చుట్టూ ఉన్న 3.5 కి.మీ దూరం రాత్రి పూట జరగనుంది.

కోర్టులో పిటిషన్..

ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి అన్నాసాలై, శివానంద సాలై, నేప్పియర్ వంతెన మీదుగా మళ్లీ ఆ గ్రౌండ్ వరకు చేరే విధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అయితే రద్దీతో కూడిన ఈ ప్రాంతంలో కార్ రేస్ నిర్వహణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని పేర్కొంటూ అన్నాడీఎంకే నేతృత్వంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పార్టీ న్యాయవాదులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఐలాండ్ గ్రౌండ్, అన్నాసాలైలలో నిత్యం ఉండే రద్దీ, ఆ పరిసరాల్లోని ఆస్పత్రులు, నివాస ప్రాంతాలు తదితర అన్ని రకాల అంశాలను పిటిషన్‌లో వివరించారు. కార్ రేస్ కారణంగా ఈ మార్గాలలో ట్రాఫిక్ మళ్లింపులు జరుగుతాయని, ఈ కారణంగా అనేక మార్గాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. పోటీల నిర్వహణ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో త్వరితగతిన ఈ పిటిషన్‌ను విచారించాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు.

అన్నావర్సిటీలో నిర్వహణ కమిటీ ఏర్పాటు

- ముగిసిన వీసీ పదవీ కాలం
- ఐదు వర్సిటీలకు వీసీలు లేరు



అన్నా వర్సిటీ

సాక్షి, చెన్నై : అన్నావర్సిటీ వీసీ వేల్‌రాజ్ పదవీ కాలం శనివారంతో ముగిసింది. దీంతో వర్సిటీ వ్యవహారాల నిర్వహణకు కమిటీని ప్రభుత్వం నియమించింది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలోని అన్నావర్సిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలన్ని అన్నావర్సిటీ పరిధిలోనే ఉన్నాయి. ఈ వర్సిటీ పర్యవేక్షణలో సాంకేతిక విద్యా డైరెక్టరేట్ నేతృత్వంలో ప్రస్తుతం ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగనుంది. ఈ పరిస్థితుల్లో ఈ వర్సిటీకి వైస్ ఛాన్స్‌లర్(వీసీ)గా ఉన్న వేల్‌రాజ్ పదవీ కాలం శనివారంతో ముగిసింది. దీంతో కొత్త వీసీ నియమించేవరకు నిర్వహణ వ్యవహారాల పర్యవేక్షణకు ఓ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి ప్రదీప్‌కుమార్, సాంకేతిక విద్యా డైరెక్టరేట్ కమిషనర్ అబ్రహం, అన్నావర్సిటీ ప్రొఫెసర్ ఉషాలు ఈ కమిటీలో ఉన్నారు. రాష్ట్రగవర్నర్‌కు ఈ కమిటీ ని సిఫార్సు చేశారు. ఆయన ఆమోదం తదుపరి ఈ కమిటీ అన్నావర్సిటీ వ్యవహారాలను పర్యవేక్షించనుంది.

వీసీల నియామకం ఎప్పుడో..?

రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్‌కు మధ్య అభిప్రాయ భేదాలు, వీసీల నియామకంలో జరుగుతున్న వివాదాల వల్ల ప్రస్తుతం పలు వర్సిటీల్లో వైస్ చాన్స్‌లర్ పోస్టు ఖాళీగా ఉంది. మద్రాసు వర్సిటీ, మదురై వర్సిటీ, కోయంబత్తూరు వర్సిటీ తదితర నాలుగు వర్సిటీలకు ఇప్పటికే వీసీల నియామకం జరగలేదు. తాజాగా అన్నావర్సిటీ వీసీ పదవీ కాలం కూడా ముగిసింది. దీంతో ఈ సంఖ్య ఐదుకు చేరింది. మద్రాసు వర్సిటీ వీసీ నియామకంలో జాప్యంతో 55 వేల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో వీసీల పదవులు ఎప్పుడు భర్తీ అయ్యేనో? వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా, మద్రాసు వర్సిటీ పరిధిలోని కళాశాలలోని 55 వేలమంది విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం ఎదురు చూస్తుండడం గురించి గవర్నర్ ఆర్ ఎన్ రవికి తమిళనాడు మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మద్రాసు వర్సిటీ మాజీ సిండికేట్ సభ్యుడు సీఎంకే రెడ్డి శనివారం లేఖ రాశారు. త్వరితగతిన వీసీ నియమానికి చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

వైద్య సీట్లకు 43 వేల మంది దరఖాస్తు

- ముగిసిన స్వీకరణ ప్రక్రియ



మెడికల్ విద్యార్థులు (ఫైల్)

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం 42,957 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్వీకరణ ప్రక్రియ ముగియడంతో ర్యాండం నెంబర్ల కేటాయింపు, ర్యాంకుల జాబితాపై అధికారులు దృష్టి పెట్టారు. వివరాలు.. రాష్ట్రంలో ప్రభుత్వ నేతృత్వంలోని 36 వైద్య కళాశాలలో 5,050 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అలాగే ఒక ఈఎస్ఐ కళాశాలలో 150 సీట్లు, 21 ప్రైవేటు కళాశాలలో 3,400 సీట్లు, 3 ప్రైవేటు డీమ్డ్ వర్సిటీలలో 450 సీట్లు అంటూ మొత్తంగా తమిళనాడులో 9,050 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 3 ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో 250 బీడీఎస్ సీట్లు, 20 ప్రైవేటు కళాశాలలలో 1,950 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం సీట్లలో కేంద్రం కోటాలోకి ఎంబీబీఎస్ 851, బీడీఎస్ 38 సీట్లు చేర్చారు. రాష్ట్రంలోని సీట్ల భర్తీకి నీట్ మార్కుల ఆధారంగా రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టరేట్ చర్యలు చేపట్టింది.

సీట్లకు డిమాండ్..

గత నెల 31వ తేదీ నుంచి వైద్య కోర్సులకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రక్రియ శుక్రవారం రాత్రితో ముగిసింది. 42,957 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరి దరఖాస్తుల పరిశీలన, మార్కుల ఆధారంగా ర్యాండం, ర్యాంకుల జాబితా తయారీ మీద అధికారులు దృష్టి పెట్టారు. దీనిని ఈనెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు 7.5 శాతం ప్రత్యేక కోటా అమల్లో ఉన్న దృష్ట్యా ఇందుకు సంబంధించిన విద్యార్థుల జాబితా తయారీ చర్యలు చేపట్టారు. క్రీడ తదితర రిజర్వుడ్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 14వ తేదీ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈనెల 21వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది.

కశ్మీర్‌లో సెంటర్ ?

నీట్ పీజీ వైద్య కోర్సుల (పోస్టు గ్రాడ్యువేషన్) పరీక్ష ఆదివారం జరగనున్న విషయం తెలిసిందే. తమిళనాడుకు చెందిన అనేక మంది విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో సెంటర్లు కేటాయించినట్లుగా వెలువడ్డ సమాచారం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంతో ఇక్కడి విద్యార్థులు రాష్ట్రంలోనే పరీక్ష రాయవచ్చు అని జాతీయ పరీక్షల విభాగం ప్రకటించింది. అయినా కొందరు విద్యార్థులకు ఇతర రాష్ట్రాలలో సెంటర్లు కేటాయించడం వెలుగులోకి వచ్చింది. ఇందుకు ఉదాహరణ ధర్మపురికి చెందిన ఓ విద్యార్థికి ఏకంగా కశ్మీర్‌లో పరీక్ష కేంద్రం కేటాయించడం వెలుగు చూసింది. ఈ విద్యార్థి చెన్నై నుంచి విమానంలో ఒక రోజు ముందుగా కశ్మీర్‌కు బయలుదేరి వెళ్లినట్టుగా వచ్చిన సమాచారాన్ని పీఎంకే అధ్యక్షుడు రాందాసు తెరమీదకు తెచ్చారు. ఇంతటి దారుణమా? అని పేర్కొంటూ, పరీక్ష కేంద్రాల ఎంపికలో ఏ మేరకు తప్పులు జరిగి ఉన్నాయో వివరిస్తూ, ఈ పరీక్షను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

నటి ఆత్మహత్య కేసులో భర్త నిర్దోషి

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు



చిత్ర పెళ్లినాటి ఫొటో

తిరువళ్లూరు: సీరియల్ నటి చిత్ర ఆత్మహత్య వ్యవహారం గతంలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం కోర్టులో సాగిన క్రమంలో చిత్ర భర్తను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. వివరాలు.. వెండితెర నటి చిత్ర 2020 డిసెంబర్ 9న పూందమల్లి సమీపంలోని నసరత్‌పేట వద్ద వున్న ప్రైవేటు రిసార్ట్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చిత్ర ఆత్మహత్యకు ఆయన భర్త హేమనాథ్‌దే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపణలు చేసిన క్రమంలో అప్పట్లో శ్రీపెరంబదూరు ఆర్డీవో దివ్యశ్రీ విచారణ చేపట్టి నివేదికను కోర్టుకు సమర్పించారు. కాగా చిత్ర ఆత్మహత్య వ్యవహారంలో ఆమె భర్త హేమనాథ్ సహా పలువురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించగా మూడు నెలల తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. కేసు విచారణ తిరువళ్లూరు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో నాలుగేళ్లుగా సాగుతోంది. అయితే కోర్టులో కేసు విచారణ ఆలస్యంగా సాగుతుందని విచారణను త్వరగా పూర్తి చేసేలా తిరువళ్లూరు కోర్టును ఆదేశించాలని కోరుతూ చిత్ర తండ్రి కామరాజ్ హైకోర్టులో ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సాగించిన హైకోర్టు ఆరునెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని జిల్లా కోర్టును ఆదేశించింది. దీంతో తిరువళ్లూరు జిల్లా మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణలో వేగం పెంచింది. మొత్తం 56 మంది సాక్షులను విచారించింది. విచారణ పూర్త యిన క్రమంలో చిత్ర ఆత్మహత్య చేసుకునేలా భర్త హేమనాథ్ ప్రేరేపించారని సెక్షన్ 498ఏ, 306 కింద పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హేమనాథ్‌కు వ్యతిరేకంగా పోలీసులు సరైన ఆధారాలు చూపలేకపోయారని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి రేవతి, కేసు నుంచి అతడికి విముక్తి కల్పిస్తూ తీర్పు వెలువరించారు.

చెన్నై ఆదివారం । 11 । ఆగస్టు । 2024 సాక్షి

క్లుప్తంగా

రూ.80 లక్షల మోసం చేసిన దంపతులు అరెస్ట్

అన్నానగర్: అధిక వడ్డీ ఇప్పిస్తానని చెప్పి రూ.80 లక్షలు మోసం చేసిన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. చెన్నైలోని తిరువొత్తియూర్ రాజేశ్వరి నగర్‌కు చెందిన కలైమణి (63) అబుదాబిలోని ప్రభుత్వ సంస్థలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. ఇతని భార్య అమ్ము. ఈమె తల్లిదండ్రులు అంబత్తూరు సమీపంలోని వరదరాజపురం బజార్ వీధిలో నివాసం ఉంటున్నారు. బ్యాంకులో ఇచ్చే వడ్డీ కంటే ఎక్కువ వడ్డీ ఇస్తామని చెప్పి ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న గుణ శేఖరన్ (57), ఇతని భార్య వెంకటేశ్వరి(52) కలైమణి, అమ్ముల వద్ద రూ.80 లక్షల వరకు అప్పు తీసుకున్నట్లు తెలుస్తుంది. రుణం తిరిగి చెల్లించకపోవడంతో తిరువొత్తియూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి గుణశేఖరన్, వెంకటేశ్వరిని శనివారం అరెస్టు చేశారు.

పెరియార్ వర్సిటీ వీసీ, మాజీ రిజిస్ట్రార్‌పై కేసు?

సాక్షి, చెన్నై: వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న సేలం పెరియార్ వర్సిటీ వీసీ, మాజీ రిజిస్ట్రార్‌లపై కేసు నమోదుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు తెలిసింది. వివరాలు.. పెరియర్ వర్సిటీలో సాగుతున్న వివాదాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీసీకి వ్యతిరేకంగా ఇక్కడ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పోరాటాలు కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ వర్సిటీ కార్మిక సంఘంలోని నలుగురిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం రచ్చకెక్కింది. ఈ వ్యవహారం కార్మిక ట్రిబ్యునల్‌కు సైతం చేరింది. ఈ వ్యవహారంలో పెరియార్ వర్సిటీ వీసీ జగనాథన్, ప్రస్తుతం మాజీ రిజిస్ట్రార్‌గా ఉన్న బాలగురునాథన్‌లపై నేర పూరిత కేసు నమోదు చేయడానికి అనుమతులు జారీ అయ్యాయి. కార్మిక చట్టంలోని 1947 విభాగం 33(2)(బి)లో పేర్కొనబడిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వీసీ జగనాథన్, మాజీ రిజిస్ట్రార్ బాల గురునాథన్‌పై కేసు నమోదు చేసి విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి.

పంట పొలంలో పసికందు

అన్నానగర్: కడలూరు జిల్లా పన్రుటి సమీపంలోని రెడ్డికుప్పం వద్ద పంట పొలం శనివారం నవజాత శిశువును ఎవరలో వదిలి వెళ్లారు. మగ బిడ్డ ఏడుపు విని బాటసారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మగ పసికందును రక్షించి కడలూరు శిశు సంక్షేమ శాఖకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత యూఎస్ కాన్సులేట్ టీం

- ట్రోఫీని అందజేసిన ఆర్కాట్ నవాబ్ యూసఫ్ అలీ



యూఎస్ కాన్సులేట్ టీమ్ ట్రోఫీని అందజేస్తున్న మహ్మద్ అలీ, హరిహరన్

కొరుక్కుపేట: ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఐసీడబ్ల్యూవో)ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తొలి డీపీఎల్- డిప్లమాట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా యూఎస్ కాన్సులేట్ -చెన్నై టీమ్ నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. చెన్నై కొరట్టూరులో జరిగిన ఈ పోటీలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న మలేషియా కాన్సులేట్-చెన్నై కాన్సులేట్ జనరల్ శరవణ కుమార్ కుమారవాసగం ప్రారంభించారు. ఐసీడబ్ల్యూవో సెక్రటరీ ఏజే హరిహరన్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ పోటీల్లో మలేషియా కాన్సులేట్- చెన్నై టీమ్ , యూఎస్ కాన్సులేట్ టీమ్‌లు పోటీ పడ్డాయి. రసవత్తరంగా సాగిన పోటీల్లో యూఎస్ కాన్సులేట్ టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు గౌరవ అతిథిగా పాల్గొన్న ఆర్కాట్ రాజు నవాబ్ మహ్మద్ ఆసిఫ్ అలీ చేతుల మీదుగా ట్రోఫీలను అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐసీడబ్ల్యూవో సంస్థ నిర్వాహకులు ఏజే హరిహరన్ ఓ మంచి కాన్సెప్ట్‌తో క్రికెట్ పోటీలను నిర్వహించడంపై అభినందించారు. బాలికలపై లైంగిక వేధింపులు అడ్డుకోవటం, బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడం, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా అరికట్టడం వంటి వాటిపై అవగాహన పెంచడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు . ఇందులో యూఎస్ కాన్సులేట్ – చెన్నై మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డ్వానోలిన్ తోపాటు సోకాఐకేడా మహిళా కళాశాల చైర్మెన్ సేతు కుమనన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం



వీఐటీలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న చాన్సలర్ విశ్వనాథన్

వేలూరు: విద్యార్థులు విద్యతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్ అన్నారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఆవరణలో తమిళనాడు వెయిట్‌లిఫ్టింగ్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలూరు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రారంభించి 60 సంవత్సరాలు కావొస్తుందన్నారు. ఒంటరి వ్యక్తితో దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అంటే అందుకు కారణంగా వేలూరుకు చెందిన వెయిట్ లిఫ్టర్ సతీష్ అన్నారు. మంచి ఆరోగ్యంగా ఉంటే ప్రతి ఒక్కరూ పలు విజయాలు సాధించవచ్చన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యతలు ఇవ్వాలన్నారు. అమెరికా అనంతరం పథకాలు సాధించడంలో చైనా ఉందని ఇకపై ఇండియా ఆ స్థానంలోకి వచ్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. వీఐటీ యూనివర్సిటీ విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలువురు జూనియర్, సీనియర్ అనే రెండు టీమ్‌లుగా జరగనుందని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించే వారిని జాతీయ స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, రాష్ట్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

15న కాంగేశంకు శివగంగై నౌక సేవ

- విజయవంతంగా ట్రయల్ రన్



నౌక

సాక్షి, చెన్నై : తమిళనాడులోని నాగపట్నం – శ్రీలంకలోని కాంగేశం హార్బర్ మధ్య శివగంగై పేరిట నౌక సేవకు చర్యలు చేపట్టారు. ఈ నౌక ట్రయల్ రన్ శనివారం విజయవంతమైంది. వివరాలు.. నాలుగు దశాబ్దాల అనంతరం తమిళనాడు – శ్రీలంక మధ్య ప్రయాణికుల నౌక నడిపేందుకు కేంద్రప్రభుత్వం గత ఏడాది చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. సిరియపాణి అని నామకరణం చేసిన నౌకలో 150 మంది ప్రయాణించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గత ఏడాది అక్టోబరులో ఈ నౌకాయానం సేవలకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. తొలి రోజు 50 మంది, మరుసటి రోజు 15 మంది మాత్రమే ఈ నౌకలో ప్రయాణించారు. పాస్ పోర్టు, వీసా, ఇతర అనుమతులను పొందడంలో నెలకొన్న జాప్యంతో పాటు డీజిల్ ఖర్చులకు కూడా సరిపడేందుకు తగినట్టుగా ప్రయాణికుల సంఖ్య లేక పోవడంతో సేవను రద్దు చేశారు. ప్రస్తుతం అన్ని రకాల సమస్యలను అధిగమించారు. వీసా లేకుండా నౌక ప్రయాణానికి సంబంధించిన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో నౌక సేవలను మళ్లీ పునరుద్దరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సిరియాపాణి అన్న నౌకను పక్కన పెట్టి శివగంగై పేరిట కొత్త నౌకను సిద్ధం చేశారు. ఈ నౌక సేవలు మే 13వ తేదీ అని ఒకసారి, 19వ తేదీ అని మరోసారి అధికారులు ప్రకటించారు. చివరకు ఆగస్టు 15వ తేది స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి నౌక సేవలు జరుగుతాయని ప్రకటించారు. ముందుగా నౌక ట్రయల్ రన్‌కు చర్యలు తీసుకున్నారు. అండమాన్ నుంచి చెన్నై మీదు నాగపట్నంకు చేరుకున్న ఈ శివగంగై నౌక ట్రయల్ రన్ శనివారం చేపట్టారు. ఉదయం నాగపట్నం నుంచి కాంగేశంకు ఈ నౌక బయలుదేరి వెళ్లింది. సాయంత్రం ఇదే నౌక మళ్లీ తిరిగి నాగపట్నంకు చేరుకుంది. ఇప్పటికే పలు మార్లు వాయిదా పడ్డ ఈ నౌక ప్రయాణం, ఈ సారైనా సజావుగా సాగేనా? అనే సందిగ్ధత నెలకొంది.

బస్సు ఢీకొని డీఎంకే కౌన్సిలర్ మృతి

అన్నానగర్: మదురై జిల్లా ఉసిలంపట్టి ప్రాంతానికి చెందిన దురైపాండి (45) డీఎంకే కార్యకర్త. అలాగే ఉసిలంపట్టి పంచాయతీ యూనియన్ 4వ వార్డు కౌన్సిలర్. ఇతను శుక్రవారం సాయంత్రం తన బైకులో వత్తలకుండు వెళ్తుండగా.. ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దురైపాండిని ఇరుగుపొరుగు వారు రక్షించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను శనివారం మృతి చెందాడు.

లారీ ఢీకొని డ్రైవరు..

తిరువొత్తియూరు: పూందమల్లి సమీపంలో ప్రైవేటు కర్మాగారానికి తాను నడుపుకుంటూ వచ్చిన లారీ నే ఢీకొని డ్రైవరు మృతి చెందాడు. వివరాలు.. చెన్నై ఎర్నావూరు ప్రాంతానికి చెందినవారు ఎలిల్ రాజు (28) లారీ డ్రైవర్. ఇతనికి వారం రోజుల క్రితం వివాహమైంది. గురువారం రాత్రి పూందమల్లి సమీపంలో ఉన్న పారివాక్కం నుంచి ప్రైవేటు గిడ్డంగికి చెన్నై నుంచి సరుకులను లారీలో ఎక్కించుకుని వచ్చాడు. తర్వాత అతను అక్కడున్న ప్రాంతంలో లారీ ఇంజన్ ఆఫ్ చేయకుండా నిలిపి ఉంచి కిందకు దిగి గోడౌన్‌కు లారీకి మధ్య వున్న దూరాన్ని చూస్తున్నాడు. ఆ సమయంలో లారీ తనకు తానుగా ముందు కదిలి నిలబడి ఉన్న డ్రైవరు ఎలిల్ రాజును ఢీకొట్టింది. ఇందులో తల నలిగి అదే చోట ఎలిల్ రాజు సంఘటన స్థలంలోని మృతి చెందాడు. పూందమల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు యువకుల అనుమానాస్పద మృతి

సాక్షి, చెన్నై: కొడైకెనాల్ టూర్‌కు తిరుచ్చికి చెందిన శివశంకర్, శివరాజ్, ఆనంద్‌బాబు, జయకన్నన్ మిత్రులు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లారు. అక్కడి కొండ రిసార్ట్‌లో రెండు గదులు తీసుకున్నారు. ఓ గదిలో శివశంకర్, శివరాజ్ ఉన్నారు. కొడైకెనాల్ వర్షం కారణంగా బయటకు వెళ్ల లేని పరిస్థితి. దీంతో తాము బస చేసిన గదిలోని బొగ్గు పొయ్యను ఏర్పాటు చేసుకున్నారు. బాబి క్యూ చికెన్ తయారు చేసుకున్నారు. మద్యం మత్తుకు చిత్తై ఆ పొయ్యిను ఆర్పకుండా నిద్ర పోయారు. శనివారం ఎంతకు మిత్రులు గది నుంచి రాక పోవడంతో మరో గదిలో ఉన్న ఆనంద్‌బాబు, జయకన్నన్ వెళ్లి చూశారు. లోనికి వెళ్లి చూడగా శివశంకర్, శివరాజ్ మరణించి పడి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యానికి చిత్తయిన వీరు పొయ్యి నుంచి వెలువడిన పొగకు ఊపిరి ఆడక మరణించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

రూ. 10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

- మాజీ పోలీసు సహా ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

అన్నానగర్: తంజావూరు జిల్లా అదిరాంపట్టణం నుంచి సముద్ర మార్గంలో శ్రీలంకకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వండిపేట్ ప్రాంతంలో అదిరాంపట్టణం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం అటుగా వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేశారు. ఆ సమయంలో కారులో గంజాయి ప్యాకెట్ల కట్టలు, కట్టలుగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కారులో ఉన్న 117 కిలోల గంజాయి కట్టలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులను విచారించారు. నిందితులు పుదుకోట్టై ప్రాంతానికి చెందిన శంకర్ రాజపాండియన్ (33), అతని స్నేహితుడు తవమణి (26) అని తేలింది. వీరిద్దరూ ఆంధ్ర రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి శ్రీలంకకు తరలించేందుకు యత్నించినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.10 లక్షలు. అరెస్టయిన శంకర్ రాజపాండియన్ సస్పెన్షన్‌కు గురైన పోలీసు కావడం గమనార్హం.

చాలా అవకాశాలు కోల్పోయాను..!


నటి మృణాల్ ఠాకూర్

తమిళసినిమా: సీతారామం చిత్రం ఫేమ్ నటి మృణాల్ ఠాకూర్ గురించి ఇప్పుడు పరిచయం అవసరం ఉండదనుకుంటా. ఈ బెంగాలీ బ్యూటీ మాతృభాషలోనే కాకుండా కొన్ని హిందీ చిత్రాల్లోనూ నటించారు. అయితే ఆయా చిత్రాల్లో రాని పేరు తెలుగులో దులకర్ సల్మాన్ సరసన నటించిన సీతారామమ్ చిత్రంతో వచ్చింది. ఆ చిత్రంతో ఒక్క సారిగా దక్షిణాదిలో స్టార్ హీరోయిన్ అయ్యిపోయ్యారు. ఆ తరువాత నానితో జత కట్టిన హాయ్ నాన్నా చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. అయితే విజయ్ దేవరకొండతో నటించిన ఫ్యామిలీస్టార్ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. దీంతో తెలుగులో అవకాశాలు దూరం అయ్యాయనే చెప్పాలి. కాగా తమిళంలో నటుడు శివకార్తికేయన్‌కు జంటగా నటించే అవకాశాన్ని చేజార్చుకున్నారనే ప్రచారం జరిగింది. ఇక పోతే సీతారామమ్ వంటి చిత్రాల్లో హోమ్లీగా నటించిన మృణాల్ ఠాకూర్ ఆ తరువాత గ్లామర్ వైపు మొగ్గు చూపారు. ముద్దు సన్నివేశాల్లోనూ నటించి ఆమె తల్లిదండ్రులకు షాక్ ఇచ్చారు. అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని మృణాల్ ఠాకూర్ తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారట. దీని గురించి ఆమె ఒక భేటీలో పేర్కొంటూ తాను సినిమాల్లో లిప్‌లాక్ సన్నివేశాల్లో నటించడం తన తల్లిదండ్రులకు ఇష్టం లేదన్నారు. దీంతో పలు అవకాశాలను కోల్పోయానన్నారు. ఆ తరువాత తాను ఒక నిర్ణయం తీసుకున్నానని, తన తల్లిదండ్రులని పిలిచి లిప్‌లాక్ వంటి సన్నిహిత సన్నివేశాల్లో నటించడం తనకూ భయమేనని,అయితే ఈ రంగంలో అలాంటివి చాలా అవసరం అనీ, ఇది తన ఛాయిస్ కాదనీ వివరించి చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ తరువాతనే ఈ అమ్మడు ఎలాంటి సన్నివేశాల్లోనైనా నటించడానికి రెడీ అంటున్నారట.

లారాకి విజయ్ సేతుపతి ప్రశంస

తమిళసినిమా: ఆ మధ్య కారైక్కాల్‌లో జరిగిన ఒక యాదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం లారా. ఇన్‌వెస్టిగేషన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఇతివృత్తంతో కూడిన ఈ చిత్రాన్ని కొవైలోని కన్‌స్ట్రక్షన్ రంగానికి చెందిన ఎం.కార్తికేయన్ ఎంకే ఫిలింస్ మీడియా వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా మణిమూర్తి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పిడిచ్చిరుక్కు, మురుగా చిత్రాల ఫేమ్ అశోక్‌కుమార్ హీరోగా నటించగా ఇందులో నటి అనుశ్రీ, వెన్మతి, వర్షిణి మొదలగు ముగ్గురు హీరోయిన్లుగా నటించారు. నటి మాథ్యూ వర్గీస్, కార్తీకేశన్, ఎస్‌కే.బాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఆర్‌జే.రవిన్ ఛాయాగ్రహణం, రఘు సరవణ్‌కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. కాగా ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది ఇన్వెస్టిగేషన్, సస్పెన్స్, థ్రిల్లర్ అనే మూడు జానర్లలో సాగే కథా చిత్రం అన్నారు. ఈ చిత్ర టైటిల్‌ను ఇటీవల నటుడు సత్యరాజ్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. తాజాగా చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు విజయ్‌సేతుపతి విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిత్ర టైటిల్‌ను, చిత్ర కథ వివరాలను తెలుసుకుని చాలా బాగున్నాయంటూ ఆయన ఎంతగానో ప్రశంసించారని చెప్పారు. లారా చిత్రం అన్ని వర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు.



ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన విజయ్‌సేతుపతితో యూనిట్ సభ్యులు

కోలీవుడ్ టాక్స్

'హాట్‌స్టార్' ట్రైలర్ చూడగానే.. అలా అనిపించింది


హాట్‌స్టార్-2 మచ్ చిత్రం యూనిట్

తమిళసినిమా: దర్శకుడు విఘ్నేష్ కార్తిక్ దర్శకత్వం వహించిన చిత్రం హాట్‌స్టార్. ఈ చిత్రం ట్రైలర్ పలు విమర్శలకు గురైనా, విడుదలైన తరువాత మంచి విజయాన్ని సాధించింది. ఓటీటీలో అంతకంటే ఎక్కువగా హిట్ అయ్యింది. కాగా తాజాగా దానికి సీక్వెల్‌గా హాట్‌స్టార్-2 మచ్ పేరుతో తెరకెక్కించనున్నారు దర్శకుడు విఘ్నేష్ కార్తిక్. అయితే ఈ సారి నటుడు విష్ణు విశాల్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఆయన విష్ణు విశాల్ స్టూడియోస్ సమర్పణలో కేజేబీ టాకీస్, సెవెన్ వారియర్స్ సంస్థలు నిర్మించనున్న ఈ చిత్రం కేవీ దురై క్రియేటివ్ ప్రొడక్షన్స్ సంస్థ పర్యవేక్షణలో రూపొందనుంది. ఈ వివరాలను వెల్లడించడానికి యూనిట్ వర్గాలు శుక్రవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు విఘ్నేష్ కార్తిక్ మాట్లాడుతూ హాట్‌స్టార్ చిత్రానికి ముందు విమర్శలు వచ్చినా, విడుదలైన తరువాత ప్రేక్షకుల ఆదరణ విశేషంగా లభించిందన్నారు. కాగా దానికి సీక్వెల్‌గా రూపొందిస్తున్న హాట్‌స్టార్ -2 మచ్ చిత్రానికి నటుడు విష్ణువిశాల్ సమర్పకుడిగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం కూడా అందరి ఆదరణను పొందుతుందన్నే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. అనంతరం నటుడు విష్ణువిశాల్ మాట్లాడుతూ హాట్‌స్టార్ చిత్రం ట్రైలర్ చూడగానే చాలా కోపం వచ్చిందన్నారు. సినిమా ప్రభావం సమాజంపై ఉంటుందని నమ్మే వ్యక్తిని తానని పేర్కొన్నారు. దీంతో అందులో నటించిన కలైయరసన్‌కు ఫోన్ చేసి తిట్టానన్నారు. అలాంటిది చిత్రం విడుదలైన తరువాత ప్రేక్షకుల ఆదరణ చూసి, ఆశ్చర్యపోయానన్నారు. తానూ ఓటీటీలో చిత్రాన్ని చూడగా అందులోని ప్రతి కథ అంతగా నచ్చిందని చెప్పారు. అప్పుడే తన పిల్లలను ఎలా పెంచాలి అన్నది అర్థం అయ్యిందని చెప్పారు. అంతే కాకుండా వెంటనే దర్శకుడు విఘ్నేష్ కార్తిక్‌కు ఫోన్ చేసి అభినందించానన్నారు. ఇకపోతే హాట్‌స్టార్ చిత్రానికి సీక్వెల్ కథను తనకు చెప్పారన్నారు. కథ చాలా నచ్చిందన్నారు. దీంతో ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరించాలని భావించానన్నారు. ఇకపై తాను చిత్ర నిర్మాణంపై పూర్తిగా దృష్టి పెట్టాలని నిర్ణయించు న్నానని చెప్పారు. కొత్తవారిని ప్రోత్సహించనున్నానని నటుడు విష్ణువిశాల్ పేర్కొన్నారు. కాగా ఈ చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు దర్శకుడు చెప్పారు.

సుందర్ సీ దర్శకత్వంలో నయనతార?


నయనతార

తమిళసినిమా: సినిమా రంగంలో కొన్నిసార్లు అనుకున్నవి జరగవు. తాజాగా అదే జరుగుతోందని సమాచారం. నటి నయనతార దేవతగా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం మూక్కుత్తి అమ్మన్. నటుడు ఆర్‌జే. బాలాజీ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై డాక్టర్ ఐసరి గణేశ్ నిర్మించారు. 2022లో విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. దీంతో దీనికి సీక్వెల్ ఉంటుందని దర్శకుడు ఆర్‌జే బాలాజీ సమీప కాలంలో ప్రకటించారు. ఇందులో నటి త్రిష ప్రధాన పాత్రను పోషించనున్నారనే ప్రచారం జోరుగా సాగింది. దీనికి మాసాన్ అమ్మన్ అనే టైటిల్‌ను కూడా వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ మూకుత్తి అమ్మన్-2 చిత్రాన్ని నిర్మించనున్నట్లు, ఇందులో లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించనున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటించింది. అయితే దీనికి దర్శకుడు ఎవరన్నది వెల్లడించలేదు. దీంతో ఆర్‌జే.బాలాజీ దీనికి దర్శకత్వం వహించడం లేదా? అనే చర్చ కోలీవుడ్‌లో జరుగుతూ వచ్చింది. దానికి తెరపడేలా ఈ చిత్రానికి సుందర్.సీ దర్శకత్వం వహించనున్నారన్నది తాజా సమాచారం. కాగా మూక్కుత్తి అమ్మన్-2 చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థతో కలిసి నయనతార, విఘ్నేష్ శివన్ రౌడీ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా దర్శకుడు సుందర్ సీ తాజాగా దర్శకత్వం వహించిన అరణ్మణై 4 చిత్రం సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. మరో విషయం ఏమిటంటే మూక్కుత్తి అమ్మన్-2లో సుందర్ సీ నటిస్తారా? లేదా? అన్న ఆసక్తి నెలకొంది.


దర్శకుడు సుందర్ సీ

పేచి చిత్రం అందించిన విజయంతో..


పేచి చిత్ర సక్సెస్ మీట్‌లో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: వెలోస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అధినేత గోకుల్ బెనాయ్, వెరూస్ పిక్చర్స్ సంస్థ అధినేత షేక్ ముజీబ్ కలిసి నిర్మించిన చిత్రం పేచి. నవ దర్శకుడు బి. రామచంద్రన్ కథ, దర్శకత్వం బాధ్యతను నిర్వహించిన ఈ చిత్రంలో నటుడు బాలా శరవణన్, నటి గాయత్రి, దేవ్, జనా, ప్రీతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్స్ సంస్థ అధినేత గుహన్ ఈ నెల 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేశారు. హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్ర యూనిట్ చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు బీ.రామచంద్రన్ మాట్లాడుతూ దర్శకుడిగా తన తొలి చిత్రమే విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. వెరూస్ పిక్చర్స్‌కు చెందిన సంజయ్ జయ్‌శంకర్ మాట్లాడుతూ పేచి చిత్రానికి సంబంధించినంత వరకూ రియాల్ హీరో మీడియా అని పేర్కొన్నారు. తాము చిత్రాన్ని నిర్మించినా, పాత్రికేయుల రివ్యూలే ప్రేక్షకులను థియేటర్లకు తీసుకొచ్చాయన్నారు. పత్రికల రివ్యూలే ప్రేక్షకులను థియేటర్స్‌కు తీసుకొస్తాయని తన తండ్రి నటుడు జయ్‌శంకర్ చెబుతుండేవారన్నారు. తమ చిత్రం ద్వారా అది మరోసారి నిరూపణ అయ్యిందన్నారు. చిత్ర నిర్మాత కోకుల్ బెనాయ్ మాట్లాడుతూ ఇది పేచి చిత్ర విజయానికి ధన్యవాదాలు తెలిపే విజయోత్సవం అని పేర్కొన్నారు. ఆగస్టు ఒకటవ తేదీన చిత్ర ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శించినప్పుడే ఈ చిత్ర విజయం నిశ్చయం అయ్యిందన్నారు. ఈ చిత్రం ప్రమోషన్ కోసం చిన్న మొత్తాన్ని కేటాయించామని, అయితే అంతకు మించి మాస్‌గా చిత్రం రీచ్ అయితేనే విజయం అని భావించినప్పుడు మీడియా చాలా సపోర్టునిచ్చిందన్నారు. పేచి చిత్రం షూటింగ్ పూర్తి చేసి నిర్మాణాంతర కార్యక్రమాలకు సిద్ధం అవుతున్న సమయంలో తమకు సహకరించిన వెరూస్ సంస్థకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని నిర్మాత పేర్కొన్నారు. పేచి చిత్రం సీక్వెల్ గురించి అడుగుతున్నారని, ఈ చిత్రం అందించిన విజయోత్సాహంతో త్వరలోనే వెరూస్ సంస్థతో కలిసి మరో చిత్రం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

తిరువళ్లూరు: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా సీతంజేరి గ్రామానికి చెందిన నరసింహాన్ కుమారుడు నాగరాజ్(51) కొన్ని రోజులుగా అనారోగ్యంగా బాధపడుతూ చిక్సిత పొందుతున్నాడు. అయితే అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో మానసిక ఒత్తిడికి లోనైన నాగరాజ్ పొన్నియమ్మన్ ఆలయం వద్ద ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె విష్ణుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనాలూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ అనుమానాస్పద మృతి

తిరువళ్లూరు: కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ పెరువల్లూరు గ్రామానికి చెందిన రవి కుమా రుడు కలైయరసన్(36) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం యథావిధిగా కూలి పనులకు వెళ్లిన కలైయరసన్ సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే శుక్రవారం సాయంత్రం కలైయరసన్ అనుమానాస్పద స్థితిలో వ్యవసాయ పొలంలో శవమై కనిపించాడు. ఈ సంఘటనపై మృతురాలి తల్లి నాగమ్మాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడంబత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కూలీపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన వృద్ధురాలు

అన్నానగర్: ఓ వృద్ధురాలు కూలీపై పెట్రోల్ పోసి నిప్పు అంటించింది. తేని జిల్లా, ఉత్తమపాళయం సమీపంలోని పెరుమాళ్ పట్టికి చెందిన పెరు మాయి (73). ఈమె పక్కింటికి చెందిన మారిసెల్వం (48) మధ్య సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటుపై గత కొద్దిరోజులుగా గొవడ జరుగుతోంది. శుక్రవారం కూడా ఇదే విషయంపై ఘర్షణపడ్డారు. దీంతో కోపోద్రిక్తురాలైన పెరుమాయి క్యాన్‌లోని పెట్రోలు తీసి మారిసెల్వంపై పోసి నిప్పంటించింది. ఇందులో తీవ్రంగా గాయపడిన మారి సెల్వం తేని మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి పెరుమాయిని అరెస్టు చేశారు.

ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై, కొత్తచాకలి పేటలో గత జూన్‌లో జరిగిన బస్‌డే వేడుకల్లో కత్తులతో హల్‌చల్ చేసిన నిందితులకు పట్టా కత్తులు సరఫరా చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. కత్తులతో హల్‌చల్ చేసిన సంఘటనపై అప్పట్లో కొత్త చాకలిపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణరాజ్, పోలీసులు కేసు నమోదు చేసి, బస్‌డే సంబరాలకు పట్టాకత్తులు ఉపయోగించిన బాలాజీ, ఇషకియల్, జనగన్, గుణశేఖరన్‌ను అరెస్ట్ చేశారు. వీరికి పట్టా కత్తులు అందజేసిన ప్రెసిడెన్సీ విద్యార్థుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గుమ్మడిపూండి ఎలవూరుకు చెందిన లోకేష్ (19), దిలీప్ (19), రవిచంద్రన్ (19)ను శనివారం అరెస్టు చేశారు.

అవినీతి కేసులో పంచాయతీ కార్యదర్శి..

విద్యుత్ కనెక్షన్ కోసం సర్టిఫికెట్, భవన నిర్మాణ అనుమతి కోసం లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తంజావూరు సమీపంలోని పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయానికి చెందిన ఫిలిప్‌రాజ్ కడకడప్ప పంచాయతీలోని మల్లికానగర్‌లో కుమార్తె దుర్గకు కొత్త ఇల్లు కట్టించాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో విద్యుత్ కనెక్షన్ కోసం సర్టిఫికెట్, భవన నిర్మాణ అనుమతి మంజూరు కోసం పంచాయతీ కార్యదర్శి ఆంథోనిసామి(56)ని సంప్రదించాడు. దీంతో కార్యదర్శి రూ.2 వేలు లంచం అడిగాడు. అనంతరం రూ.1,250 ఇవ్వాలని కోరాడు. ఈ విషయమై ఫిలిప్‌రాజ్ తంజయ్ అవినీతి నిరోధక శాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సలహా మేరకు ఫిలిప్‌రాజ్ శుక్రవారం రూ.1,250 లంచం డబ్బుతో బీడీఓ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ ఆంథోనిసామికి ఇచ్చాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఎస్పీ నందగోపాల్, పోలీసులు ఆంథోనిసామి అరెస్టు చేసి, శనివారం కుంభకోణం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

కానిస్టేబుల్‌పై దాడి

– విద్యార్థి తండ్రి అరెస్టు

తిరువొత్తియూరు: బస్సు ఫుట్ బోర్డుపై వేలాడుతూ వచ్చిన విద్యార్థిని మందలించినందుకు పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన విద్యార్థి తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. మధురై జిల్లా తిరుమంగళం కర్పగనగర్‌కు చెందిన అలగర్ స్వామి (44) పెరుంగుడి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం తిరుమంగళం నుంచి ఆలంగులం వెళుతున్న టౌన్ బస్సులో పాఠశాల విద్యార్థులు ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ వస్తున్నారు. ఆ సమయంలో బస్సు వెనుక ద్విచక్ర వాహనంలో వస్తున్న కానిస్టేబుల్ అలగర్ స్వామి దీన్ని చూసి బస్సును ఆపి ఫుట్ బోర్డ్‌లో వేలాడుతూ వచ్చిన విద్యార్థులను మందలించాడు. బస్సు ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ వచ్చిన వారిలో ఆలంకుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి ఈ విషయాన్ని తన తండ్రి రామర్‌కు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన రామర్ (42) ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి కానిస్టేబుల్ అలగర్ స్వామి బైక్‌ను ఢీకొట్టి అతని కిందకు తోసి దాడి చేశారు. దీంతో గాయపడిన కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలగర్ స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రామర్‌ను అరెస్టు చేశారు.

లక్ష మందితో భద్రత

- నిఘా కట్టుదిట్టానికి ఆదేశాలు
- తనిఖీలు ముమ్మరం


కోయంబేడు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

సాక్షి, చెన్నై : తమిళనాడులో స్వాతంత్య్ర దిన వేడుకలను పురస్కరించుకుని భద్రతను కట్టుదిట్టం చేయాలని జిల్లాల ఎస్పీలు, నగర కమిషన్లకు డీజీపీ శంకర్‌జివ్వాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. లక్ష మంది సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర రాజధాని చెన్నై, ఆధ్యాత్మిక నగరం మదురై, క్లాసిక్ సిటీ కోయంబత్తూరును గురి పెట్టి ముష్కరులు చాప కింద నీరులా చేస్తూ వస్తున్న కుట్రలను ముందుగానే పోలీసులు, ఎన్ఐఏ గుర్తించి, భగ్నం చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. కోయంబత్తూరులో కారు పేలుడు ఘటన తదుపరి రాష్ట్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) దాడులు ఉధృతంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ముష్కరులు ఏదైనా వ్యూహరచన చేసి ఉండవచ్చన్న అనుమానాలు నెలకొన్నాయి. అదే సమయంలో డిల్లీలో ఐఎస్ఐఎస్ తీవ్ర వాదులు పట్టుబడడం వంటి పరిణామాలు వెలుగులోకి వచ్చాయి.

ముందు జాగ్రత్తలు

నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేస్తూ డీజీపీ శంకర్ జివ్వాల్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు ఈ సమాచారం చేరింది. ఇక, రాత్రుల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. అలాగే సముద్ర తీరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సంయుక్తంగా గస్తీలో నిమగ్నం అయ్యారు. ఇక రాష్ట్రంలోని చెన్నై మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, సేలం విమానాశ్రయాలతోపాటు ఆయా నగరాల్లో భద్రతను పటిష్టం చేశారు. ముందు జాగ్రత్త చర్యగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, ఆలయాలు, పర్యాటక కేంద్రాల్లో భద్రతను పెంచారు. ఆయా నగరాల సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీల్లో నిమగ్నమయ్యారు. చెన్నై మెరీనా తీరంలో భద్రతను పెంచారు. సెంట్రల్, ఎగ్మూర్, తాంబరంతోపాటు అన్ని రైల్వేస్టేషన్లను నిఘా వలయంలోకి తీసుకొచ్చారు. కోయంబేడు, మాధవరం, కీలాంబాక్కం బస్టాండ్‌లో భద్రత పరంగా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ప్రతి ప్రయాణికుడిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే అనుమతిస్తున్నారు. ఎంజీఆర్ సెంట్రల్, ఎగ్మూర్‌కు వచ్చే రైళ్లపై నిఘా పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు. చెన్నైలో 15 వేల మందితో భద్రత చర్యలు చేపట్టారు.

నో పార్కింగ్ బోర్డులపై హైకోర్టు సీరియస్?

- తొలగింపునకు తీసుకున్న చర్యలేవీ?
- పోలీసు అధికారులను ప్రశ్నించిన న్యాయమూర్తులు

సాక్షి, చెన్నై: చెన్నైలో అనుమతి లేకుండా ఇళ్ల ముందు ఉంచిన 'నో పార్కింగ్' బోర్డులను తొలగించేందుకు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ట్రాఫిక్ పోలీసు అధికారులను మద్రాసు హైకోర్టు శనివారం ఆదేశించింది. చెన్నైలోని అడయార్, త్యాగరాయ నగర్, మైలాపూర్, మందవెలి, మాంబలం, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో నివాసితులు అనుమతి లేకుండా తమ ఇళ్ల ముందు నో పార్కింగ్ అనే బోర్డులు పెట్టుకున్నారని పేర్కొంటూ నందకుమార్ అనే సామాజిక కార్యకర్త హైకోర్టును ఆశ్రయించారు. పబ్లిక్ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా టన్నుల కొద్దీ పూల కుండీలు పెట్టి అనుమతి లేకుండా నో పార్కింగ్ బోర్డులు కూడా పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమాచార హక్కు చట్టం కింద వివరణ కోరగా, కార్పొరేషన్ అధికారుల నుంచి సమాధానం లేదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఉంచిన నో పార్కింగ్ బోర్డులు, ఫుట్ పాత్‌పై ఇళ్ల ముంగిట ఉంచిన పూల కుండీలను తొలగించేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు ఇన్‌చార్జ్ సీజే జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ బాలాజీలతో కూడిన ధర్మాసనం శనివారం విచారించింది. ఈ బోర్డులు తొలగింపునకు సంబంధించిన సమగ్ర వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించారు. పిటిషనర్ వాదనలను పరిగణించి ఆ బోర్డుల తొలగింపునకు తీసుకున్న చర్యలేవీ అని ప్రశ్నిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

పుదుచ్చేరి ప్రభుత్వంపై కోర్టు ధిక్కారణ కేసుకు వినతి

కొరుక్కుపేట: ముఖ్యమంత్రి రంగస్వామి జన్మదిన వేడుకల బ్యానర్ విషయంలో ప్రభుత్వంపై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని జిల్లా న్యాయమూర్తి కోరారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి డి.చంద్రశేఖరన్ మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖ పంపారు. వివరాలు.. ఈనెల 4న పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మద్దతుదారులు ప్రధాన రహదారులు, పట్టణ ప్రాంతాల్లో పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి కటౌట్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లను ప్రదర్శించారు. ఈవిషయంపై జిల్లా కోర్టు ప్రజలకు ఇబ్బంది కలిగించే కటౌట్లు, బ్యానర్లపై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని జడ్జి ఆదేశించారు. అయితే పుదుచ్చేరి ప్రభుత్వ యంత్రాంగం దానిని బేఖాతరు చేయడంతో కోర్టు ధిక్కారణ కేసు నమోదు చేయాలని హైకోర్టు హైకోర్టు రిజిస్ట్రార్‌కు విన్నవించారు.

శంకరంబాడి రచనలు స్ఫూర్తిదాయకం


శంకరంబాడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్మలా పళణివేలు, గుడిమెట్ల చెన్నయ్య

కొరుక్కుపేట: తెలుగు తల్లి ముద్దుబిడ్డ, రచయిత శంకరంబాడీ సుందరచారి రచనలు స్ఫూర్తిదాయకం అని వక్తలు కొనియాడారు. స్థానిక వ్యాసార్పాడిలోని భారతీనగర్‌లో జనని సంస్థ అధ్వర్యంలో శంకరంబాడి సుందరాచారి జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. భారతీమహిళా కళాశాల తెలుగుశాఖ పూర్వాధ్యక్షురాలు డాక్టర్ నిర్మాలాపళణివేలు మాట్లాడుతూ మనం ఎంతో మంది నాయకుల జయంతులను జరుపుకుంటామని, అయితే శంకరంబాడి జయంతిని అంతకంటే ఘనంగా జరుపుకోవాలన్నారు. సాహిత్యలోకంలో ఆయన ఓ గొప్పకవి అని, ఆంధ్రరాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి మల్లెపూదండ రచించిన ఘనత ఆయనదేనని వ్యాఖ్యానించారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు పట్టాభిరామయ్య, ఇమ్మిడిశెట్టి కోటేశ్వరరావు, ఆర్. పోతరాజు, రాజేంద్ర ప్రసాద్, వంజరపు శివయ్య తదితరుల శంకరంబాడి సుందరాచారి సేవలను కొనియాడారు.

ఆర్డర్ చేసిన దోసె, ఊతప్పం ఇవ్వనందుకు రూ.15 వేలు జరిమానా

– వినియోగదారుల ఫిర్యాదుల కమిషన్ చర్య

కొరుక్కుపేట: పూందమల్లికి చెందిన ఆనంద్ శేఖర్ గత ఏడాది ఆగస్టు 21నజొమాటో యాప్‌లో అక్షయ భవన్ హోటల్‌లో ఫుడ్ ఆర్డర్ చేశాడు. అతను ఉతప్పం, దోసె సహా రూ.498కి ఫుడ్ ఆర్డర్ చేశాడు. నిర్ణీత సమయంలో, డెలివరీ బాయ్ ఫుడ్‌పార్సిల్ కూడా తీసుకువచ్చాడు. ప్యాకెట్ విప్పి చూడగా ఆనంద్ శేఖర్‌ఆర్డర్ చేసిన దోసె, ఊతప్పం లేకపోవడంతో వెంటనే జొమాటో కస్టమర్ సర్వీస్ సెంటర్ అధికారిని సంప్రదించాడు. కానీ అతని నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో ఆనంద్ శేఖర్ తిరువళ్ళూరు వినియోగదారుల ఫోరంలో కేసు వేశారు. వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ లతా మహేశ్వరి విచారణ చేపట్టారు.. ఆర్డర్‌పై సర్వీస్ ఛార్జీగా రూ.73 కంపెనీ వసూలు చేస్తున్న నేపథ్యంలో సక్రమంగా డెలివరీ చేయాల్సిన బాధ్యత కంపెనీదే అని తేల్చారు. ఫుడ్ ఆర్డర్ కోసం వెచ్చించిన రూ.498 వాపసు ఇవ్వడంతో పాటు పిటిషనర్‌కు కలిగిన మానసిక వేదనకు గాను రూ.10 వేలు, పిటిషన్ ఖర్చుల కింద రూ.5 వేలు ఇవ్వాలని ఆదేశించారు.



సభ్యత్వ నమోదుకు శ్రీకారం

తమిళ మానిల కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శనివారం చెన్నైలో ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్,ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్ ఈ కార్యక్రమాన్ని లాఛనంగా ప్రారంభించారు. – సాక్షి, చెన్నై

రూ.2 కోట్ల విలువైన విగ్రహం తరలింపు

– ఏడుగురి అరెస్టు

అన్నానగర్: తంజావూరు సమీపంలో శనివారం కారులో రూ.2 కోట్ల విలువైన స్వామివారి విగ్రహాన్ని అక్రమంగా తరలిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. తంజావూరు-తిరుచ్చి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలను స్మగ్లింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తమిళనాడు యాంటీ ఐడల్ స్మగ్లింగ్ యూనిట్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగానికి శనివారం రహస్య సమాచారం అందింది. సమాచారం అందుకున్న తంజావూరు విగ్రహాల స్మగ్లింగ్ నిరోధక విభాగం పోలీసులు తంజావూరు-తిరుచ్చి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. సెంగిపట్టి సమీపంలోని మేల తిరువిళపట్టి వద్ద పార్క్ చేసిన కారు, రెండు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. అందులో పురాతన కాలానికి చెందిన రెండున్నర అడుగుల ఎత్తు ఉన్న పెరుమాళ్ విగ్రహం ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కారులో ఉన్న చెన్నై అరుంబాక్కం ప్రాంతానికి చెందిన రాజేంద్రన్ (52), కుంభకోణం నగరానికి చెందిన రాజకుమార్ (36), తిరువారూర్‌కి చెందిన దినేష్ (28), బైకులో వచ్చిన జైశంకర్ (58), విజయ్ (28), హారిస్ (26), అజిత్ కుమార్ (26)ను అరెస్టు చేశారు. కుంభకోణం అదనపు క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

పుదుచ్చేరిలో 2 గంటల్లో 15 సెం.మీ. భారీ వర్షం

కొరుక్కుపేట: పుదుచ్చేరిలో శుక్రవారం రాత్రి రెండు గంటల్లో 15 సెం.మీ. భారీ వర్షం కురిసింది. వర్షపు నీటి ప్రవాహంలో మోటారు సైకిల్ కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకరు చనిపోయారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. కొన్ని రోజులుగా తమిళనాడులో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పుదుచ్చేరిలో రాత్రి 9 నుంచి దాదాపు 5 గంటల పాటు వర్షం కురిసింది. కేవలం రెండు గంటల్లో 15 సెం.మీ. వర్షం నమోదైంది. దీంతో రోడ్లపై నీరు ఏరులై పారింది. ఈ వర్షంలో ఓ మోటారు సైకిల్ వరదలో చిక్కుకుపోయింది. అందులో ప్రయాణిస్తున్న జీవానందపురం ప్రాంతానికి చెందిన అయ్యప్పన్ (40), బాల (40), చందూరు (21) నీటిలో కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఒక వ్యక్తి మృతి చెందాడు.

యువతి హత్య

అన్నానగర్: చెన్నై సమీపం తిరువల్లికేణిలోని ఓ లాడ్జిలో శుక్రవారం రాత్రి యువతిని గొంతు నులిమి హత్య చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని చూలై ప్రాంతానికి చెందిన జయలక్ష్మి(28)కి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అభిప్రాయ భేదాల కారణంగా భర్త ఆమెను విడిచిపెట్టాడు. జయలక్ష్మి ఒంటరిగా జీవించేది. ఈ స్థితిలో జయలక్ష్మికి ఓట్టేరికి చెందిన రూబెన్ (28) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అవివాహితుడైన రూబెన్ గత ఏడాది కాలంగా జయలక్ష్మి ఏకాంతంగా కలుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్థితిలో తనను పెళ్లి చేసుకోవాలని జయలక్ష్మి రూబెన్‌ను గట్టిగా నిలదీసింది. పెళ్లి గురించి మాట్లాడుదాం అని జయలక్ష్మిని ఆహ్వానించిన రూబెన్ 7వ తేదీన చెన్నైలోని తిరువల్లికేణి వాలాజా రోడ్డులోని ప్రముఖ లాడ్జిలో గది తీసుకున్నాడు. అక్కడే రెండు రోజుల పాటు ఉన్నారు. శుక్రవారం రాత్రి రూబెన్ జయలక్ష్మి సెల్‌ఫోన్ పరిశీలించగా ఆమెకు పలువురితో పరిచయం ఉన్నట్లు తేలింది. ఈవిషయమై రూబెన్ జయలక్ష్మిని నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రూబెన్ జయలక్ష్మిని గొంతు నులిమి హత్య చేసి, ఈ విషయాన్ని లాడ్జి మేనేజర్‌కు చెప్పాడు. లాడ్జ్ మేనేజర్ ఈ విషయమై తిరువల్లికేణి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు రూబెన్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

అన్నానగర్: జర్మన్ నుంచి విమానంలో వస్తున్న ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మరణించాడు. వివరాల్లోకి వెళితే.. జర్మన్ ఫ్రాంక్‌బర్ట్ టౌన్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి 232 మంది ప్రయాణికులతో లూబ్థాన్సా ఎయిర్‌లైన్స్ విమానం చెన్నైకు బయలుదేరింది. విమానం గాలిలో ఎగురుతున్నప్పుడు చెన్నై ఆళ్వార్‌పేటకి చెందిన జగనాథన్(92)కి అకస్మాత్తుగా ఛాతీ నొప్పి వచ్చింది. అతనికి కార్మికులు ప్రథమ చికిత్స అందించారు. కెప్టెన్‌కు సమాచారం తెలిపారు. వెంటనే చెన్నై విమానాశ్రయ కంట్రోల్ రూమ్‌కి సమాచారమిచ్చి, విమాన్నా చెన్నై విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. అక్కడ సిద్ధంగా ఉన్న వైద్యులు విమానంలోకి వెళ్లి పరీక్షించారు. అయితే జగనాథన్ అప్పటికే విమానంలోని సీటులోనే మృతి చెందినట్లు గుర్తించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం



మృతి చెందిన సంజయ్, విశ్వ (ఫైల్)

తిరుత్తణి: జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా తిరువేలాంగాడు యూనియన్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు సంజయ్ (22) ప్రైవేటు కర్మాగారంలో తాత్కాలిక సిబ్బందిగా పని చేసేవాడు. అతని మిత్రుడు నావలూరు దళితవాడకు చెందిన వెంకటేశన్ కుమారుడు విశ్వ (22) ఇద్దరూ కలిసి బైకులో శుక్రవారం సాయంత్రం అరక్కోణం సమీపంలోని పాళ్యం కుప్పంలో జాతరకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి ఇద్దరూ కలిసి బైకులో ఇంటికి తిరుగు పయనమయ్యారు. చెన్నై - తిరుపతి జాతీయ రహదారిలోని లక్ష్మీపురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందారు. కనకమ్మ సత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవకతవకలు జరిగితే చర్యలు


పనులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ సుబ్బులక్ష్మి అధికారులను హెచ్చరించారు. వేలూరు జిల్లా విరింజిపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారు, రిజిష్టర్‌లో ఎంత మంది కూలీలు నమోదు చేశారు, ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి చేశారు అన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు వలస వెళ్లకుండా ఉండేందుకు ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారని, అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ పథకంలో అవినీతి జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజూ కూలీలు ఎంత మంది వస్తున్నారు, ఎంత మేరకు పనులు జరిగాయనే పూర్తి విషయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఆమెతో పాటు సర్పంచ్ గుణసుందరి, తసీల్దార్ వేండా అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన


పుష్పాలంకరణలో పరాశక్తి అమ్మవారు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వేలూరు: తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయంలో తమిళ ఆడి మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి దీపారాధన పూజలు చేశారు. ముందుగా పచ్చయమ్మన్ ఆలయంలో జరిగిన ఉత్సవంలో అన్నవాహనంలో అమ్మన్ భక్తులకు దర్శనం ఇచ్చారు. గిరివలయం రోడ్డులో ఉన్న పచ్చయమ్మన్ మన్నార్ స్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలు భక్తులను ఆకట్టుకుంది. అందులో భాగంగా సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పచ్చయమ్మన్ అన్న వాహనంలో మాడ వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ నేపథ్యంలో అన్నామలైయార్ ఆలయ మూడో ప్రాకారంలోని అలంకార మండపంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆ సమయంలో అమ్మవారు పరాశక్తి ఆకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దీపారధన పూజల్లో కలుసుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళా భక్తులతో కిటకిటలాడింది.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


ఊత్తుకోట తాలుకా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తిరువళ్లూరు: పంచాయతీ పరిధిలో అక్రమంగా పన్నులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి, నిరసన తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా పోందవాక్కంలో సుమారు 40 కుటుంబాల వారు ప్రభుత్వానికి చెందిన స్థలంలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి పట్టాలు మంజూరు చేయాలని పలుసార్లు వినతి పత్రం సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యక్తి భాష్యం అలియాస్ గోపి తన అనుచరులతో కలిసి పన్నులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. పట్టా మంజూరు చేయాలని పలుసార్లు పోరాటం చేసినా ఫలితం లేకపోగా అక్రమంగా పన్నులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నివాసం ఉన్న ప్రాంతం ఆలయానికి చెందిందని పన్నులు చెల్లించకపోతే ఖాళీ చేయాలని బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుసార్లు ఫిర్యాదు చేసినా తహసీల్దార్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమాచారమందుకున్న అధికారులు, పోలీసులు ఆందోళన కారులతో చర్చలు జరిపారు. బాధితులకు న్యాయం చేస్తామన్న హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళనను విరమించారు.

చెన్నై విమానాశ్రయంలోని కుక్కలకు టీకాలు

కొరుక్కుపేట: చెన్నై విమానాశ్రయంలో కొన్ని నెలలుగా ప్రయాణికులు, సిబ్బంది, సెక్యూరిటీ గార్డులపై దాడులు చేస్తున్న వీధి కుక్కలకు టీకాలు వేశారు. చెన్నై విమానాశ్రయంలో కొన్ని నెలలుగా కుక్కల బెడద ఎక్కువైంది. ప్రయాణికులు, సిబ్బంది, కాపలాదారులను కుక్కలు వెంబడిస్తుండంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల బెడద నివారించాలని ప్రయాణికులు, వాహనచోదకులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కుక్కలను పట్టుకోవడంపై ఎయిర్‌పోర్టు అధికారులు కార్పొరేషన్ అధికారులు, బ్లూక్రాస్ ఉద్యోగులు, జంతు సంరక్షణ కార్యకర్తలతోపాటు పలువురితో సంప్రదింపులు జరిపారు. విమానాశ్రయ అధికారులు, మున్సిపల్ అధికారుల సహకారంతో కుక్కల గణన చేపట్టారు. దాదాపు 50 కుక్కలు తిరుగుతూ కనిపించాయి. అనంతరం ఈ నెల మొదటి వారంలో పశువైద్యులు, కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు, బ్లూక్రాస్ సంస్థ సభ్యులు 46 వీధికుక్కలను పట్టుకున్నారు. వాటిలో 34 మగ కుక్కలు ఉన్నాయి. వాటికి డి-ఎన్విరోన్స్ రేబిస్ వ్యాక్సిన్ టీకాలు వేసి, విడచిపెట్టారు. 12 ఆడ కుక్కలను సంతతి నియంత్రణ శస్త్రచికిత్స నిమిత్తం అలందూరులోని కార్పొరేషన్ జోనల్ కార్యాలయానికి తరలించారు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత, నిర్ణీత రోజుల పాటు అక్కడే ఉంచి శుభ్రం చేసి, చట్ట ప్రకారం మళ్లీ చెన్నై విమానాశ్రయ ప్రాంగణానికి తీసుకువస్తామని చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు.

సేలం ప్రభుత్వాస్పత్రిలో మగబిడ్డ అపహరణ

– మహిళ అరెస్టు

సేలం: సేలం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఐదురోజుల మగశిశువును ఓ మహిళ అపహరించిన ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. నామక్కల్ జిల్లా పల్లిపాళయం ప్రాంతానికి చెందిన తంగదురై భార్య వెన్నిలా (25) అనే గర్భిణి పురిటి నొప్పులతో ఈనెల 5వ తేదీన సేలం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేరగా వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స చేసి, మగశిశువుకు పురుడు పోశారు. సర్జికల్ వార్డు నుంచి సాధారణ వార్డుకు తరలించి చికిత్స కొనసాగించారు. ఆస్పత్రిలో వెన్నిలాకు సహాయంగా ఆమె ఉంది. ఈ సందర్భంలో వెన్నిలా చికిత్స పొందుతున్న వార్డులో 30 ఏళ్ల మహిళ ఉంటోంది. తన బంధువు ఇక్కడ చికిత్స పొందుతున్నారని పరిచయం చేసుకున్న ఆమె అప్పటి నుంచి, వెన్నిలా, ఆమె తల్లి ఇందిరతో మాటలు కలుపుతూ వచ్చింది. ఈ స్థితిలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా ఆ మహిళ వెన్నిలా కొడుకును అకస్మాత్తుగా కిడ్నాప్ చేసి తీసుకువెళ్లింది. దిగ్భ్రాంతి చెందిన వెన్నిలా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా విచారణ జరిపి సేలం జిల్లా కారిపట్టి నెహ్రూ నగర్‌కు చెందిన వినోదిని (25) అనే మహిళ శిశువును అపహరించినట్టు గుర్తించారు. శనివారం పోలీసులు వాలప్పాడిలో ఉన్న వినోదినిని అరెస్టు చేశారు.

నైతిక విలువలను నేర్పించాలి


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న అతిథులు, ట్రస్టీలు

కొరుక్కుపేట: చిన్నప్పటి నుంచే పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువలు నేర్పించాలని ప్రముఖ నేపథ్యగాయని శృతి శేఖర్ అన్నారు. ఎస్‌కేపీడీ చారిటీస్ నిర్వహణలో కొనసాగుతున్న మహర్షి విద్యా మందిర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో పారంపర్యం పేరిట అంతర్ పాఠశాలల సంప్రదాయ సాంస్కృతిక పోటీలు శుక్ర, శనివారాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని 25 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. శనివారం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్‌కేపీడీ చారిటీస్ పాలక మండలి సభ్యులు ఊటుకూరు శరత్ కుమార్, దేసులక్ష్మీ నారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, కిషోర్ బాబు, బద్రినాద్‌లు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ పి .సుబ్రహ్మణ్యం ఆహూతులకు ఆహ్వానం పలుకగా, ముఖ్య అతిథిగా ప్రముఖ నేపథ్య గాయని శృతి శేఖర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన డీఏవీ పాఠశాల రోలింగ్ ట్రోఫీని దక్కించుకుంది. ప్రేమ్ అకాడమీ ద్వితీయ, కోలా సరస్వతి పాఠశాల తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. వైస్ ప్రిన్సిపల్ ఎం కవిత, మేనేజర్ శ్రీలత, ఉషారాణి పాల్గొన్నారు.

నల్లపు రంగు దుస్తులు ధరించిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ

సేలం: కోవైలో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొన్న ఓ కార్యక్రమంలో నలుపు రంగు దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థులను పోలీసులు అనుమతించకపోవడం కలకలం సృష్టించింది. వారు వేరే దుస్తులు ధరించి వచ్చిన తరువాత లోపలికి అనుమతించారు. వివరాలు.. కోవై పీఎస్‌జీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గవర్నర్ ఆర్ఎన్ రవి విద్యార్థులతో చర్చించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం జరిగే హాల్‌లోకి నల్ల రంగు దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థులు, మీడియా వారికి పోలీసులు అనుమతి కల్పించలేదు. దీంతో పోలీసులకు మీడియా వారికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తర్వాత మీడియా వారిని మాత్రం లోపలికి అనుమతించారు. అయితే విద్యార్థులను వేరే రంగు దుస్తులు ధరించి వచ్చిన తర్వాతే అనుమతి లభించింది. ఈ చర్యను దందై పెరియార్ ద్రవిడ కళగం ప్రధాన కార్యదర్శి రామకృష్ణన్ తీవ్రంగా ఖండించారు.

క్లుప్తంగా...

దళితుడిపై టీడీపీ కార్యకర్తల దాడి

హీరో మహేష్‌బాబు ఫ్లెక్సీ దహనం



సొమ్మసిల్లి పడిపోయిన మందా పుల్లయ్య

నాదెండ్ల: టీడీపీ గూండాల అరాచకాలు నానాటికీ ఉధృతమవుతూ.. సామాన్య ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా ఓ దళిత యువకుడిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా హింసించిన ఘటన పల్నాడు జిల్లా ఎండుగుంపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు మందా పుల్లయ్య పొలం పనులు చేసుకుని జీవిస్తుంటాడు. పుల్లయ్య, అతని మిత్రులు సినీహీరో మహేష్‌బాబు అభిమానులు. శుక్రవారం మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఎస్సీ కాలనీలోని చర్చి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో సినీహీరోలు కృష్ణ, మహేష్‌బాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, యూత్ నాయకుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఫొటోలు ఏర్పాటు చేశారు. రాత్రి కేక్ కట్ చేశారు. అంతటితో ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కొందరు టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని ఫ్లెక్సీపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. అంతటితో ఆగకుండా శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చర్చి వద్ద నిలబడి ఉన్న మందా పుల్లయ్యపై నలుగురు టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సాక్షి,అమరావతి: కూటమి ప్రభుత్వం పంచాయతీలను, సర్పంచ్‌ల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియా సందేశాన్ని విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తీసుకున్న 3 కీలకమైన నిర్ణయాలు పంచాయతీలు, సర్పంచ్‌ల వ్యవస్థకు కొత్త జీవం పోయడానికి ఉపయోగపడతాయని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం అమలు కోసం గ్రామ సభలను రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. గత ఐదేళ్లలో జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.4,000 కోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారని.. ఈ పనులపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పల్స్ సర్వే నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు.

చిరుద్యోగులపై సాంకేతిక విద్యాశాఖ కక్ష సాధింపు

- ‘రెగ్యులర్’ ఉత్తర్వులు ఇవ్వకపోగా 4 నెలలుగా వేతనాల నిలిపివేత

సాక్షి, అమరావతి : పాలిటెక్నిక్ కళాశాలల్లో వర్క్‌షాప్ అటెండర్లుగా పనిచేస్తున్న 22 మందిపై సాంకేతిక విద్యాశాఖ కక్ష సాధిస్తోంది. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వర్తించిన వారికి గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నం.8తో మార్చిలో రెగ్యులర్ ఉద్యోగులయ్యారు. కానీ ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో వారు నియామక పత్రాలు అందుకోలేకపోయారు. అయితే, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో వారికి నియామక పత్రాలు అందుతాయని ఎదురు చూసినా నిరాశే ఎదురైంది. మరోపక్క వారి సీఎఫ్ఎంఎస్ ఖాతాలను బ్లాక్ చేయడంతో గత మూడు నెలలుగా వేతనాలు సైతం నిలిచిపోయాయి. ఈ సమస్యపై పలు పర్యాయాలు సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకున్నది లేదు. శనివారం మరోసారి వారు టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

విశాఖలో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు

AITUC

అనకాపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బూసి వెంకటరావు తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో జాతీయ సమావేశాల వాల్‌పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. సెప్టెంబర్ 3న విశాఖలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయన్నారు.

బ్రోకర్.. జోకర్.. సర్కారే!

జాకీ, క్వీన్, కింగ్, ఆస్ అంటూ ఊరూరా అనధికార పేకాట క్లబ్బులు

ఎక్కడికక్కడ జేబులు నింపుకుంటున్న ‘తమ్ముళ్లు’

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేసిన చరిత్ర జూదానిది. పండుగలు, పబ్బాలకు జరిగే జూదంతోనే ఎందరో ఆస్తులమ్ముకుంటున్నారు. పేకాట వల్ల గతంలో ఎన్ని వేల కుటుంబాలు అప్పుల పాలయ్యాయో, ఎంత మంది ఐపీ పెట్టారో ప్రభుత్వ పెద్దలకు తెలియంది కాదు. అలాంటిది చంద్రబాబు ప్రభుత్వం వచ్చీ రాగానే రాష్ట్రంలో సామాన్యుల బతుకులతో పేకాడేస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వ మంత్రులు, ప్రజాప్రతినిధుల సిండికేట్ల ఆధ్వర్యంలో మూడు ముక్కలు.. ఆరు ఆటలుగా పేకాట దందా బరితెగించి సాగుతోంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు తెరుచుకున్న అధికారిక, అనధికారిక పేకాట క్లబ్బుల ద్వారా రోజూ అధికార పార్టీ నేతలు కోట్లాది రూపాయలు కొల్లగొట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. రాష్ట్రంలో జూదానికి అడ్డుకట్ట వేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పడిన కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరుగా చేస్తోంది. దశాబ్దాలుగా రాష్ట్రంలో సాగిన పేకాట క్లబ్బుల దందాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పేకాట క్లబ్బుల అనుమతులను రద్దు చేసింది. అనధికార పేకాట క్లబ్బుల దందానూ అణచి వేసింది. తద్వారా మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజల సర్వస్వాన్ని దోచుకుంటున్న పేకాట క్లబ్బుల దందాకు ముగింపు పలికింది. ఎన్ని ఒత్తిడులు వచ్చినా సరే తలొగ్గ లేదు. అయితే, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే పేకాట క్లబ్బుల సిండికేట్లు మరోసారి జూలు విదిల్చాయి. ఏకంగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలే స్వయంగా పేకాట క్లబ్బుల సిండికేట్‌కు నాయకత్వం వహిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది.



రేపల్లె నియోజకవర్గంలోని ఓ పేకాట శిబిరంలో లోన-బయట ఆటకు రెడీ

ఒకరిని చూసి మరొకరు..

కొన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తుండటం చూసి ఇతర జిల్లాల కూటమి పార్టీల నేతలు సైతం ఈ దందాను ప్రారంభిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మూడు క్లబ్‌లతో పాటు కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అండదండలున్నాయని, ప్రధానంగా ఎమ్మెల్యే కుమారుడు నిర్వాహకులకు మద్దతుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. పాలకొల్లులో రెండు క్లబ్బుల్లో పేకాట జోరుగా సాగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొందరు ఇళ్ల వద్ద, వ్యక్తిగత గెస్ట్ హౌస్‌లలో, పొలాల్లో, ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాల్లో పేకాట నిర్వహిస్తున్నారు. రావులపాలెం, ఆత్రేయపురం, ఐ.పోలవరం, సఖినేటిపల్లి మండలాల్లో ఈ తరహా పేకాట కొనసాగుతోంది. పొలాల్లో పేకాట ఆడేవారిపై పోలీసులు రైడింగ్‌లు, కేసులు నమోదు చేస్తున్నారు తప్ప గెస్ట్ హౌస్‌లలో పేకాట జోలికి వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడుల్లో పేకాట స్థావరాలు ఏర్పాటయ్యాయి. నిర్మానుష్య ప్రాంతాలు, ఎత్తైన భవంతులు, అటవీ ప్రాంతాలు ఇందుకు వేదికయ్యాయి.

వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో జోరు

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెలో అధికార పార్టీనేత లక్ష్మిరెడ్డి, నాగార్జునరెడ్డి పేకాట నిర్వహిస్తున్నారు. వీరు స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ముఖ్య అనుచరులు. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో టీడీపీ నేత శివ, ఆయన సోదరుడి ఆధ్వర్యంలో పేకాట జరుగుతోంది. ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీ ఈశ్వరరెడ్డినగర్‌లో పక్కీర్‌రెడ్డి, బండ రాముడు పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నారు. పులివెందుల, సింహాద్రిపురం, లింగాల మండలాల్లోని పలు ప్రాంతాలలో టీడీపీ చోటా నాయకులు పేకాట దందా నడిపిస్తున్నారు. బ్రహ్మంగారిమఠంలో పేకాట స్థావరం త్వరలో మొదలవుతుందని తెలిసింది. చెన్నూరు మండలం బలసింగాయపల్లె, కనపర్తి, కైలాసగిరి ప్రాంతాల్లో దట్టమైన చెట్లున్న ఏరియాలో టీడీపీ నేతలు పేకాట స్థావరాలు ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా కలికిరి, చిన్నమండెం, పెద్దమండెం, గుర్రంకొండ సమీపంలోని పాత చిత్తూరు జిల్లా సరిహద్దులోని గుట్ట ప్రాంతాల్లో మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారు. రోజుకొక చోట శిబిరాలను నడిపిస్తున్నారు. కొంతమంది పోలీసులు, అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో ఈ వ్యవహారం జరుగుతోంది. మదనపల్లె, రైల్వేకోడూరు ప్రాంతాల్లో కూడా మామిడి తోటల్లో పేకాట కొనసాగుతోంది. ఒంగోలు నడిబొడ్డున గాంధీ రోడ్డులోని ఒక వీధిలో, ఒంగోలు-దశరాజుపల్లి మార్గంలోని ఒక పాత బిల్డింగ్‌లో పేకాట శిబిరాలు సాగుతున్నాయి. కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు, జరుగుమల్లి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో రోజూ పేకాట సాగుతోంది.

అన్ని జిల్లాల్లోనూ అదే దందా

విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు వంటి నగరాల్లో అధికారికంగా మూడేసి చొప్పున పేకాట క్లబ్బులు తెరుచుకోగా.. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, ఏలూరు, ఒంగోలు, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప వంటి జిల్లా కేంద్రాల్లో అధికారికంగా ఒకటి రెండు క్లబ్బులకు తలుపులు తెరిచి.. అనధికారింగా లెక్కలేనన్ని కేంద్రాలు ఓపెన్ చేసేశారు. ఎంపిక చేసిన హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, ఊరి బయట పొలాల్లో అనధికార పేకాట క్లబ్బులు వెలిశాయి. రాష్ట్రం మొత్తం మీద ఇప్పటికే దాదాపు 100కుపైగా అధికారిక, అనధికారిక పేకాట క్లబ్బులు దందా సాగిస్తున్నాయి. కొన్ని చోట్ల ఏకంగా పోలీసులను కాపలా పెట్టి మరీ పేకాట దందా సాగిస్తుండటం విస్మయ పరుస్తోంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు పేకాట క్లబ్బుల జోరు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. ఒక్కో క్లబ్బులో సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు సగటున రూ.3 కోట్ల వరకు.. శని, ఆదివారాల్లో రోజుకు రూ.12 కోట్ల వరకు దందా సాగుతున్నట్లు సమాచారం. ఆ ప్రకారం సోమవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలో రూ.1500 కోట్లు.. శని, ఆదివారాల్లో రూ.2,400 కోట్ల వరకు పేకాట దందా సాగుతోంది. పేకాట క్లబ్బుల నిర్వహణకు కొమ్ముకాస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇందులో 10 శాతం చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు. ఆ ప్రకారం టీడీపీ కూటమి మంత్రులు, ప్రజాప్రతినిధులు వారానికి కమీషన్ల రూపంలోనే దాదాపు రూ.400 కోట్ల వరకు కొల్లగొడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో క్లబ్బుల సంఖ్య, టీడీపీ నేతల కమీషన్ కూడా పెరగనుంది.

‘అనంత’లో దందాకు ఎక్కడా నో డ్రాప్

అనంతపురం జిల్లా ఉరవకొండలో ఓ హెడ్‌కానిస్టేబుల్ పేకాట నిర్వహణకు రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. పై అధికారులకు ఆదాయంలో వాటా ఇస్తున్నారని సమాచారం. ఇదే నియోజకవర్గంలోని కూడేరులోనూ పేకాట జోరుగా సాగుతోంది. తాడిపత్రి నియోజకవర్గంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది. పట్టపగలే యథేచ్ఛగా పేకాట ఆడుతున్నా పట్టించుకునే వారు లేరు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు మండలాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో అటవీ ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఇక్కడికి కర్ణాటక నుంచి సైతం పేకాటరాయుళ్లు భారీగా వస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లో పేకాట విచ్చలవిడిగా సాగుతోంది. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో రాత్రిం బవళ్లు జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి రోజూ ఒక్కో స్థావరంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. పుట్టపర్తిలో టీడీపీకి చెందిన రామ్- లక్ష్మణ్ సోదరులు గోవా నుంచి కర్ణాటక మీదుగా ఆంధ్రప్రదేశ్ వరకు జూద నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఒక్కో స్థావరం నుంచి రోజుకు రూ.3 లక్షల చొప్పున కమీషన్ రూపంలో పోలీసులకు వెళ్తోంది. రూ.లక్షకు రూ.2 వేల కమీషన్ తీసుకుంటూ అప్పుగా ఇస్తున్న వారు కూడా పెరిగిపోయారు. చాలా మంది టీడీపీ నేతలు జూద కేంద్రాలను ఆదాయ వనరులుగా మలుచుకుంటున్నారు. ప్రతి జూద కేంద్రం నుంచి 20 శాతం కమీషన్ తీసుకుని నడిపిస్తున్నారు. ఇటీవల పెనుకొండ మండలం శెట్టిపల్లి సమీపంలో 15 మంది పేకాటరాయుళ్లు దొరికారు. వారి వద్ద నుంచి రూ.17 లక్షలు, ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

కుప్పంలో రోజూ రూ.2 కోట్లు

చిత్తూరు జిల్లా కేంద్రంలో నెల రోజులుగా పేకాట స్థావరాలు మొదలయ్యాయి. తుమ్మిందపాళ్యం-మాపాక్షి మార్గం, గంగనపల్లె, చర్చీవీధిలో జూదం నిర్వహిస్తున్నారు. ఓ టీడీపీ ప్రధాన నాయకుడి తమ్ముడి ఆదేశాలతో ఈ శిబిరాలు నడుస్తున్నాయి. ఇందుకోసం ప్రస్తుతం అతడికి రోజుకు రూ.2 లక్షలు ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది. పూతలపట్టులోని బంగారుపాళ్యం అటవీ ప్రాంతంలో, పలమనేరు కౌండిన్య అడవుల్లో రోజుకు రూ.లక్ష చొప్పున పోలీసులు మామూళ్లు తీసుకుని పేకాట జరుపుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. గంగాధరనెల్లూరులో ఓ కీలక నాయకుడి తమ్ముడి ఆదేశాలతో పేకాట నిర్వహిస్తున్నారు. నగరిలో తడుకుపేట-తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న జూదానికి ఓ మండల టీడీపీ నేత ఇటీవల పచ్చజెండా ఊపారు. పుంగనూరులో నక్కగుంట, బోయకొండ ప్రాంతాలు నిత్యం పేకాటరాయుళ్లతో కనిపిస్తున్నాయి. రోజూ జరిగే మొత్తంలో 20 శాతం స్థానిక టీడీపీ నాయకులకు ఇస్తున్నారు. కుప్పంలో గుడివంక సరిహద్దు ప్రాంతాల్లో, శాంతిపురం-కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న ఆటకు రెండు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పందెంరాయుళ్లు వస్తున్నారు. నామినేటెడ్ పోస్టులో ఉన్న ఓ టీడీపీ నేత, పోలీసులతో కలిసి ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ రూ.2 కోట్ల వరకు లావాదేవీలు నడుస్తున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి పుత్తూరు, రేణిగుంట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. తిరుపతిలో ఇద్దరు టీడీపీ నేతల కనుసన్నల్లో దందా సాగుతోంది. లాడ్జి ఓనర్లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఆట సాగిస్తున్నారు. పోలీసుల నుంచి ఇబ్బంది ఉండదని భరోసా ఇస్తున్నారు. శ్రీకాళహస్తిలో టీడీపీ ప్రధాన నాయకుడు రోజుకు ఒక పల్లెలో పేకాట శిబిరాన్ని విస్తరిస్తున్నాడు.

కర్నూలు జిల్లాలో పెద్ద మొత్తాలే!

బనగానపల్లి నియోజకవర్గం ఇస్రేనాయక్ తండా పరిధిలోని కంబగిరి స్వామి సమీపంలోని ఎర్రమలలో పేకాట నడుస్తోంది. ఇక్కడ ‘హైస్టేక్స్’ ఆడతారు. రూ.లక్ష, రూ.2 లక్షల చొప్పున ఆడతారు. ఇక్కడి నుండి నంద్యాలలోని ఓ జిల్లా పోలీసు అధికారికి రోజూ రూ.2 లక్షలు పంపేవారు. ఇటీవల ఆయన బదిలీ అయ్యారు. అయినా పేకాట ఆగలేదు. ఇక్కడికి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, పులివెందుల తదితర ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారు. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి అలంపూరు, గద్వాల ప్రాంతాల్లో జోరుగా పేకాట ఆడిస్తున్నారు. కొణిదెల పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో పేకాటరాయుళ్లను సభ్యులుగా చేర్చి జూద శిబిరం నిర్వహించే ప్రాంతం, సమయం మెసేజ్ రూపంలో పంపి జోరుగా పేకాట ఆడిస్తున్నారు. ఇటీవల తెలంగాణ పోలీసులు దాడి చేసి రూ.20 లక్షల దాకా నగదు స్వాధీనం చేసుకున్నారు. నెలన్నరగా కర్నూలు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పేకాట శిబిరాలు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఆలూరు నియోజకవర్గం అగ్రహారం, హత్తి బెళగల్, కల్లెవంక పరిధిలో రోజుకో చోట పేకాట ఆడిస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధికి చెందిన ఆరుగురు ప్రధాన అనుచరులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కర్నూలు సిటీలో వెంకటరమణ కాలనీ, జొహరాపురంలోని ఓ ఇంట్లో, పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ వెనుక వైపు ఉన్న విల్లాలో, కర్నూలు-నంద్యాల ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో కొండకు దగ్గరగా ఉన్న ఓ వెంచర్‌లో, మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని బసాపురంలో, నంద్యాల పరిధిలోని పులిమద్దిలో, ఆత్మకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో, ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా పేకాట శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదోని వద్ద ఉన్న శిబిరానికి బళ్లారి నుంచి పెద్ద సంఖ్యలో వ్యాపారులు వస్తున్నారు. జూలై 18న ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడులో ‘భూమా గోడౌన్’లో అఖిలప్రియ చిన్నాన్న భూమా బ్రహ్మానందరెడ్డి పేకాట ఆడిస్తుంటే పోలీసులు దాడి చేశారు. 20 మంది టీడీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. జూలై 29న శిరివెళ్ల మండలం బోయిలకుంట వద్ద శిబిరంపై పోలీసులు దాడి చేసి, కేవలం ఏడుగురిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. భారీగా పట్టుపడినప్పటికీ, కొంత డబ్బు మాత్రమే దొరికినట్లు చూపారు.

జూద కేంద్రంగా మారిన పుట్టపర్తి



ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని జూద కేంద్రంగా మార్చిన కవల సోదరులను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోవాలి. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జూద కేంద్రాలను ప్రోత్సహించడం సరికాదు. జూదం కారణంగా ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు గుర్తుంచుకుంటే మంచిది. ఆ ఇద్దరినీ నియంత్రిస్తే పుట్టపర్తి ప్రశాంతంగా ఉంటుంది.

– ఆదపాల వేమనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు

కుటుంబాలు నలిగిపోతాయి



రాష్ట్ర ప్రభుత్వం పేకాటను ఇలా ప్రోత్సహిస్తూ పోతే వేల కుటుంబాలు వీధిన పడతాయి. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పేకాటలను ఇంతలా ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ఈ ప్రభుత్వం పేకాటను అధికారికం చేస్తే పేద, మధ్య తరగతి కుటుంబాలతో పాటు సంపన్న కుటుంబాలు సైతం ఆర్థికంగా నలిగిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం పట్టించుకోకపోతే మహిళా లోకం పోరాటానికి దిగడం ఖాయం. ఈ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించిన మహిళలే తిరిగి గద్దె దించే పరిస్థితి వస్తుంది.

– లాస్య, మచిలీపట్నం, కృష్ణాజిల్లా

పోరాటానికి ఐద్వా సిద్ధమవుతోంది



రాష్ట్రంలో పేకాట క్లబ్‌లకు, పేకాట స్థావరాలకు ఇంత విచ్చలవిడిగా ప్రభుత్వం అనధికార అనుమతులివ్వడం దారుణం. సమాజాన్ని నాశనం చేసే పేకాట పట్ల ఈ ప్రభుత్వం ఇలా మద్దతు ఇవ్వడం సరికాదు. ఇప్పటికే ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను పక్కన పెట్టి, పేకాట వంటి అంశాలకు ప్రాధాన్యత నివ్వటం తగదు. పరిస్థితిలో మార్పు రాకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించటానికి ఐద్వా సిద్ధమవుతోంది.

– గాదె ఆదిలక్ష్మి, కార్యదర్శి, ఐద్వా విజయవాడ పశ్చిమం

సంపద ఇలా సృష్టిస్తారా?



రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లోనే పేకాటను ప్రోత్సహించడం దారుణం. ఇప్పటి వరకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నోరు మెదపటం లేదు. సంపద సృష్టించి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తామని ప్రకటించారు. పేకాల క్లబ్‌లను ఏర్పాటు చేసి అందులో యువతకు ఉద్యోగాలు కల్పిస్తారా? క్లబ్‌ల నుంచి వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తారా? ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పిల్లల స్కూల్ ఫీజులు సైతం చెల్లించలేని స్థితిలోకి ఎందరో వెళ్లిపోతారు. ఏ గృహిణి మెడలోనూ పుస్తెలు ఉండవు.

– కోట సామ్రాజ్యం, గృహిణి, విజయవాడ

పేకాట కేంద్రాల అడ్డాగా రేపల్లె

బాపట్ల జిల్లా రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్ మద్దతుతో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల నగరం మండలం వెలమవారిపాలెం వద్ద ఆటగాళ్ల వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉండేలా దాదాపు ఎకరం స్థలంలో పేకాట కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆటగాళ్లను రప్పిస్తున్నారు. రోజూ రూ.కోట్లలోనే ఆట నడుస్తోంది. ఈ ఒక్క కేంద్రం నుంచే ముఖ్యనేత బంధువుకు రోజూ రూ.లక్షల్లో కమీషన్ వెళుతోంది. రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో గుడ్డికాయలంక, పద్మావతీ టాకీస్ సెంటర్, బస్టాండ్ ఏరియాలో పేకాట కేంద్రాలు నడుపుతున్నారు. చెరకుపల్లి మండల కేంద్రంలోని భవానీపురం, నిజాంపట్నం మండల కేంద్రం సమీపంలోని ఒక గ్రామంలో పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఒక్క రేపల్లె నియోజకవర్గంలోనే 20 కేంద్రాలు నడుస్తున్నాయి. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మద్దతులో వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరులోనూ పేకాట నడుస్తోంది. కొందరు అధికార పార్టీ నేతల గెస్ట్‌హౌస్‌లు సైతం పేకాట కేంద్రాలుగా మారాయి. పర్చూరు మండలం కారంచేడు, స్వర్ణ, ఆదిపూడి, దగ్గుపాడు గ్రామాల పరిధిలో నిత్యం పేకాట నడుస్తోంది. ఇక్కడ పొలాల్లోనే ఆట నడిపిస్తున్నారు. అద్దంకి, బాపట్ల నియోజకవర్గాల్లోనూ పేకాటలు నిత్యం నడుస్తున్నాయి. పేకాట శిబిరాలకు మంత్రి మద్దతు ఉండటంతో పోలీసులు పట్టించుకోవడం లేదు.



బాపట్ల జిల్లా నగరం మండలం వెలమవారిపాలెం వద్ద పేకాట శిబిరం

గుంటూరు, కృష్ణాలో సకల సౌకర్యాల మధ్య..

గుంటూరు నగరంలో నిత్యం పేకాట రూ.కోట్లలో నడుస్తోంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు క్లబ్‌లలో యథేచ్ఛగా సాగుతోంది. కొరిటిపాడు వద్ద గల ఎల్‌వీఆర్ క్లబ్‌లో నెలన్నరగా పేకాట ప్రారంభించారు. పేకాట ఆడే వారికి అన్ని రకాల సదుపాయాలు, మద్యం, బిర్యానీలతో పాటు వడ్డీ వ్యాపారులు సైతం సిద్ధంగా ఉండేలా క్లబ్ నిర్వాహకులు శ్రద్ధ తీసుకుంటున్నారు. గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా కూడా లావాదేవీలు జరుపుతున్నారు. ఈ క్లబ్‌ను ఓ మాజీ మంత్రి కనుసన్నల్లో నడిపిస్తున్నారని సమాచారం. ఇక్కడికి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ క్లబ్‌లో 40 టేబుళ్లపై ఆట సాగుతోందని సమాచారం. తద్వారా క్లబ్‌కు రోజూ రూ.20 లక్షలకు పైగానే ఆదాయం వస్తున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి, ఇటు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న నార్త్ క్లబ్‌లో, పలకలూరులోని గుంటూరు క్లబ్‌లో పేకాట యథేచ్ఛగా సాగుతోంది. నగర శివారులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా పలుచోట్ల పేకాట ఆడుతున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, పెడన, గన్నవరం, పెనమలూరు, గుడివాడ, పామర్రులోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు.

కడవకుదురు టు తెలంగాణ

బాపట్ల జిల్లా నుంచి భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణా

- పర్చూరు ముఖ్య నేత కనుసన్నల్లోనే దందా
- రెవెన్యూ, అటవీశాఖ భూముల్లో తవ్వకాలు
- ట్రక్కుల ద్వారా హైదరాబాద్‌కు తరలింపు



కడవకుదురు రైల్వేగేటు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా పర్చూరు నుంచి వేల టన్నుల ఇసుక అక్రమంగా తెలంగాణకు తరలిపోతోంది. రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు రెవెన్యూ, అటవీభూముల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ట్రక్కులు, టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపుతున్నారు. ట్రక్కులన్నీ హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్లు ప్రకాశం, పల్నాడు జిల్లాలకు వెళ్తున్నాయి. పర్చూరుకు చెందిన అధికార పార్టీ ముఖ్య నేత కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేతకు అవసరమైనప్పుడు పెద్ద ఎత్తున నిధులు సమకూర్చే ఒక కంపెనీ అధినేత సమీప బంధువులు ఈ ఇసుక దందాను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఇసుక తవ్వకాల ప్రాంతంలో ప్రైవేటు సైన్యాన్ని పెట్టి కర్రలు, రాడ్లు తదితర మారణాయుధాలతో కాపు కాస్తున్నారు. ఎవరైనా వస్తే దాడులు చేసేందుకు వారు వెనుకాడడంలేదు. పోలీసులకు మామూళ్లు వెళ్తుండటంతో వారు ఇటువైపు కన్నెత్తి చూడటంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

కడవకుదురు భూముల నుంచి..

పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం కడవకుదురు ప్రాంతంలో పెద్ద ఎత్తున ఇసుక (గుట్టలు) భూములు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు భూములతోపాటు రెవెన్యూ, అటవీ శాఖ భూములూ ఉన్నాయి. ఈ భూముల్లో ఎస్సీ, ఎస్టీలకు గతంలో పట్టాలు ఇచ్చినా వ్యవసాయానికి పనికిరాకపోవడంతో బీళ్లుగానే ఉంచారు. ఇక్కడ నిర్మాణాలకు పనికొచ్చే నాణ్యమైన ఇసుక ఉండడం, వర్షాకాలం నేపథ్యంలో ఇసుకకు డిమాండ్ పెరగడంతో పర్చూరు అధికారపార్టీ నేత కన్ను పడింది. అనుచరులనుపెట్టి ఇసుక గుట్టలను అక్రమంగా తరలించి రూ. కోట్లు కొల్లగొడుతున్నారు. కడవకుదురు రైల్వే గేటు ప్రాంతంలో గత పది రోజులుగా తవ్వకాలు మొదలు పెట్టారు. ప్రభుత్వ పెద్దల సూచనలతో పగటిపూట కాకుండా రాత్రి 10 గంటల ప్రాంతంలో జేసీబీలు, ఇటాచ్‌లు పెట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. ట్రక్కులు, టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ. 4 నుంచి 8 వేలకు అమ్ముతున్నారు.

ట్రక్కు ఇసుక రూ. 80 వేలు..

కృష్ణా, గోదావరి నదులకు నీళ్లు రావడంతో మైదాన ప్రాంతాల ఇసుకకు డిమాండ్ పెరిగింది. హైదరాబాద్‌లో ఇసుకకు మరింత డిమాండ్ ఉంది. దీంతో కడవకుదురు నుంచి రోజూ 15 ట్రక్కుల్లో హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్క ట్రక్కు (18 టన్నులు) ఇసుక రూ. 80 వేలకు తగ్గకుండా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

‘ఉచిత ఇసుక’లో విఫలమయ్యాం

- గత ప్రభుత్వంలో కన్నా ఇప్పుడే అధిక ధరలకు విక్రయిస్తున్నారు
- మా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది
- మంత్రి కొల్లు రవీంద్ర

అమలాపురం రూరల్: ‘ఉచిత ఇసుక విధానం అమలు చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం విఫలమైంది. గత ప్రభుత్వంలో కన్నా ఇప్పుడు అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారు. దీనివల్ల మా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది..’ అని రాష్ట్ర గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుపై అమలాపురంలోని కలెక్టరేట్‌లో శనివారం మంత్రి రవీంద్ర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచిత ఇసుక అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా స్టాక్ పాయింట్లలో అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పారు. తొలుత కొత్తపేటకు చెందిన లారీ డ్రైవర్లతో మంత్రి మాట్లాడారు. ఐదు యూనిట్ల లారీ ఇసుకకు ఎంత ఫోన్ పే చేస్తున్నారని ప్రశ్నించగా... తాము రూ.5,300 చెల్లిస్తున్నామని డ్రైవర్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ‘మీరు చెబుతున్నది సరికాదు.. మా వద్ద ఆధారాలు ఉన్నాయి’ అని అసహనం వ్యక్తంచేశారు. మరోవైపు కొత్తపేట నుంచి అమలాపురానికి ఇసుక తీసుకువచ్చేందుకు రూ.18 వేల నుంచి రూ.19 వేల వరకు తీసుకుంటున్నారని కూటమి పార్టీలకు చెందిన నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు.

'పోటీ అనేది ఆట వరకే పరిమితం. ఆ తరువాత అంతా మనం మనం' అని చెప్పడానికి చరిత్రలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తాజాగా... స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా తల్లి సరోజ్ దేవి పాకిస్తాన్ జావెలిన్ త్రో ప్లేయర్ అర్షద్ నదీమ్ గురించి, అర్షద్ నదీమ్ తల్లి రజియా పర్వీన్ నీరజ్ చోప్రా గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడిన మాటలు క్రీడా స్ఫూర్తికి అద్దం పట్టాయి.



● సరోజ్ దేవి


● రజియా పర్వీన్

పతకమేదైనా తల్లికి బంగారమే

స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్‌లో రజతం గెల్చుకున్నాడు. అయితే ఆయన గెలుచుకున్న రజతం చాలామందికి సంతోషాన్ని ఇవ్వలేదు. అద్భుత శక్తిసామర్థ్యాలు ఉన్న, ఎంతో ఘన చరిత్ర ఉన్న నీరజ్ చోప్రా స్వర్ణ పతకం సొంతం చేసుకోకపోవడం చాలా మందిని నిరాశ పరిచింది.

మరోవైపు పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ స్వర్ణం గెలుచుకున్నాడు.


'అర్షద్ నదీమ్ కూడా నా కుమారుడిలాంటి వాడే' అని స్పందించింది నీరజ్ చోప్రా తల్లి సరోజ్ దేవి. ఆ అమ్మ మాటను ప్రపంచం మెచ్చింది.

పాకిస్తాన్‌కు చెందిన క్రీడాకారుడిని సరోజ్ దేవి మెచ్చుకోవడం కొద్దిమందికి నచ్చకపోయినా, వారిని ఉద్దేశించి నీరజ్ చోప్రా వివరణ ఇచ్చినా...స్థూలంగా ఆమె మాటలు అర్షద్ నదీమ్ గెలుచుకున్న బంగారం పతకం కంటే విలువైనవి.

'మా వాడు బంగారం పతకంతో వస్తాడనుకుంటే రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది' అని నిట్టూర్చలేదు సరోజ్ దేవి.'రజతం అయినా బంగారం అయినా ఒక్కటే. ఇద్దరూ నా బిడ్డలే' అన్నది.



● నదీమ్



● నీరజ్ చోప్రా

ఆమె మాటలు ప్రధాని నరేంద్ర మోదీకీ నచ్చాయి. ఆమె సహృదయతను ప్రశంసించారు.

మరో వైపు చూస్తే... 'నీరజ్ నా కుమారుడి లాంటివాడు. అతడి కోసం ప్రార్థిస్తాను. నీరజ్ ఎన్నో పతకాలు గెలుచుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటోంది అర్షద్ నదీమ్ తల్లి రజియా పర్వీన్.

'నా బిడ్డ తప్ప ఇంకెవరైనా బంగారు పతకం గెలుచుకోగలరా!' అని బీరాలు పోలేదు. ఒకవైపు కుమారుడి చారిత్రక విజయానికి సంతోషిస్తూనే మరోవైపు నీరజ్ చోప్రా ప్రతిభను వేనోళ్ల పొగిడింది. పాకిస్తాన్, పంజాబ్‌లోని ఖనేవాల్ జిల్లాకు చెందిన అర్షద్ నదీమ్ కుటుంబం నీరజ్ చోప్రాను తమ ఇంటికి ఆహ్వానించింది.

పోటీలకు అతీతంగా అర్షద్, నీరజ్‌లు ఒకరినొకరు ప్రశంసించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి..

'ఆటకు సంబంధించి ఎలా ఉన్నా మేము మంచి స్నేహితులం, అన్నదమ్ములం... అని అర్షద్ నాతో ఎన్నోసార్లు చెప్పాడు' అంటుంది రజియా పర్వీన్.

'నీరజ్ మా కుటుంబంలో ఒకరు. అతను పాకిస్తాన్‌కు వస్తే ఎయిర్ పోర్ట్ నుంచి మా ఇంటికి ఊరేగింపుగా తీసుకువస్తాం' అంటున్నాడు పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అర్షద్ నదీమ్ సోదరుడు షాహీద్ అజీమ్.

ఇద్దరు మిత్రులు

నీరజ్ చోప్రాకు కుటుంబసభ్యులతో కలిసి కూర్చొని హాయిగా కబుర్లు చెప్పుకోవడం అంటే ఇష్టం. పండగలు వస్తే చాలు మిఠాయిల పని పట్టాల్సిందే. ఆ తరువాత బరువు పని పట్టాల్సిందే.

'ఆటగాడికి కుటుంబ మద్దతు చాలా ముఖ్యం' అంటాడు నీరజ్. 'ఆటల్లో తొలి అడుగు వేసినప్పటి నుంచి ఇప్పటివరకు కుటుంబం నాకు మద్దతుగా ఉంది. నా వెనుక నా కుటుంబం ఉన్నది అనే భావన ఎంతో శక్తిని ఇస్తుంది' అంటాడు నీరజ్. 'నేను' అనే అహం నీరజ్‌లో కనిపించదు. ఎదుటివారి ప్రతిభను ప్రశంసించకుండా ఉండలేడు. ముఖాముఖీగా, మీడియా ముఖంగా అర్షద్ నదీమ్‌ను ఎన్నోసార్లు ప్రశంసించాడు నీరజ్ చోప్రా. అందుకే అతడంటే నదీమ్‌కు చాలా ఇష్టం.



● ఆత్మీయ ఆలింగనం: నదీమ్, నీరజ్

ఇక నదీమ్ గురించి చెప్పాలంటే అతడు ఇంట్రావర్ట్. తక్కువగా మాట్లాడుతాడు. సాధారణ కుటుంబంలో పుట్టిన నదీమ్‌కు ఆర్థిక భారం ఎన్నోసార్లు అతడి దారికి అడ్డుగా నిలబడేది. స్నేహితులు, సన్నిహితులు అతడి విదేశీ టోర్నమెంట్‌లకు సంబంధించి ప్రయాణ, ఇతర ఖర్చులకు డబ్బును సమకూర్చేవారు. టోక్యో ఒలింపిక్స్‌కు సంబంధించి నదీమ్‌కు పాక్ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించలేదు. 'పారిస్ ఒలింపిక్స్‌కు ఇంకా కొన్ని నెలల సమయం మాత్రమే ఉంది. పాత జావెలిన్‌తో ప్రాక్టిస్ చేయడం కష్టంగా ఉంది' అంటూ సాగిన నదీమ్ సోషల్ మీడియా పోస్ట్ ఎంతోమంది దృష్టిని ఆకర్షించింది. నీరజ్ చోప్రా కూడా అర్షద్ నదీమ్‌కు మద్దతుగా మాట్లాడాడు.



పాలక్కాడ్ టు హైదరాబాద్... చెన్నై... ముంబై... సినిమా అనేది సంయుక్తను అన్ని రాష్ట్రాల్లోనూ పాపులర్ చేసింది. రీల్‌పై హీరోయిన్... రియల్‌గానూ అంతే... ఆపన్న హస్తం అందించడానికి వెనకాడరామె. 2018లో కేరళలో వరదలు సంభవించినప్పుడు స్వయంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు సంయుక్త. తాజాగా వయనాడ్ బాధితులకు విరాళం ఇచ్చారు. 'ఆది శక్తి' పేరుతో సేవా సంస్థను ఆరంభించారు. తెలుగులో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న ఈ మలయాళ బ్యూటీ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ...

హీరోయిన్‌గా పొందిన ప్రేమను హ్యూమన్‌గా తిరిగి ఇస్తున్నా

\- సంయుక్త

● **కేరళలో పుట్టి పెరిగిన మీకు ఇప్పుడు వయనాడ్‌ని చూస్తుంటే బాధ అనిపించడం సహజం. వయనాడ్ ఎన్నిసార్లు వెళ్లారు?**

సంయుక్త: ఇప్పటివరకూ నేను ఒకే ఒక్కసారి వెళ్లాను. చాలా అందమైన ప్రదేశం. మంచి హిల్ స్టేషన్. హాయిగా గడపడానికి అక్కడికి వెళుతుంటారు. అలాంటి వయనాడ్ రూపు రేఖలు వర్షాల వల్ల మారిపోవడంతో బాధ అనిపించింది. ఇప్పుడు వయనాడ్ వెళదామనుకున్నాను కానీ సందర్శనలకు అనుమతి లేదు.

● **వయనాడ్‌లో షూటింగ్స్ ఏమైనా చేశారా?**

ఆ అవకాశం ఇప్పటివరకూ రాలేదు. యాక్చువల్లీ అక్కడ వర్షాలప్పుడు నేను హైదరాబాద్‌లో ఉన్నాను. ప్రతి గంటకూ మా అమ్మగారు ఫోన్ చేసి, పరిస్థితులు చెప్పేవారు. ఆ బీభత్సం చూసి, ఆవిడైతే నాలుగైదు రోజులు నిద్రపోలేదు. నిజానికి వయనాడ్‌కి ఏమైనా చేయమని అమ్మే చెప్పింది. నేనూ అదే అనుకున్నాను కాబట్టి వెంటనే విరాళం ఇచ్చాను.

ఆర్థిక సహాయమేనా? 2018 కేరళ వరదలప్పుడు స్వయంగా సహాయ కార్యక్రమాలు చేసినట్లు చేయాలనుకుంటున్నారా?

ఇంకా చేయాలని ఉంది. కేరళలోని ఓ స్వచ్ఛంద సేవా సంస్థతో మాట్లాడాను. ఏం చేస్తే బాగుంటుందో వాళ్లు గ్రౌండ్ లెవల్‌లో స్టడీ చేస్తున్నారు. దాన్నిబట్టి సహాయ కార్యక్రమాలను ప్లాన్ చేస్తాను.


2018లో పరిసరాలు శుభ్రం చేస్తున్న సంయుక్త

● **2018లో చేసిన సేవా కార్యక్రమాల గురించి...**

2018లో కేరళ వరదలప్పుడు నేను చెన్నైలో ఇరుక్కుపోయాను. బాధితుల కోసం చాలా చిన్న స్థాయిలో ఓ కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేశాను. నేను ఊహించినదానికన్నా ఎక్కువ నిత్యావసర వస్తువులు రావడంతో పెద్ద గోడౌన్ తీసుకోవాల్సి వచ్చింది. వచ్చినవి వచ్చినట్లు సరఫరా చేశాం. ఇక కేరళ వెళ్లాక పాడైపోయిన ఇళ్లను బాగు చేసే కార్యక్రమంలో పాల్గొన్నాను. చెప్పలేనంత మట్టి పేరుకుపోవడంతో క్లీన్ చేయడానికి ఇబ్బందిపడ్డాం.

● **సంయుక్తా మీనన్‌లోంచి 'మీనన్' ఎందుకు తీసేశారు?**

మా అమ్మానాన్న విడిపోయారు. అమ్మంటే నాకు చాలా ప్రేమ, గౌరవం. తన ఫీలింగ్స్‌ని గౌరవించి పేరులోంచి సర్ నేమ్ తీసేశాను. ఇంకో విషయం ఏంటంటే... నేను ఆడ.. మగ సమానం అని నమ్ముతాను. సర్ నేమ్ వద్దనుకోవడానికి అదో కారణం.

● **సింగిల్ పేరెంట్‌గా మీ అమ్మగారు మిమ్మల్ని పెంచారు కాబట్టి తండ్రి ప్రేమను మిస్సయిన ఫీలింగ్...**

యాక్చువల్లీ నాకు అమ్మానాన్న ఇద్దరి ప్రేమనీ పంచారు మా తాతగారు (సంయుక్త అమ్మ తండ్రి). నేను ఏం అడిగినా కాదని చెప్పలేనంత ప్రేమ మా తాతగారిది. అలాగని గుడ్డిగా ఓకే చెప్పలేదు. ఆయన బాధపడే పనులు చేయనని, అసలు తప్పు చేయనని నమ్మకం. అంత ప్రేమ పంచి, నమ్మకాన్ని పెంచుకున్న మా తాత నా ఫస్ట్ బాక్సాఫీస్ సక్సెస్‌ని చూడకుండానే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. కానీ, ఎక్కడున్నా తన మనవరాలి విజయాన్ని చూస్తున్నారన్నది నా నమ్మకం.

● **'స్వయంభూ', హిందీ 'మహారాజ్ఞి' కోసం ఫైట్స్ కూడా నేర్చుకున్నారు... ఇప్పటివరకూ దాదాపు సున్నితమైన పాత్రల్లో కనిపించిన మీరు ఇప్పుడు పవర్‌ఫుల్‌గా కనిపించనున్నారన్న మాట...**

'స్వయంభూ' కోసం గుర్రపు స్వారీ, ఫైట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. అటు హిందీ 'మహారాజ్ఞి' కోసం కూడా యాక్షన్ నేర్చుకున్నాను. ఒకప్పుడు సినిమాలకు దూరంగా పారిపోవాలనుకున్న నేను ఇప్పుడు సినిమా కోసం ఏం నేర్చుకోవడానికైనా రెడీ అయిపోయాను. చేసే ప్రతి పాత్ర ఒకదానికి ఒకటి భిన్నంగా ఉండాలనుకుంటున్నాను. స్క్రీన్ మీద చూసి నాపై ప్రేమ పెంచుకున్న ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి ఎంతైనా కష్టపడొచ్చు.

● **ప్రేక్షకుల మీద ప్రేమతోనేనా ఈ సేవా కార్యక్రమాలు...**

అవును. పాలక్కాడ్‌లో మొదలై ఇతర రాష్ట్రాల్లో ఆదరణ పొందడం అంటే చిన్న విషయం కాదు. నటిగా నేను సక్సెస్ అయ్యానంటే అది నా విజయం కాదు. నన్ను ప్రేక్షకులే సక్సెస్ చేశారు. హీరోయిన్‌గా నేను పొందిన ప్రేమను హ్యూమన్‌గా తిరిగి ఇవ్వాలనుకున్నాను. ఏదైనా అర్థవంతంగా, ఉపయోగపడేది చేయాలన్నది నా సంకల్పం. అందుకే 'ఆది శక్తి' సేవా సంస్థ ఆరంభించాను.

● **మీ 'ఆది శక్తి' ఫౌండేషన్ గురించి క్లుప్తంగా...**

ఎవరికైనా సహాయం చేయాలంటే జస్ట్ డబ్బులు ఇచ్చేస్తే సరిపోదు. వాళ్లు జీవించినంత కాలం పనికొచ్చే సహాయం చేయాలి. నేను స్త్రీ సంక్షేమంపై దృష్టి పెట్టాను. చదువు, ఆరోగ్యం, ఉద్యోగం... వీటికి సంబంధించి సహాయం చేయాలన్నది నా ఆశయం. ముఖ్యంగా నేటి స్త్రీల మానసిక ఆరోగ్యం చాలా దెబ్బ తింటోంది. ఆ విషయం మీద వారిని ఎడ్యుకేట్ చేయాలి. నేను 'ఆది శక్తి' ఆరంభించే ముందు పలు స్వచ్ఛంద సేవా సంస్థలతో మాట్లాడాను. కొంత రిసెర్చ్ చేసి, అవగాహన తెచ్చుకుని 'ఆది శక్తి' ఆరంభించాను.

● **కేరళ నుంచి నిత్యామీనన్, నయనతార, సమంత (సమంత అమ్మ మలయాళీ) వంటివారిని హైదరాబాద్ తీసుకొచ్చి స్టార్స్‌ని చేసింది టాలీవుడ్. ఇప్పుడు మీరు... మాలీవుడ్ అమ్మాయిలకు టాలీవుడ్ లక్కీ అనొచ్చా?**

ఒక్క మాలీవుడ్ ఏంటి? ఎవరికైనా ఆహ్వానం పలుకుతుంది టాలీవుడ్. సో.. మాకే కాదు అందరికీ లక్కీయే. ఇక్కడి ప్రేక్షకులు ఇష్టపడటం మొదలుపెట్టారంటే ఇక ఆ స్టార్‌ని ఎప్పటికీ ఇష్టపడతారు. అలాగే తెలుగు ఇండస్ట్రీ సినిమాని సెలబ్రేట్ చేస్తుంది. ఇంతగా ప్రేమించే తెలుగు పరిశ్రమలో భాగం కావడం హ్యాపీగా ఉంది. అందుకే కేరళ నుంచి హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను.

\- డి.జి. భవాని

సినిమా

మా కోసం పది లక్షలు విరాళం


మూవీ ఆర్టిస్ట్స్' అసోసియేషన్ (మా) అధ్యక్షుడు విష్ణు మంచు పది లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. తన మూడో కుమార్తె (విష్ణు–విరానికా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు) ఐరా విద్యా మంచు జన్మదినం (ఆగస్టు 9) సందర్భంగా 'మా' అసోసియేషన్‌లో ఆర్థికంగా వెనకబడిన కళాకారుల సంక్షేమం కోసం ఆయన ఈ విరాళాన్ని అందించారు. కళాకారుల సంరక్షణ, సహాయాల నిమిత్తం ఈ నగదుని వెచ్చించనున్నారు. అలాగే 'మా' భవనంపై కూడా విష్ణు మంచు దృష్టి సారించారని తెలుస్తోంది. ఇక సినిమాల విషయానికి వస్తే...ప్రస్తుతం విష్ణు మంచు హీరోగా 'కన్నప్ప' చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా డిసెంబరులో రిలీజ్ కానుంది.


● విష్ణు మంచు

అందుకే పదిహేనుకే వస్తున్నాం

\- టీజీ విశ్వప్రసాద్

"'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రారంభించినప్పుడే మే లేదా జూన్‌లోగా పూర్తి చేసి, ఆగస్టు 9న విడుదల చేయాలనుకున్నాం. అయితే సాంగ్స్ షూటింగ్ పూర్తి కాకపోవడంతో ఆ తేదీన రిలీజ్ చేయలేదు. అలాగే 'పుష్ప 2: ది రూల్' రిలీజ్ వాయిదా పడటంతో ఆగస్టు 15 సరైన తేదీ అని విడుదల చేస్తున్నాం" అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జోడీగా హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– "రవితేజగారితో మేం నిర్మించిన 'ధమాకా' మంచి హిట్టయింది. 'ధమాకా'కి ప్లస్‌లా 'మిస్టర్ బచ్చన్' ఉంటుంది. హరీష్ శంకర్, రవితేజలది క్రేజీ కాంబినేష్. 'మిస్టర్ బచ్చన్' కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్. ఇందులో వినోదం, మాస్, యాక్షన్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలుఉన్నాయి. హరీష్‌కి, మిక్కీ జె. మేయర్‌కి మంచి అనుబంధం ఉంది. ఈ సినిమాకి ఎలాంటి మ్యూజిక్ కావాలో అంత గ్రాండ్ ఔట్‌పుట్ తీసుకొచ్చారు. పాటలకి చాలా మంచి స్పందన వస్తోంది. ఆగస్టు 15కి తెలుగులో రెండు పెద్ద సినిమాలు 'మిస్టర్ బచ్చన్, డబుల్ ఇస్మార్ట్' వస్తున్నాయి. థియేటర్ల పరంగా ఈ రెండింటికీ ఎలాంటి సమస్య రాదు. పైగా లాంగ్ వీకెండ్ ప్లస్ అవుతుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై తెలుగుతో పాటు హిందీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లోనూ సినిమాలు నిర్మిస్తున్నాం. మా సంస్థ నుంచి దాదాపు 15 సినిమాలు విడుదలకు ముస్తాబవుతున్నాయి. వీటిలో కన్నడంలో మూడు సినిమాలు, హిందీలో బాబీ డియోల్‌తో ఒక సినిమా, రెండు ఇంగ్లిష్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. ప్రభాస్‌గారి 'రాజా సాబ్' షూటింగ్ 50 శాతం పూర్తయింది. ఈ ఏడాదిలోపు చిత్రీకరణ పూర్తవుతుంది" అన్నారు.



నాపై చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి

\- విశాల్

"ప్రస్తుత తమిళ నిర్మాతల మండలి నాపై చేసిన తీర్మానాన్ని 24 గంటల్లో వెనక్కి తీసుకోవాలి. లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటాను" అని హీరో విశాల్ అన్నారు. గతంలో తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడిగా పని చేసిన విశాల్ పలు అవకతవకలకు పాల్పడ్డారని, మండలి నిధుల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, ఇకపై విశాల్‌తో చిత్రాలు చేసే దర్శక–నిర్మాతలు తమను సంప్రదించాలంటూ తమిళ నిర్మాతల మండలి ఓ ప్రకటనలో పేర్కొంది.

దీనిపై విశాల్ స్పందించి, తమిళ నిర్మాతల మండలికి ఓ లేఖ రాశారు. "మండలి నిబంధనలకు అనుగుణంగానే అప్పటి కార్యవర్గంలో బాధ్యతలు నిర్వహించిన కదిరేశన్, ఇతర సభ్యుల అంగీకారంతోనే సభ్యుల సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాం.. వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు వేశాం. ప్రత్యేక ఆడిటర్ చేసిన ఆరోపణల విషయంలో నన్ను వివరణ కోరలేదు. కార్యవర్గం చేసిన తీర్మానంతోనే 'ఇళయ రాజా 75' పేరుతో సంగీత విభావరి నిర్వహించి, నిర్మాతల మండలికి మంచి పేరు తెచ్చిపెట్టాను. వాటికి సంబంధించిన వివరాలు మండలి కార్యాలయంలో ఉన్నాయి. అలాంటిది ఏ ఆధారాలున్నాయని నాతో చిత్రాలు చేసే దర్శక–నిర్మాతలు మండలిలో చర్చించాలని తీర్మానం చేస్తారు? ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి" అని స్పందించారు విశాల్.

\- సాక్షి, చెన్నై



ఫుల్ ఫన్ బాత్... ఆయ్

\- నార్నే నితిన్



"కులం, మతం కంటే స్నేహం చాలా గొప్పది అనే సందేశాన్ని 'ఆయ్' సినిమాలో వినోదాత్మకంగా చూపించాం. ఈ నెల 15న చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. అయితే మా 'ఆయ్' కి ఉండాల్సిన ఆడియన్స్ మాకున్నారని అనుకుంటున్నాం. మంచి వినోదంతో కూడిన గోదావరి నేపథ్యంలో సినిమా వచ్చి చాలా రోజులైంది. 'ఆయ్'ని కచ్చితంగా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాం" అని నార్నే నితిన్ అన్నారు. హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా, నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా నార్నే నితిన్ మాట్లాడుతూ–" అంజి కె.మణిపుత్రది అమలాపురం. ఆయన లైఫ్‌లో చూసినవన్నీ కలిపి చేసిన సినిమానే 'ఆయ్'. ఈ చిత్రంలో ఫుల్ ఫన్ ఉంటుంది కాబట్టి పోస్టర్స్‌లో అంతా ఫన్ బాత్ అని పెట్టాం.. ఇది డైరెక్టర్‌గారి ఆలోచనే. గోదావరి యాసలో ఆయ్ అనే పదాన్ని సాధారణంగా వాడుతుంటాం. ఆ నేపథ్యంలో సాగే ఈ మూవీకి 'ఆయ్' కరెక్ట్ టైటిల్ అని అల్లు అరవింద్‌గారు చెప్పడంతో ఫిక్స్ చేశారు. 'మ్యాడ్' చిత్రంలో కథకు తగ్గట్టు బిహేవ్ చేశాను. 'ఆయ్'లో కథకు తగ్గట్టు నటించాను. గీతా ఆర్ట్స్ వంటి పెద్ద సంస్థలో సినిమా చేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. నయన్ సారిక మరాఠీ అమ్మాయి అయినా అచ్చ తెలుగమ్మాయిలా ఉంటుంది. తన పాత్ర అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. రామ్ మిర్యాలగారు మూడు పాటలకు సంగీతం అందించారు. అలాగే అజయ్ అరసాడగారు రెండు పాటలకు మ్యూజిక్ ఇవ్వడంతో పాటు నేపథ్య సంగీతం ఇచ్చారు. ఎన్టీఆర్‌గారు 'ఆయ్' ట్రైలర్ చూశారు. అందులోని కామెడీని ఎంజాయ్ చేశారు. సినిమా చూసిన తర్వాత కూడా ఆయన దగ్గర నుంచి అలాంటి స్పందన వస్తే బావుంటుందనిపిస్తోంది. ప్రస్తుతం 'మ్యాడ్ 2' మూవీలో నటిస్తున్నా" అన్నారు.

క్రైమ్... థ్రిల్

విశ్వంత్, శిల్పా మంజునాథ్ హీరో హీరోయిన్లుగా నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'హైడ్ న్ సిక్'. బసిరెడ్డి రానా దర్శకత్వంలో నిశాంత్, ఎంఎస్‌టీపీ సమర్పణలో సహస్ర ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నరేంద్ర బుచ్చిరెడ్డి నిర్మించిన చిత్రం ఇది. తాజాగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన నటుడు శివాజీ మాట్లాడుతూ– "ఇటీవల ఇండస్ట్రీకి కొత్త ప్రతిభ ఎక్కువగా వస్తోంది. ఇది మంచి పరిణామం. 'హైడ్ న్ సిక్' సినిమాకు ప్రేక్షకులు విజయం చేకూర్చాలి" అన్నారు.


● విశ్వంత్, శిల్పా మంజునాథ్

"ఈ సినిమా విజయం సాధిస్తుంది" అని తెలిపారు విశ్వంత్. "ఎన్ని కష్టాలొచ్చినా ఈ సినిమాను ఆపేది లేదని నిర్మాత భరోసా ఇచ్చారు. ఆ ధైర్యంతో ఈ సినిమాను పూర్తి చేశాం" అని పేర్కొన్నారు బసిరెడ్డి రానా. దర్శకులు మల్లి అంకం, ఆదిత్యా హాసన్, నవీన్ మేడారం అతిథులుగా హాజరై, 'హైడ్ న్ సిక్' విజయాన్ని ఆకాంక్షించారు.

యాక్షన్ స్టార్ట్


● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న కొత్త సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. దర్శకులు గౌతమ్ వాసుదేవ్ మీనన్, వైవీఎస్ చౌదరి, శ్రీను వైట్ల వద్ద దర్శకత్వం విభాగంలో పని చేసిన రామ్ దేశిన (రమేశ్) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ సినిమా నిర్మిస్తున్నారు. "యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. పలు విజయవంతమైన చిత్రాలకు సహ రచయితగా చేసిన రామ్ దేశిన అద్భుతమైన కథను సిద్ధం చేశారు. శనివారమే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం" అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, సముద్ర ఖని, మైమ్ గోపి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్.

అవతార్ త్రీకి టైటిల్ ఫిక్స్



పండోరా ప్రపంచంలోకి మళ్లీ వెళ్లడానికి సిద్ధంగా ఉండండి అంటున్నారు దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'అవతార్' ఫ్రాంచైజీ సినిమాలకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. 'అవతార్' ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే 'అవతార్', 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' సినిమాలు వచ్చాయి. తాజాగా 'అవతార్' ఫ్రాంచైజీలోని మూడో సినిమాకు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు, ఈ సినిమాను 2025 డిసెంబరు 19న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సామ్ వర్తింగ్టన్, జో సల్దాన, కేట్ విన్స్‌లెట్ తదితరులు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమాలో లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇక పండోరా అనే కల్పిత గ్రహం నేపథ్యంలో 'అవతార్' ఫ్రాంచైజీ చిత్రాలు వస్తున్న సంగతి తెలిసిందే.

యాక్షన్ సినిమాలంటే ఇష్టం


● కృష్ణ వంశీ

"'అలనాటి రామచంద్రుడు' చిత్రంలో నటనకు ప్రాధాన్యం ఉన్న సిద్ధు పాత్ర చేశాను. ఆ క్యారెక్టర్‌కి న్యాయం చేశాననే ప్రశంసలు అందుకోవడం హ్యాపీ. నటుడిగా అన్ని రకాల పాత్రలు చేయాలనుంది. వ్యక్తిగతంగా యాక్షన్ డ్రామా, ఎమోషన్స్‌తో భారీ డైలాగ్స్ చెప్పే సినిమాలు చేయడం ఇష్టం" అని హీరో కృష్ణవంశీ అన్నారు. చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వంలో కృష్ణవంశీ హీరోగా నటించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించిన ఈ సినిమాని 'దిల్' రాజు ఈ నెల 2న రిలీజ్ చేశారు. కృష్ణవంశీ మాట్లాడుతూ– "వైఎస్ఆర్ కడప జిల్లాలోని పోరుమామిళ్ల మా స్వగ్రామం. నాకు సినిమాలంటే ఇష్టం. ఆకాశ్ రెడ్డి ఆడిషన్ చేసిన తర్వాతే 'అలనాటి రామచంద్రుడు'లో హీరోగా చాన్స్ ఇచ్చారు. నా తర్వాతి మూవీ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ఉంటుంది. నా లుక్ టెస్ట్ పూర్తయింది" అన్నారు.

సృష్టికి విరుద్ధం


● రమేశ్‌బాబు, రిషిత

చిమటా రమేశ్‌బాబు హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'నేను కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లుగా నటించారు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. 'చావును చూశాక.. మళ్లీ రాకూడదు. సృష్టికి విరుద్ధం' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. "ఓ సినిమా విజయం సాధించడానికి కావాల్సిన అన్ని అంశాలు మా సినిమాలో ఉన్నాయి" అన్నారు రమేశ్‌బాబు. "మల్టీ జానర్‌గా రూపొందిన ఈ చిత్రం హిట్ అవుతుంది" అని చిమటా లక్ష్మీకుమారి తెలిపారు.



భారత గోల్ఫర్ అదితికి 29వ స్థానం

మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకం కోల్పోయిన భారత మహిళా గోల్ఫర్ అదితి అశోక్ 'పారిస్' క్రీడల్లో ప్రభావం చూపలేకపోయింది. మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లేలో అదితి 290 పాయింట్లతో 29వ స్థానంతో సరిపెట్టుకుంది. తొలి మూడు రోజులు పెద్దగా ఆకట్టుకోలేకపోయిన అదితి... పోటీల చివరి రోజు శనివారం మెరుగైన ప్రదర్శన కనబర్చింది. 11 స్థానాలు మెరుగు పర్చుకుంది. భారత్‌కే చెందిన మరో గోల్ఫర్ దీక్ష డాగర్ 301 పాయింట్లతో 49వ స్థానంతో సరిపెట్టుకుంది. న్యూజిలాండ్ గోల్ఫర్ లిడియా కో 278 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా... ఎస్తెర్ హెన్సెలీట్ (280 పాయింట్లు; జర్మనీ), లిన్ జియా జానెట్ (281 పాయింట్లు; చైనా) వరసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. 'తొలి మూడు రోజులు సరైన షాట్‌లు ఆడలేకపోయా. అందుకే వెనుకబడ్డా.. చివర్లో పుంజుకున్నా అప్పటికే ఆలస్యమైంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో మరింత మెరుగైన ప్రదర్శనతో పతకం సాధించేందుకు ప్రయత్నిస్తా' అని అదితి పేర్కొంది.

ఆరుతో సరి...

పారిస్ ఒలింపిక్స్‌లో ముగిసిన మన పోరు

- భారత్ ఖాతాలో ఆరు పతకాలు
- క్వార్టర్ ఫైనల్లో ఓడిన రెజ్లర్ రీతిక
- నేటితో పారిస్ క్రీడలకు తెర

టోక్యో ఒలింపిక్స్‌లో ఏడు పతకాలతో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత క్రీడాకారుల బృందం పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం దానిని పునరావృతం చేయలేకపోయింది. 'పారిస్'లో భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో 117 మంది క్రీడాకారులు బరిలోకి దిగారు. శనివారం రెజ్లింగ్ ఈవెంట్‌తో భారత పోరాటం ముగిసింది. మహిళల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 76 కేజీల విభాగంలో రీతిక క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ఆమెను ఓడించిన కిర్గిస్తాన్ రెజ్లర్ ఫైనల్ చేరకుండా సెమీఫైనల్లో పరాజయం పాలైంది. ఫలితంగా రీతికకు 'రెపిచాజ్' పద్ధతిలో కనీసం కాంస్య పతకం కోసం పోటీపడే అవకాశం లేకుండా పోయింది. 'పారిస్'లో భారత్‌కు 1 రజతం, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 6 పతకాలు లభించాయి. ప్రస్తుతం భారత్ 70వ స్థానంలో ఉంది. ఆదివారంతో పారిస్ ఒలింపిక్స్ ముగియనున్నాయి. ఫలితంగా చివరిరోజు పతకాల పట్టికలో భారత్ స్థానంలో మార్పు చోటు చేసుకునే అవకాశం ఉంది. గత టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 1 స్వర్ణం, 2 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 7 పతకాలు గెలిచి 48వ స్థానంలో నిలిచింది.



రీతిక

పారిస్: విశ్వ క్రీడల్లో భారత ప్రస్థానం ముగిసింది. శనివారంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారుల ఈవెంట్స్ పూర్తయ్యాయి. మహిళల రెజ్లింగ్ ఫ్రీస్టయిల్ 76 కేజీల విభాగంలో రీతిక కాంస్య పతక పోరుకు అర్హత సాధించి ఉంటే ఆదివారం కూడా భారత్ పతకం రేసులో నిలిచేది. కానీ రీతిక పతకం రేసులో స్థానం సంపాదించలేకపోయింది. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ రీతిక క్వార్టర్ ఫైనల్లో కిర్గిస్తాన్ రెజ్లర్ ఐపెరి మెదెత్ కిజీ చేతిలో ఓడిపోయింది. మూడు నిమిషాల నిడివి గల రెండు భాగాలు ముగిశాక ఇద్దరూ 1–1తో సమంగా నిలిచారు. స్కోరు సమమైతే నిబంధనల ప్రకారం చివరి పాయింట్ సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఈ బౌట్‌లో ముందుగా రీతిక ఒక పాయింట్ సాధించింది. రెండో భాగంలో కిర్గిస్తాన్ రెజ్లర్ పాయింట్ స్కోరు చేసి సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరికీ పాయింట్ లభించలేదు. దాంతో చివరి పాయింట్ స్కోరు చేసిన కిర్గిస్తాన్ రెజ్లర్‌ను విజేతగా ప్రకటించారు. అనంతరం కిర్గిస్తాన్ రెజ్లర్ సెమీఫైనల్లో 6–8 పాయింట్ల తేడాతో కెన్నీడీ అలెక్సిస్ బ్లేడ్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. దాంతో 'రెపిచాజ్' రూపంలో రీతికకు కాంస్య పతకం కోసం పోటీపడే అవకాశం చేజారింది. అంతకుముందు తొలి రౌండ్‌లో రీతిక కేవలం 29 సెకన్లలో హంగేరి రెజ్లర్ బెర్నాడెట్ నగీపై 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో గెలిచింది. ఇద్దరు రెజ్లర్ల మధ్య పాయింట్ల తేడా 10 పాయింట్లకు చేరుకున్న వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపి వేస్తారు. బెర్నాడెట్‌తో జరిగిన బౌట్‌లో 29 సెకన్ల సమయానికి రీతిక 12–2తో 10 పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించింది. దాంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి రీతికను విజేతగా ప్రకటించారు.

తీర్పు 13కు వాయిదా!

భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పతక వివాదం




పారిస్: ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ను డిస్‌క్వాలిఫై చేసిన అంశంలో కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తీర్పు మరో సారి వాయిదా పడింది. భారత్ ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ నెల 13న తుది తీర్పు వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి శుక్రవారమే దీనిపై వాదనలు ముగిశాయి. దాంతో భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9 గంటల 30 నిమిషాలకు తీర్పు రానుందని సమాచారం రాగా అది జరగలేదు. అనంతరం ఆదివారం అదే సమయానికి రావచ్చని వినిపించినా... చివరకు మంగళవారానికి వాయిదా పడినట్లు తెలిసింది. నిజానికి ఒలింపిక్స్ ముగిసేలోగానే దీనిపై స్పష్టత ఇస్తామని సీఏఎస్ పేర్కొంది. అయితే వినేశ్ అంశాన్ని 'ప్రత్యేక కేసు'గా చూస్తుండటంతో తీర్పు ఆలస్యమవుతూ వస్తోంది. కేసుకు సంబంధించి మరికొన్ని అదనపు డాక్యుమెంట్లను ఆదివారం సాయంత్రంలోగా తమకు అందించాలని సీఏఎస్ ఇరు పక్షాలను కోరింది. రెజ్లింగ్ 50 కేజీల కేటగిరీలో ఫైనల్‌కు ముందు 100 గ్రాముల బరువు ఉండటంతో వినేశ్‌ను నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. దాంతో ఆమె న్యాయ పోరాటానికి సిద్ధమైంది. తొలి రోజు ఫైనల్ చేరే వరకు నిబంధనలకు అనుగుణంగా తన బరువు పరిమితికి లోబడే ఉందని... కాబట్టి అప్పటి వరకు వచ్చిన ఫలితాన్ని పరిగణలోకి తీసుకుంటూ తనకు సంయుక్తంగా రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీల్ చేసింది. ప్రముఖ న్యాయవాదులు హరీశ్ సాల్వే, విదుష్పత్ సింఘానియా ఆమె తరఫున సీఏఎస్‌లో వాదించారు. ఈ వ్యవహారంలో సానుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు ఐఓఏ అధికారులు చెప్పారు.

అమన్ కూడా బరువు తగ్గించుకొని...

కాంస్య పతక మ్యాచ్‌కు ముందు కఠోర శ్రమ

10 గంటల్లో 4.5 కేజీలు తగ్గిన భారత రెజ్లర్



పారిస్: మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఫైనల్ సమరానికి ముందు బరువు తగ్గించుకోలేక డిస్‌క్వాలిఫై కావడంతో ఈ అంశంపై ఒలింపిక్స్‌లో చర్చ జరిగింది. ఇప్పుడు మరో భారత రెజ్లర్, కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తేలింది. అయితే వినేశ్‌తో పోలిస్తే అతను రాత్రికి రాత్రి బరువు తగ్గించుకొని నిబంధనల మేరకు బౌట్‌లో పోటీ పడేందుకు అర్హత సాధించి కాంస్యం గెలుచుకోగలిగాడు. అందుకోసం అతను తీవ్రంగా కష్టపడ్డాడు. జపాన్‌కు చెందిన రీ హిగుచితో గురువారం జరిగిన సెమీఫైనల్లో అమన్ పరాజయం పాలయ్యాడు. ఆ తర్వాత అమన్ బరువు చూసుకుంటే 61.5 కేజీలుగా తేలింది. అమన్ పోటీ పడబోయే 57 కేజీల ఈవెంట్‌ను బట్టి చూస్తే ఇది 4.5 కేజీలు ఎక్కువ! దాంతో భారత రెజ్లర్, అతని సహాయకులు కలిసి బరువు తగ్గించే పనిలో పడ్డారు. గంటన్నర పాటు మ్యాట్‌పై రెజ్లింగ్ సెషన్, ఆ తర్వాత గంట పాటు ఆవిరి స్నానంతో పాటు ఆ తర్వాత గంట పాటు నిరంతరాయంగా ట్రెడ్‌మిల్‌పై అమన్ పరుగెత్తాడు. అనంతరం 30 నిమిషాల విరామం ఇచ్చి మళ్లీ ఇదే పని మొదలు పెట్టారు. 5 నిమిషాల చొప్పున ఐదు సౌనా బాత్ సెషన్‌లు కూడా నిర్వహించారు. ఇదంతా చేసిన తర్వాత కూడా అమన్ 900 గ్రాములు ఎక్కువగా ఉన్నాడు. ఆ తర్వాత 15 నిమిషాల చొప్పున ఐదు రన్నింగ్ సెషన్‌లు కూడా జరిగాయి. ఎట్టకేలకు అమన్ బరువు 56.9 కేజీలకు చేరింది. అవసరమైన దానికంటే 100 గ్రాములు తక్కువగానే ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మధ్యలో తేనె, నిమ్మరసాన్ని కాస్త వేడినీటిలో కలిపి తాగడంతో పాటు కొంత కాఫీ కూడా అమన్ తాగాడు. రాత్రంతా నిద్రపోకుండా రెజ్లింగ్ వీడియోలు చూస్తూ అతను గడిపాడు. బౌట్‌కు ముందు రోజు బరువు తగ్గించే కార్యక్రమాలు చేయడం తమకు సహజమేనని, అయితే కాస్త ఆందోళనతో ఉంటే బరువు తగ్గడం కష్టంగా మారవచ్చని అమన్ కోచ్ వీరేందర్ దహియా వెల్లడించారు. వినేశ్ విషయంలో అదే జరిగి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. వినేశ్ వయసు (29 ఏళ్లు)తో పోలిస్తే అమన్ వయసు (21 ఏళ్లు) తక్కువ కావడంతో పాటు జన్యుపరమైన కారణాల వల్ల మహిళలకంటే పురుషుల బరువు తగ్గించడం సులువు అవుతుందని కూడా నిపుణులు వెల్లడించారు.

ఖలీఫ్ పసిడి పంచ్

వివాదాల మధ్య పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన అల్జీరియా బాక్సర్



పారిస్: అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమాన్ ఖలీఫ్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 66 కేజీల కేటగిరీలో జరిగిన ఫైనల్లో యాంగ్ ల్యూ (చైనా)ను ఓడించి ఖలీఫ్ తన కెరీర్‌లో తొలి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకుంది. పోటీలు ఆరంభమైనప్పటి నుంచి ఖలీఫ్‌పై వివాదం చెలరేగింది. పేరుకు ఆమె మహిళే అయినా శరీరంలో పురుష లక్షణాలు ఉన్నాయని... గతంలో ఇదే విషయంలో ఆమె నిషేధానికి గురైందని అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. మగాడి తరహాలో ఉన్న బాక్సర్‌ను మహిళల విభాగంలో అనుమతించారంటూ నిర్వాహకులను అంతా తిట్టిపోశారు. అయితే ఐఓసీ మాత్రం ఈ విమర్శలను లెక్క చేయకపోగా... ఖలీఫ్ కూడా ఆ ప్రభావం తనపై పడకుండా వరుసగా గెలుస్తూ పోయింది. ఇప్పుడు స్వర్ణంతో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. 'ఎనిమిదేళ్లుగా ఈ పతకం కోసం కలగన్నా. నేనిప్పుడు ఒలింపిక్ చాంపియన్‌ను. ఎన్నో సూటిపోటి మాటలు ఎదుర్కొన్నాను. అందుకే ఈ గెలుపు నాకు రెట్టింపు ఆనందాన్నిస్తోంది. నాలాంటి పరిస్థితి ఇంకెవరికీ రావద్దు. నేను పుట్టుకతో మహిళను. ఇతర మహిళల్లాగే నేను కూడా. అలాగే జీవిస్తాను కూడా. ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అన్ని రకాలుగా అర్హత ఉన్నదానిని కాబట్టే క్వాలిఫై అయ్యాను' అని కన్నీళ్లపర్యంతమవుతూ ఖలీఫ్ వ్యాఖ్యానించింది. అల్జీరియా దేశ చరిత్రలో ఇది ఏడో స్వర్ణపతకం.

'మహిళల స్వేచ్ఛ'పై నినదించినందుకు...

అఫ్గానిస్తాన్ బ్రేక్ డ్యాన్స్ క్రీడాకారిణిపై వేటు





పారిస్: ఒలింపిక్స్ క్రీడల 'బ్రేకింగ్' (బ్రేక్ డ్యాన్స్) ఈవెంట్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. నెదర్లాండ్స్ ప్లేయర్ ఇండియా సర్జో, ఐఓసీ శరణార్థి టీమ్‌కు చెందిన మనీజా తలాష్ మధ్య ప్రి క్వాలిఫయర్ మ్యాచ్ జరిగింది. ఈ పోరు కొనసాగుతున్న సమయంలో మనీజా అఫ్గనిస్తాన్‌లోని మహిళలను స్వేచ్ఛను ప్రసాదించమంటూ 'ఫ్రీ అఫ్గాన్ ఉమెన్' అంటూ రాసి ఉన్న కేప్‌ను తన డ్రెస్‌పై ధరించి డ్యాన్సింగ్ చేసింది. అయితే రాజకీయపరమైన వ్యాఖ్యలు, నినాదాలు ప్రదర్శించడంపై ఒలింపిక్స్‌లో నిషేధం ఉంది. దాంతో వెంటనే పోటీని నిలిపివేసిన అధికారులు ఆమెను డిస్‌క్వాలిఫై చేస్తున్నట్లు ప్రకటించారు. మనీజా స్వదేశం అఫ్గానిస్తాన్ కాగా... ఆ దేశం తాలిబాన్ల ఆధీనంలోకి వచ్చిన తర్వాత అఫ్గాన్ నుంచి పారిపోయి స్పెయిన్‌లో శరణార్థిగా తలదాచుకుంది. క్రీడల్లో కల నెరవేర్చుకునేందుకు వచ్చానంటూ 21 ఏళ్ల మనీజా తన గురించి చెప్పుకుంది. ఇప్పుడు శరణార్థి జట్టు ద్వారా ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం రాగా, బరిలోకి దిగి తమ మహిళల గురించి ప్రపంచానికి తెలియచెప్పే ప్రయత్నం చేసింది. అయితే ఆమె చేసిన పనికి ఒలింపిక్స్‌లో అనర్హత వేటును ఎదుర్కొంది.

బాధ్యత పెంచిన విజయం



- మా కష్టానికి ఫలితం దక్కింది
- భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్య
- స్వదేశానికి చేరుకున్న జట్టు సభ్యులు
- రూ. 2 కోట్ల 40 లక్షల చెక్ అందజేసిన కేంద్ర క్రీడల మంత్రి

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన భారత పురుషుల హాకీ జట్టుకు ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత పతాకధారిగా వ్యవహరించనున్న గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్‌తో పాటు కొందరు ప్లేయర్లు పారిస్‌లోనే ఉండిపోగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ సహా పలువురు క్రీడాకారులు శనివారం స్వదేశానికి చేరుకున్నారు. దీంతో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం హాకీ అభిమానులతో కిక్కిరిసిపోయింది. 'యావత్ దేశం మా విజయాన్ని ఆస్వాదిస్తోంది. ఈ భావన అద్భుతంగా ఉంది. ఒలింపిక్స్ సమయంలో మాకు అభిమానుల నుంచి విశేష మద్దతు లభించింది. దానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. అభిమానులు చూపుతున్న ప్రేమాభిమానాలు మా బాధ్యతను మరింత పెంచాయి'అని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. బ్రిటన్‌తో క్వార్టర్ ఫైనల్ సందర్భంగా మిడ్‌ఫీల్డర్ అమిత్ రోహిదాస్ 'రెడ్ కార్డ్'కు గురై మైదానాన్ని వీడాల్సి రాగా.. మిగిలిన 10 మందితోనే పోరాడిన భారత జట్టు అద్వితీయ ప్రదర్శనతో సెమీస్ చేరింది. దీనిపై వైస్ కెప్టెన్ హార్దిక్ సింగ్ స్పందిస్తూ.. 'ఇది జట్టులోని సభ్యులందరి పరస్పర నమ్మకానికి సంబంధించిన విషయంలో ఒక ప్లేయర్ లేకున్నా మ్యాచ్ గెలవడం అనేది మామూలు విషయం కాదు. గోల్ పోస్ట్ ముందు పీఆర్ శ్రీజేశ్ అయితే లెక్కకు మిక్కిలిసార్లు మమ్మల్ని కాపాడాడు'అని వివరించాడు.

ప్రేరణ పెంచిన విజయం: మాండవీయా

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల హాకీ జట్టును కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా భారత జట్టుకు కేంద్ర మంత్రి రూ. 2 కోట్ల 40 లక్షల చెక్‌ను అందజేశారు. 'దేశానికి అపారమైన కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. మీ విజయం లక్షలాది మంది యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుంది. మీ ఘనతలు చూసి యావత్ దేశం గర్విస్తోంది. ఈ విజయం మీ పట్టుదల, సమష్టి కృషి, తిరుగులేని స్ఫూర్తికి నిదర్శనం' అని మాండవీయా అన్నారు.

మంచుకొండల్లో శిక్షణ ఫలితాన్నిచ్చింది

పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగడానికి ముందు స్విట్జర్లాండ్‌లోని మంచు కొండల్లో మూడు రోజుల ప్రత్యేక క్యాంప్‌లో పాల్గొనడం తమకెంతో ఉపయోగపడిందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. మంచుకొండల్లో వాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్ జట్టు సభ్యుల్లో అనుబంధాన్ని పెంచేందుకు ఉపయోగపడిందని పేర్కొన్నాడు. ఇక 2011లో భారత క్రికెట్ జట్టు వన్డే ప్రపంచకప్ గెలిచిన సమయంలో టీమిండియా సహాయక బృందంలో కీలక సభ్యుడైన మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ అప్టన్ రాక కూడా తమకు కలిసొచ్చిందని హర్మన్ అన్నాడు. 'ఒకరికి ఒకరు అండగా నిలవడం.. ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందడం. ఇలాంటి చిన్న చిన్న అంశాలే పెద్ద ఫలితాలు తెచ్చాయి. పారిస్ క్రీడల్లో మొదటి మ్యాచ్ నుంచి ఆఖరి వరకు మేమంతా ఒక జట్టుగా ముందుకు సాగాం. ఇందులో ప్యాడీ అప్టన్ పాత్ర కీలకం. అతడి వల్లే స్విట్జర్లాండ్‌లో మూడు రోజుల పాటు ప్రత్యేక క్యాంప్‌కు వెళ్లాం. దాని వల్ల ఆటగాళ్లలో పట్టుదల, పరస్పర విశ్వాసం మరింత పెరిగింది' అని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు.

24 ఏళ్ల తర్వాత...

- ఒలింపిక్స్ పురుషుల మారథాన్‌లో ఇథియోపియా అథ్లెట్‌కు స్వర్ణం
- రేసు పూర్తి చేయలేకపోయిన డిఫెండింగ్ చాంపియన్ కిప్‌చోగే



తమిరాత్ తోలా

పారిస్: ఒలింపిక్స్ క్రీడలు ముగియడానికి ఒక రోజు ముందు ఇథియోపియా జట్టు పసిడి పతకం బోణీ కొట్టింది. పురుషుల మారథాన్ ఈవెంట్‌లో తమిరాత్ తోలా విజేతగా నిలిచి ఇథియోపియాకు తొలి స్వర్ణ పతకాన్ని అందించాడు. శనివారం జరిగిన మారథాన్ రేసులో నిర్ణీత 42.195 కిలోమీటర్ల దూరాన్ని 32 ఏళ్ల తోలా అందరికంటే వేగంగా 2 గంటల 6 నిమిషాల 26 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బషీర్ ఆబ్ది (బెల్జియం; 2గం:06ని:47 సెకన్లు) రజతం... బెన్సన్ కిప్రోతో (కెన్యా; 2గం:7ని:00 సెకన్లు) కాంస్యం సాధించారు. 24 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్ పురుషుల మారథాన్‌లో ఇథియోపియా అథ్లెట్ స్వర్ణ పతకం సాధించడం విశేషం. చివరిసారి 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో ఇథియోపియా అథ్లెట్ గెజాహెగ్నె అబెరా మారథాన్ విజేతగా నిలిచాడు. మరోవైపు మారథాన్‌లో 'హ్యాట్రిక్' ఒలింపిక్ స్వర్ణం లక్ష్యంగా బరిలోకి దిగిన కెన్యా దిగ్గజం ఎలూడ్ కిప్‌చోగే అనూహ్యంగా విఫలమయ్యాడు. 40 ఏళ్ల కిప్‌చోగే 30 కిలోమీటర్లు పరుగెత్తాక రేసు నుంచి వైదొలిగాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగే స్వర్ణ పతకాలు సాధించాడు. కిప్‌చోగే 'పారిస్'లోనూ విజేతగా నిలిచింటే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో మూడు బంగారు పతకాలు నెగ్గిన తొలి అథ్లెట్‌గా కొత్త చరిత్ర సృష్టించేవాడు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	37	27	24	88
2	అమెరికా	35	41	41	117
3	ఆస్ట్రేలియా	18	18	14	50
4	జపాన్	16	12	13	41
5	ఫ్రాన్స్	15	22	22	59
6	బ్రిటన్	14	20	25	59
7	దక్షిణ కొరియా	13	8	8	29
8	నెదర్లాండ్స్	13	6	11	30
9	జర్మనీ	12	10	8	30
10	ఇటలీ	11	13	15	39
11	కెనడా	8	7	11	26
70	భారత్	0	1	5	6

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

బింద్రాకు 'ఒలింపిక్ ఆర్డర్'



పారిస్: ఒలింపిక్స్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారతీయుడైన షూటర్ అభినవ్ బింద్రాను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సముచిత రీతిలో గౌరవించింది. స్వర్ణం సాధించడంతో పాటు ఒలింపిక్ ఉద్యమాన్ని విస్తృతపర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు బింద్రాకు 'ఒలింపిక్ ఆర్డర్'ను అందజేసింది. ఒలింపిక్ క్రీడల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఆటల ద్వారా ప్రపంచవ్యాప్తంగా సుహృద్భావ వాతావరణం నెలకొల్పడంతో ఒలింపిక్ ఉద్యమం పాత్ర ఉంది. 1975 నుంచి ఈ ఒలింపిక్ ఆర్డర్‌ను అందజేస్తున్నారు. ఐఓసీ 142వ సెషన్ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ థామస్ బాక్ ఈ అవార్డును బింద్రాకు అందజేశారు.

ఇక సౌకర్యాలు లేవని చెబితే కుదరదు

పీఆర్ శ్రీజేశ్

ఒలింపిక్స్ చరిత్రలో ఘనమైన రికార్డు ఉన్న భారత హాకీ జట్టు 'పారిస్' క్రీడల్లోనూ దాన్ని కొనసాగించింది. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లతో తలపడి కాంస్యం పతకం సాధించడం ఆనందంగా ఉంది. సహచరుల నుంచి ఇంతకు మించిన వీడ్కోలు బహుమతి అడగలేను. రెండు దశాబ్దాలకు పైగా జట్టుతో ఉన్నా. ఇప్పుడిక యువతరానికి పాఠాలు చెబుతా. వ్యక్తిగత అనుభవాన్ని పంచుకోవడం ద్వారా యువ ఆటగాళ్లలో స్థయిర్యం నింపే ప్రయత్నం చేస్తా. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగిందనుకుంటున్నా. పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో యువ షూటర్ మనూ భాకర్‌తో కలిసి త్రివర్ణ పతాకధారిగా వ్యవహరించనున్నా. మనూ నాకంటే 14 ఏళ్లు చిన్నది. అయినా ఆమె విశ్వక్రీడల్లో అద్భుతాలు చేసింది. ప్రతి అథ్లెట్ ఏకైక లక్ష్యం దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడమే. అది మనూలో సమృద్ధిగా ఉంది. 2012 లండన్ ఒలింపిక్స్‌తో నా విశ్వక్రీడల ప్రయాణం ప్రారంభమైంది. ఈ పుష్కర కాలంలో క్రీడలకు ప్రోత్సాహం ఎలా మారిందో నేను ప్రత్యక్షంగా చూశాను. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు సరైన సౌకర్యాలు లేవని సాకులు చెప్పే అవకాశమే లేదు.

హాకీలో సాధించిన పతకం కోట్లాది మంది భారతీయుల సమష్టితత్వానికి నిదర్శనమని ప్రధాని అన్నప్పుడు... గర్వంతో నరాలు ఉప్పొంగాయి. పారిస్ క్రీడల్లో బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో మా జట్టు కలిసికట్టుగా ఆడిన తీరు అద్భుతం. దాదాపు 75 శాతం సమయం కేవలం 10 మందితోనే ఆడాం. ఆ పట్టుదలే ఇక్కడి వరకు చేర్చింది. మన జట్టులో ఐదుగురు ఆటగాళ్లు ఇప్పుడే వాళ్ల ప్రయాణాన్ని ప్రారంభించగా... మిగిలిన 11 మంది టోక్యో ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్నారు. ప్రపంచంలోనే మేటి జట్లతో పోటీపడేందుకు బెంగళూరులోనూ 'సాయ్' శిక్షణ కేంద్రం మాకు అన్ని విధాలుగా సహాయపడింది. గత పదిహేనేళ్లుగా ఈ కేంద్రమే నా ఇల్లు. కుటుంబ సభ్యులతో కన్నా అక్కడే ఎక్కువ గడిపా. అంతర్జాతీయ స్థాయి జిమ్, పారిస్‌లో మాదిరి సరికొత్త టర్ఫ్ ఇలా... ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసింది. ఈ విజయంలో సహాయక సిబ్బంది పాత్ర కూడా మరవలేనిది. కోచ్ క్రెయిగ్ ఫల్టన్ జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా ఆటగాళ్లందరికి ఒక్క తాటిపై నడిపించారు. 'ఖేలో ఇండియా' వ్యవస్థ భవిష్యత్తును మరింత మెరుగు పరుస్తుందని ఆశిస్తున్నా.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



38 yrs/ Govt. ఎంప్లాయ్ / 4,50,000/- (pm) / వెరీ వెల్ అందమైన వరుడికి తగిన వధువు కావలెను. (కుల పట్టింపు లేదు పిల్లలు ఉన్నా OK) సంప్ర : 8332006483 [H-796669]

విశ్వబ్రాహ్మణ/ B.Tech / Govt. Asst. ఇంజినీర్ /జీవో/ 10 Lakhs PA / 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15798]

వడ్డెర/కట్నప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 80,000 PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15798]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నప్రసక్తి లేదు/ M.Tech, IT / C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI/ 85,000 PM/5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093, 6304407230 [HA-15798]

వడ్డెర/కట్నప్రసక్తి లేదు/ M.Tech/ C.Govt. Asst. మేనేజర్/ FCI / 80,000 PM/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15798]

గౌడ/B.Tech (ECE)/ Govt. ఇంజినీర్/ R&B Dept./ 9.2 Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550572571 [HA-15798]

పద్మశాలి/ కట్నప్రసక్తి లేదు/ M.Tech/ C. Govt. మెకానికల్ ఇంజినీర్/ రైల్వే/1 Lakh PM/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15798]

క్రిస్టియన్ మాదిగ/M.Tech / C.Govt. ఇన్‌స్పెక్టర్/ కస్టమ్స్ Dept./ 70,000/- PM/ 6' ఎత్తు/ 30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-15798]

యాదవ/B.Tech (ECE) / C.Govt. డివిజనల్ ఆఫీసర్/ మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్/ 80,000/- PM/ 5' 11" ఎత్తు/ 30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15798]

యాదవ/కట్న ప్రసక్తిలేదు/B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్ / యూనియన్ బ్యాంక్ / 80,000/- PM/ 5'10" ఎత్తు/ 29 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7075953400 [HA-16336]

BC / 39/5'9"/ MA Eng., MA B.Ed/ Pvt. Job/ 5L PA, సొంత బంగ్లా, బాగా స్థిరపడిన బాదరాబందీలేని వరునికి స్థిరపడిన 1/2వ వధువు కావలెను. CNB డైరెక్ట్. 9573943211, 8125132949 [HA-16336]

SC మాల & క్రిస్టియన్: B.Tech/ C.Govt. మేనేజర్/యూనియన్ బ్యాంక్/85,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [H-15797]

మాదిగ: 30/5'11"/ B.Tech, Job/ SWE Sal 20-L P/A Only Son Well Settild in Hyd వరునికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-14425]

మాల: 32/5'9"/ B.Tech, IIT/ 25-L P/A SWE Job Settild in Hyd బాగా స్థిరపడిన వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9390933661 [H-14425]

ఆర్యవైశ్య: 29/5'9" / B.TECH, MBA. SWE Job 20-L P/A Well Settild వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8897091964 [H-14425]

గంగపుత్ర(బెస్త): 29/5'8"/ M.Tech, Govt.Job 18-L P/A Own House వరునికి తగిన వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9581616774 [H-14425]

కుల పట్టింపు లేదు: Age: 35 లోపు విడో డాక్టర్ అమ్మాయి కావాలి. ఆసక్తికలిగినవారు సంప్రదించండి. డైరెక్ట్ పేరెంట్ ✆: 9705135074. [Z-1080808]

★

విశ్వ బ్రాహ్మణ/42/విడోయర్/25000/- Hydలో 80 లక్షల సొంత ఇల్లు గల వరునికి అందమైన వధువు కావలెను. డైరెక్ట్. 9059397210 [HA-98148]

2వ పెళ్ళి/SC మాల (M.Com, MBA) 54yrs, C.Govt VRS 70,000/- pm స్వంత ఇల్లు, కుల ప్రసక్తి లేని వధువు కావలెను. 9703177245 [HA-98154]

No Brokers: డైవర్స్‌డ్, 44, BC-D, MA, B.Ed, 30K, ప్రైవేట్ టీచర్, ఇల్లు, పిల్లలు లేని వరునికి పిల్లలు లేని 2వ వధువు కావలెను. కులం, డబ్బు ప్రసక్తి లేదు. WGL. 9392850846. [W-1239832]

★★

రాజులు, సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం, సొంత ఇల్లు, 2వ పెళ్ళి, 46 సం॥లు, బాగా స్థిరపడిన వరునకు సంప్రదాయమైన వధువు కావలెను. 96520 16569 (డైరెక్ట్) [B-1239348]

డైరెక్ట్/ 45 / ప్రభుత్వ ఉద్యోగము చేయుచున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి, ప్రసక్తి లేని వధువు పెళ్ళి కొరకు కావలెను. డైరెక్ట్–Ph: 83417 12438. [L-796435]

OC వయస్సు : 48, బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 తగిన OC వెల్‌సెటిల్ వధువు కావలెను. (డైరెక్ట్) సంప్రదించండి : 94908 78646 [P-749611]

కాపు, 30Yrs, 2వ పెళ్లి, ప్రైవేట్ జాబ్ నెలకు 18000/- , 2 సొంత ఇల్లులు. కుల, ఆస్తి పట్టింపు లేదు. పిల్లలు లేని వధువు కావలెను. ఫోన్: 76750 72871, 87907 27171 [V-823320]

వరుడు కావలెను



రెడ్డి 2nd మ్యారేజ్ / కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/డిగ్రీ, ఎత్తు 5'4" / బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1/2వ (ఇల్లరికం OK) అన్నికులాల వారికి సంబంధములు కలవు. Ph: 9063774658 [HA-16336]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ (Christian) B.Tech/ MBA/ Builder/Hyd/1995/5'11"/100Cr *1996/ 5'11"/150Cr *1991/6'/55Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Business/B.Tech/MBA * 1990/ 5'11"/200Cr *1995/5'7"/1000Cr *1995/ 6"/150Cr *1994/5'10"/100Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Business/B.Tech/MBA/*1994/ 5'11"/250Cr *1995/6'/100Cr *1990/6'/ 1000Cr *1989/5'11"/400Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/IIT/BITS/India *1996/ 5'7"/ 15Cr *1998/6'/50L/yr/10Cr *1997/5'10" 35L/yr/ 30Cr *1994/5'9"/ 1Cr/yr/30Cr * Cont: K.C. Reddy-Hyd.Ph: 9849321309

Reddy/MBBS/PG/DM *1994/5'9"/30Cr * 1996/6'/50Cr *1995/5'10"/200Cr *1994/ 5'10"/ 75Cr *1993/5'10"/50Cr *1989/5'9"/30Cr *Cont:K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/MBBS/PG/Doctors-USA *1990/ 6'/50Cr *1995/5'8"/10Cr *1992/5'11" 10Cr *1990/5'10"/400Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/IIT/BITS/MS/H1/USA *1995/ 5'7" /300K/10Cr *1993/5'9"/200K/20Cr *1995/ 6'/200K/20Cr *1991/5'10"/200K *Cont : K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA/RICH *1997/ 5'9"/60Cr *1995/5'10"/70Cr *1997/6'/400Cr *1990/5'7"/50Cr *1991/5'11"/140K/200Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

Reddy/(Aus-PR) Holder *B.Tech/MS/ 1993/100K/10Cr *1994/5'11"/50Cr *1994/ 5'10"/120K/ 50Cr (CANADA) PR *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee *B.Tech/ Business/ Hyd/1994/5'11"/300Cr *MS/ H1/USA/1995/ 5'9"170K/25Cr *1981/5'8"/500Cr * Cont. K.C. Reddy- Hyd-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech/Most Beautiful/Rich Family/*1999/5'7"/100Cr *1993/ 5'3"/ 500Cr *1997/5'4"/150Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Rich *1995/5'8"/100Cr * 1994 /5'3"/ 200Cr *1998/5'5"/100Cr *1993/5'7"/100Cr *1988 /5'3"/ 200Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/Most Beautiful *1995 / 5'5"/100Cr *1996/5'4"/50Cr *1994/ 5'5"/15Cr *1995/5'5"/70Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful *1991/ 5'7"/10Cr *1997/5'5"/25Cr *1996/5'7"/50 Cr *1999/5'7"/25Cr * Cont : K.C.Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/PG/DM *1994/5'6"/100Cr *1995 /5'5"/ 100Cr *1998/5'7"/50Cr * 1993/5'3"/50Cr *1990/5'6"/100Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/MBBS/PG *1994/5'5"/50Cr * 1994 /5'10"/ 50Cr *2000/5'6"/100Cr *1993/ 5'2"/20Cr *1997/5'6"/400Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1997/ 5'5"/ 60Cr *1998/5'4"/10Cr *1999/5'6"/ 100Cr *1997/5'5"/10Cr *1996/5'8"/15Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/MBBS/PG/Doctors USA *1997/ 5'6" *1995/5'7"/*1996/5'2" *1996/5'8"/ 40Cr *1992/5'4"/15Cr *1987/5'4"/10Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/USA-Citizen Girls *B.Sc/ 1989/ 5'4" *MS/1999/5'6"/50Cr *1995/ 5'6" *1994/5'2" *MD/1995/5'7"/ * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee *MBBS/MD *1992/ 5'3"/ 9Cr *1994/5'5"/50Cr *1986/5'6"/ 50Cr *1993/5'8"40Cr *B.Tech/ 1985/5'5"/400Cr * Cont: K.C.Reddy-Hyd.Ph: 9849321309

[D-550]

కాపు/42yr/ఫెయిర్/కుల పట్టింపు లేదు/Govt ఎంప్లాయ్/90K (PM)/ వెల్ సెటిల్డ్ 2 సొంత ఇల్లులు & ప్రాపర్టీస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యాచ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-796669]

కుల, ఆస్తి పట్టింపు లేదు/విడో/45y/Dept of IT & EC/మంచి జీతం/సొంత ఇల్లు/21 Acr Lands/కోట్ల ప్రాపర్టీ కలిగిన వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. 9032670876 [H-782760]

వయస్సు 35y/ఎత్తు 5'5" /గవర్నమెంట్ జాబ్/1.5 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 7893409985 [H-782760]

రెడ్డి/విడో / 50y / ఒంగోలు / Govt. Job/ Own House (Rents) Well Settled ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 8519803423 [H-782760]

36 yrs/Govt.ఎంప్లాయ్/3,00,000/-(pm)/ వెల్ సెటిల్డ్ / కుల పట్టింపు లేని స్థిరాస్తులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. Any (Profession & ఇల్లరికం OK) సంప్ర : 9133715309 [H-796669]

రెడ్డి/48yr/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/3,50,000/- (PM)/వెల్ సెటిల్డ్ & 4 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-796669]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, 100 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Analyst, 61 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 11", SWE, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Hyderabad, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE (BITS), MS, 27, 5' 8", SWE, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 5", Wipro, 25 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, Amazon, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 27, 5' 7", Sr. Associate, 30 L P/A, Hyd, Fair & Slim Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, ME, MS, 27, 5' 10", Developer, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 28, 6' 1", Hyderabad, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 31, 6' 1", PG Doctor, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 9", SWE, Apple, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MBA, 27, 5' 5", L & T, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", SWE, 126 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 8", PG Doctor, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", SWE, 11 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్ళి/50y/ విడో/ సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/ సొంత ప్రాపర్టీ /ఎలాంటి బాదరబందీ లేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-796669]

వైశ్య/50y / విడో / Govt.Job /Cement Factory/Shopping Mall/30 Acres Land/5 Lac Income గల వధువుకి FC/ BC వరుడు కావలెను. Ph: 8374415657 [H-796332]

రెడ్డి/విడో/49yrs/5'5"/V.Fair/Govt HM/సొంత ఇల్లు & రెంట్స్/28 ఎకరాల మండ్ల తోటలు/3 L/PM/పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-796332]

బ్రాహ్మిణ్స్/విడో /49y/5'3"/డిగ్రీ/పంచాయతీరాజ్ VRS/ఆంధ్రాలో 3 ఎకరాల కొబ్బరితోటలు గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7288012534 [H-796332]

హిందూ మాల/ B.Tech/Central Govt. Asst. Manager/SBI Bank/11 Laks P.A/ 5'5"/ 25 సం॥లు/అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9392412324 [H-796332]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/3,50,000/- PM/కోట్ల ప్రాపర్టీ కలిగిన, బాగా స్థిరపడిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. ఇల్లరికం OK (పిల్లలున్నా OK) Ph: 9381696641 [H-796332]

మంచి గుణము, అందము, తెలుపు. ఆస్తి: 20 కోట్లు. రెడ్డి/1997/5'4"/MBA గోల్డ్ మెడలిస్ట్, ఓపెన్ మైండ్ కలిగిన వారైన వరుడు కావలెను. వెరీ వెరీ అర్జెంట్. వాట్సాప్ : 8187053655, 6303293337 [HA-16334]

SC మాల / B.Tech / Govt. గ్రూప్ – I ఆఫీసర్/ కమర్షియల్ ట్యాక్స్ Dept/70,000/- PM/5'5" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 8897389698 [HA-16334]

యాదవ/CA / చార్టెడ్ అకౌంటెంట్ / 60,000/-PM/5'4" ఎత్తు/39 సం॥ల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9963757612 [HA-16334]

క్రిస్టియన్/2వ పెళ్ళి/కులప్రసక్తి లేదు/ B.Sc, B.Ed /Govt. స్కూల్ టీచర్/ 60,000/-PM/5'4" ఎత్తు/36 సం॥ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-16334]

బ్రాహ్మణ /24/5'3"/B.Sc *27/5'4"/ MBA *30/ 5'3"/ B.Sc *27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరుల కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842635086 [HA-16334]

యాదవ/ఏకైక కుమార్తె / B.Tech, IIT / C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 65,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9515755529 [HA-15798]

రజక/B.Tech / Govt. Jr. Asst./ పంచాయతీ రాజ్ Dept./ 45,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15798]

రజక/B. Sc/ Govt. AEO/ అగ్రికల్చర్ Dept./ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16336]

రెడ్డి/35yr/5'5"/ ఫెయిర్/ కుల పట్టింపులేదు/ PG/ Govt. ఎంప్లాయ్ 85K (PM), వెల్‌సెటిల్డ్ & 2 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st & 2nd మ్యాచ్ & ఇల్లరికం OK). సంప్ర: 9133672661 [HA-16336]

రెడ్డి 2nd/విడో/32y/ B.Com / సొంత ఇల్లు/ బిజినెస్/ ప్రాపర్టీలు/ వెల్‌సెటిల్డ్ అందమైన వధువుకి 1/2వ వరుడు కావలెను. (ఇల్లరికం OK) (కుల/మత/ఆస్తి ప్రసక్తిలేదు). Ph: 9392332143 [HA-16336]

SC మాల/23/5'5"/ M.Tech (NIT), డిప్యూటీ మేనేజర్ (Tech) RAILTEL (C. Govt.), 70,000/- PM వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Any Software Or Govt. Ph: 8977233346 [HA-16336]

రెడ్డి/విడో/ కుల, ఆస్తి ప్రసక్తిలేదు/35y/ B.Com / Pvt. Job గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం అయినా OK) All Caste Marriages Available. Ph: 8121347478 [HA-16336]

క్రిస్టియన్ మాల: 1Cr. ఆస్తి/M.Tech/ C.Govt. Asst. మేనేజర్/ SBI/ 80,000/- pm/ 5'4" ఎత్తు / 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [H-15797]

రజక: / B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్/ SBI/ 45,000/- PM/5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [H-15797]

గంగపుత్ర: బెస్త, అగ్నికుల క్షత్రియ /B.Tech, IT/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్ / ఎయిర్‌పోర్ట్/ 60,000/-PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [H-15797]

SC హిందుమాదిగ: ఏకైక కుమార్తె/M.Sc. Agri/ Govt.AEO/అగ్రికల్చర్ Dept/60,000/– PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6305007091 [H-15797]

CND IInd Match కాపు: 42/5'4"/MBA సెంట్రల్ Govt Job 10-L P/A, Own House అందమైన వధువుకు వరుడు కావలెను. (No Issues) Ph: 7702195227 [H-14425]

కుల పట్టింపు లేదు/21y&23y& 25y&26y& 27y&29y& 30y&31y&33y&35y&37y& 39y&40y& 41y& 43y& 45y&47y&49y& 50y& "మా సేవ" (Since 1998): Ph: 8977385481 [HA-16337]

★★

కుల పట్టింపు లేదు/34/5'1"/ B.Tech/ F1 USA *37/5'6"/MBBS, MS OBG/Consultant *29/ 5'4"/ MBBS/MD General *39/5'4"/B.Tech MS/Google / 130K/USA * అమ్మాయిలకు తగిన వరుల కావలెను. సంప్ర: S.రాములు గౌడ్ 8790690309 "శుభమస్తు" DSNR, HYD. [H-796333]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782760]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [H-782760]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్–I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph:7396915712 [HA-16336]

స్పెషల్టీ డాక్టర్స్ (15 వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & డాక్టర్స్‌కి మాత్రమే. 1వ, 2వ, లేటు దేశ, విదేశీ సంబంధాలు అన్నికులములకు కుదుర్చబడును. Ph: 9866411588 [HA-16336]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Balu, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16335]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16335]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Balu, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16335]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16335]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Balu, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16335]

దేవి మ్యారేజి బ్యూరో: అన్ని కులముల వారికి వివాహములు కుదుర్చబడును. మెయిన్‌రోడ్, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా. ✆ 88972 39849. [B-1239415]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

ధ్రువ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూపబడును. Age: 18–70 సం.లు. Ph: 7702955854 [HA-15785]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9494809254 (Whatsapp) [HA-986]

సాక్షి స్పోర్ట్స్




చైనా అద్భుతం... రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో తొలిసారి స్వర్ణం

పారిస్ ఒలింపిక్స్ పతకాల పట్టికలో ముందు వరుసలో దూసుకెళుతున్న చైనా మరో రికార్డు సొంతం చేసుకుంది. రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణం గెలిచిన తొలి యూరోపేతర జట్టుగా చైనా నిలిచింది. ఒలింపిక్స్ రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో ఇప్పటి వరకు యూరప్ దేశాల ఆధిపత్యం కొనసాగుతుండగా... శనివారం చైనా మహిళల జట్టు దానికి గండి కొడుతూ పసిడి పతకం కైవసం చేసుకుంది. ఐదుగురు సభ్యులతో కూడిన చైనా టీమ్ ఫైనల్లో 69.800 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. హూప్స్, రిబ్బన్స్, బాల్స్ విభాగాల్లో చైనా జిమ్నాస్ట్‌లు చక్కటి ప్రదర్శన కనబర్చారు. ఇజ్రాయిల్ (68.850 పాయింట్లు), ఇటలీ (68.100 పాయింట్లు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నాయి. డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ బల్గేరియా నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్ రిథమిక్స్ జిమ్నాస్టిక్స్‌లో రజతం గెలిచిన చైనా ఈసారి పసిడి పతకం సాధించింది.

నఫీసాటు సంచలనం

- హెప్టాథ్లాన్‌లో 'హ్యాట్రిక్' స్వర్ణం
- ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి క్రీడాకారిణిగా రికార్డు











పారిస్: ఒక్క క్రీడాంశంలో పోటీపడి ఒలింపిక్ పతకం గెలవాలంటేనే ఎన్నో ఏళ్ల శ్రమించాల్సి ఉంటుంది. అలాంటిది ఒకే ఈవెంట్‌లో ఏడు క్రీడాంశాలు ఉంటే ఎంత కష్టపడాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో బెల్జియం క్రీడాకారిణి నఫీసాటు థియామ్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే. ఏడు క్రీడాంశాల సమాహారమైన 'హెప్టాథ్లాన్'లో ఆమె వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ తమ ఆధిపత్యాన్ని చాటుకొని స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ఒలింపిక్స్ చరిత్రలో హెప్టాథ్లాన్‌లో మూడు స్వర్ణాలు గెలిచిన ఏకైక క్రీడాకారిణిగా నఫీసాటు థియామ్ కొత్త చరిత్ర లిఖించింది. హెప్టాథ్లాన్‌లో 100 మీటర్ల హర్డిల్స్ రేసు, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్ల రేసు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్ల రేసు ఉంటాయి. ఈ ఏడింటిలో ఆయా అథ్లెట్స్ సాధించిన పాయింట్ల ఆధారంగా టాప్–3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందజేస్తారు. పారిస్ ఒలింపిక్స్‌లో 29 ఏళ్ల నఫీసాటు 6880 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ నఫీసాటు పసిడి పతకాలు సాధించింది. ప్రస్తుత వరల్డ్ చాంపియన్ కాటరీనా జాన్సన్ థాంప్సన్ (బ్రిటన్; 6844 పాయింట్లు) రజతం, నూర్ విడిట్స్ (బెల్జియం; 6707 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు.

అజేయ అమెరికా

- ఒలింపిక్స్ మహిళల బాస్కెట్‌బాల్‌లో వరుసగా 60వ విజయం
- 1992 క్రీడల నుంచి పరాజయం ఎరుగని జట్టుగా రికార్డు
- ఎనిమిదో స్వర్ణానికి గెలుపు దూరంలో అగ్రరాజ్యం



ఒలింపిక్స్ చరిత్రలో మరే జట్టుకు సాధ్యం కాని రికార్డును అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు సొంతం చేసుకుంది. 1992 బార్సిలోనా ఒలింపిక్స్ నుంచి మొదలుకొని ఇప్పటి వరకు విశ్వ క్రీడల్లో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు పరాజయం అన్నదే ఎరగకుండా దూసుకెళుతోంది. ఈ క్రమంలో వరుసగా 60 మ్యాచ్‌లు గెలవడం విశేషం. 'పారిస్' క్రీడల్లో ఫైనల్ చేరడం ద్వారా అమెరికా ఈ ఘనత సాధించింది. శనివారం జరిగిన మహిళల సెమీఫైనల్లో అమెరికా 85–64తో ఆస్ట్రేలియాపై గెలిచి ఫైనల్‌కు చేరింది. నేడు ఫ్రాన్స్‌తో స్వర్ణం కోసం తలపడనుంది. ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో అమెరికా మహిళల బాస్కెట్‌బాల్ జట్టు వరుసగా ఏడు స్వర్ణాలు గెలిచింది. ఈసారి కూడా పసిడి కైవసం చేసుకుంటే.. విశ్వక్రీడల చరిత్రలో వరుసగా 8 బంగారు పతకాలు గెలిచిన తొలి టీమ్‌గా చరిత్ర కెక్కనుంది.



పారిస్ ఒలింపిక్స్ మహిళల ఫుట్‌బాల్‌లో విజేతగా నిలిచిన అమెరికా జట్టు. ఫైనల్లో అమెరికా 1–0 తేడాతో బ్రెజిల్ జట్టును ఓడించి ఒలింపిక్స్‌లో ఐదోసారి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.

డైవింగ్‌లో చైనా క్లీన్‌స్వీప్



పారిస్ ఒలింపిక్స్ డైవింగ్ క్రీడాంశంలో చైనా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. అక్వాటిక్ సెంటర్‌లో అద్భుతాలు చేసిన చైనా డైవర్లు రికార్డు స్థాయిలో ఎనిమిది స్వర్ణాలతో ఈ విభాగంలో అందుబాటులో ఉన్న అన్ని పసిడి పతకాలను తమ ఖాతాలో వేసుకున్నారు. శనివారం పురుషుల 10 మీటర్ల ప్లాట్‌ఫామ్ ఫైనల్లో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ కావో యున్ (చైనా) 547.50 పాయింట్లతో టాప్ ర్యాంక్ దక్కించుకున్నాడు. తద్వారా ఒలింపిక్స్ డైవింగ్‌లో 1988 తర్వాత స్వర్ణం నిలబెట్టుకున్న మొదటి స్విమ్మర్‌గా కావో యున్ నిలిచాడు. అమెరికాకు చెందిన గ్రెగ్ లుగానిస్ 1984 లాస్ ఏంజెలెస్, 1988 సియోల్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు నెగ్గాడు. తమాయి రికుటో (జపాన్; 507.65 పాయింట్లు), విలియమ్స్ నోహ్ (గ్రేట్ బ్రిటన్; 497.35 పాయింట్లు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. గతంలో ఎనిమిదింట ఏడు పతకాలు నెగ్గిన చైనా... ఈసారి మాత్రం క్లీన్‌స్వీప్ చేసింది. 'పారిస్' క్రీడల్లో డైవింగ్ విభాగంలో జరిగిన మహిళల 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, పురుషుల 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, మహిళల 10 మీటర్ల ప్లాట్‌ఫామ్, పురుషుల సింక్రనైజ్డ్ 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, మహిళల సింక్రనైజ్డ్ 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, మహిళల సింక్రనైజ్డ్ 10 మీటర్ల ప్లాట్‌ఫామ్, పురుషుల సింక్రనైజ్డ్ 10 మీటర్ల ప్లాట్‌ఫామ్ పోటీల్లో చైనా స్విమ్మర్లు అగ్రస్థానాల్లో నిలిచి పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. చైనా డైవర్లు ఈ ఎనిమిది విభాగాల్లో స్వర్ణాలే కాకుండా.. మరో రెండు రజతాలు, ఒక కాంస్యం కూడా గెలిచి మొత్తంగా డైవింగ్‌లోనే 11 పతకాలు పట్టారు.

క్లుప్తంగా...

నేడు నీట్ పీజీ-2024



సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్-పోస్ట్ గ్రాడ్యుయేషన్(నీట్-పీజీ)2024ను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) నేడు నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా 185 నగరాల్లో నిర్వహించే పరీక్షకు 2 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ రెండో షిఫ్ట్ ఇలా రెండు షిఫ్ట్‌లలో పరీక్ష ఉంటుంది. మొదటి షిఫ్ట్‌లో ఉదయం 8.30 గంటల వరకూ, రెండో షిఫ్ట్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకూ మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. గడువు ముగిశాక ఏ ఒక్కరిని లోపలికి అనుమతించరు.

ఈదురు గాలులు.. తేలికపాటి వానలు

- వాతావరణ కేంద్రం సూచన



సాక్షి, విశాఖపట్నం: దక్షిణ కర్ణాటక సమీపంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ద్రోణి కొమొరిన్ ప్రాంతం వరకూ విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని తీర ప్రాంతంలో ఈదురు గాలులు, అక్కడక్కడ తేలికపాటి వానలు కురిసే సూచనలున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధంగా.. దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపారు.

తిరుత్తణిలో ఆంధ్ర విద్యార్థి మృతి

- కదులుతున్న రైలు ఎక్కబోయి జారిపడ్డ హర్షవర్ధన్
- శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే దుర్మరణం



హర్షవర్ధన్ (ఫైల్)

తిరుత్తణి: కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు దాని కిందపడి ఆంధ్ర విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటన తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన హర్షవర్ధన్ (22) తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలలోని మిత్రులతో కలిసి కాంచీపురం కామాక్షమ్మ గుడికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పాండిచ్చేరి నుంచి తిరుపతికి వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలు తిరుత్తణి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం -1లో ఆగి ఉన్న సమయంలో ఫుట్‌బోర్డుపై ఉన్న హర్షవర్ధన్ కిందకి దిగాడు. రైలు మళ్లీ బయలుదేరడంతో హర్షవర్ధన్ పరిగెత్తుకుంటూ వచ్చి రైలు ఎక్కబోయాడు. కాలు జారడంతో రైలు చక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు. సమాచారం అందుకున్న అరక్కోణం రైల్వే పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఒప్పందం పునరుద్ధరణ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఒప్పందాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ మొత్తం 3,619 మంది కాంట్రాక్టు లెక్చరర్లు జూన్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు (11 నెలలు) కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

మన విద్యా సంస్థల్లోనూ ప్రపంచ శ్రేణి నైపుణ్యాలు!



- అందుకే ఐఐటీ మద్రాస్‌కు రూ.228 కోట్ల విరాళం ఇచ్చా
- మనదేశంలోనూ అత్యున్నత విద్యాసంస్థలు ఉన్నాయి
- విదేశాల్లో చదువుకున్నా.. యువత దేశానికి తిరిగి రావాలి
- భారత్‌లోనూ ఇప్పుడు ఎన్నో అవకాశాలు
- విద్యారంగం అభివృద్ధి.. దేశాభివృద్ధికి కారకం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రవాసాంధ్ర పారిశ్రామికవేత్త, ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి డాక్టర్ కృష్ణ చివుకుల

ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా.. మన మాతృభూమిని మరవకూడదు. ఉన్నత స్థానాల్లో ఉన్నవారు.. జన్మభూమికి సేవ చేసేందుకు ముందుకు రావాలి. ముఖ్యంగా విద్యా రంగంలో చేసే సేవ.. భవిష్యత్తులో దేశాభివృద్ధికి తోడ్పడుతుంది. ఇదే ఉద్దేశంతో ఐఐటీ మద్రాస్‌కు రూ.228 కోట్ల విరాళమిచ్చాను. అదే విధంగా పాఠశాల స్థాయిలోనూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను' అని అంటున్నారు.. ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్ర పారిశ్రామికవేత్త డాక్టర్ కృష్ణ చివుకుల. ఇంత భారీ విరాళంతో మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఆయనతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

కృష్ణ చివుకుల గురించి..

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో జన్మించారు. విద్యాభ్యాసం విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఎంతో పట్టుదలతో ఐఐటీ బాంబే నుంచి బీటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్), ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ (ఏరోనాటికల్ ఇంజనీరింగ్) పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నారు. తుమకూరు యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. 1976లో అమెరికాలోని హాఫ్‌మన్ ఇండస్ట్రీస్‌లో చీఫ్ ఇంజనీర్‌గా కెరీర్ ప్రారంభించారు. 1990లో న్యూయార్క్‌లో శివ టెక్నాలజీస్ పేరుతో సొంత సంస్థను స్థాపించారు. 1997లో.. ఇండో-యూఎస్ ఎంఐఎం టెక్నాలజీ పేరుతో మరో సంస్థను నెలకొల్పారు. దీన్ని మెటల్ ఇంజక్షన్ మోడలింగ్‌లో ప్రపంచంలోనే పేరొందిన సంస్థగా తీర్చిదిద్దారు.

ఎంతో కొంత తిరిగివ్వాలి..

1 మనం పుట్టి పెరిగి, మన అభివృద్ధికి పునాది వేసిన మాతృభూమికి.. ఎంతో కొంత తిరిగివ్వాలి అనేది నా ఉద్దేశం. దీనివల్ల భవిష్యత్తు తరాలు ఎదిగే అవకాశం కలుగుతుంది. ఇదే ఉద్దేశంతో నేను ఐఐటీ మద్రాస్‌కు విరాళమిచ్చాను. 74 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యంగా ఉన్నాను. మా సంస్థ నంబర్‌వన్ పరిశ్రమగా ముందుకెళుతోంది. ఆదాయం విషయంలో ఆందోళన లేదు. అందుకే.. నేను చదివిన ఐఐటీ మద్రాస్‌కు, అక్కడి విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడేలా విరాళమిచ్చాను.

విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తే దేశాభివృద్ధికి తోడ్పడినట్టే..

2 విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తే.. భవిష్యత్తులో అది దేశాభివృద్ధికి తోడ్పడుతుందనేది నా నమ్మకం. ఎందరో విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ.. ఆర్థిక ఇబ్బందులతో.. ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ఇలాంటి వారికి తోడ్పడితే ఉన్నత విద్యావంతులుగా రూపొందుతారు. తద్వారా నిపుణులైన మానవ వనరుల కొరత కూడా తీరుతుంది. ఇది సంస్థల అభివృద్ధికి, తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది. ఇతర పారిశ్రామికవేత్తలు కూడా ఈ విషయాన్ని గుర్తించాలని ఆశిస్తున్నాను.

స్వదేశంలో చదువులకే ప్రాధాన్యమివ్వాలి..

3 ప్రస్తుతం లక్షల మంది విద్యార్థులు.. విదేశీ విద్య కోసం యూఎస్, యూకే వంటి దేశాలకు వెళుతున్నారు. అయితే ఇప్పుడు మన విద్యా సంస్థల్లోనూ ప్రపంచ శ్రేణి నైపుణ్యాలు ఉన్నాయి. కాబట్టి స్వదేశంలో విద్యకే ప్రాధాన్యం ఇవ్వాలనేది నా అభిప్రాయం. 1.3 బిలియన్ జనాభా ఉన్న మన దేశంలో 10 లేదా 11 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్లినా.. ఆందోళన చెందక్కర్లేదు. అయితే వారు తమ చదువు పూర్తయ్యాక మన దేశానికి తిరిగొచ్చి సేవలు అందించాలి. మేం చదువుకునే రోజుల్లో ఇన్ని మంచి విద్యా సంస్థలు లేవు కాబట్టే నేను అమెరికా వెళ్లాను.

పెట్టుబడిదారులు ముందుకు రావాలి..

4 ప్రస్తుతం ప్రపంచంలో భారత్ తిరుగులేని శక్తిగా దూసుకెళుతోంది. అమెరికా ఆర్థిక పురోగతి మందగమనంలో ఉంటే.. మన ఆర్థిక పురోగతి దినదిన ప్రవర్ధమానమవుతోంది. ఇదే చక్కని సమయంగా భావించి పెట్టుబడిదారులు ముందుకు రావాలి. మన దేశంలోనే పెట్టుబడులు పెట్టి, ఉద్యోగ కల్పన, దేశ అభివృద్ధికి సహకరించాలి.

ఆలోచనలు వినూత్నంగా, విభిన్నంగా ఉండాలి..

5 యువతలో చాలా మంది పారిశ్రామికవేత్తలుగా మారాలనుకుంటున్నారు. ఇందుకోసం పరిశోధనలపై దృష్టి పెడుతున్నారు. అయితే.. వారు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా రాణించాలంటే వ్యాపార ఆలోచనలు వినూత్నంగా, విభిన్నంగా ఉండాలి. కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా.. సమాజ అభివృద్ధికి తోడ్పడేలా ఆలోచనలు చేయాలి.

ఆత్మవిశ్వాసంతో కదలాలి..

6 యువత ముఖ్యంగా.. జెన్-జెడ్ వారు ఏ పని తలపెట్టినా, ఎందులో అడుగుపెట్టినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. తమపై తాము నమ్మకంతో వ్యవహరించాలి. చేయగలమా? లేదా? అనే మీమాంసతో ఉంటే అడుగులు ముందుకు పడవు. ఇది అంతిమంగా ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని గ్రహించాలి. ఆత్మవిశ్వాసం, నమ్మకంతో అడుగులు వేస్తే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కొనే సత్తా లభిస్తుంది.

కష్టపడటమే.. విజయానికి సూత్రం..

7 నేటి తరం విద్యార్థులు కష్టపడితేనే ఫలితాలు అందుతాయని గుర్తించాలి. చదువుకునే సమయంలోనే అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పొందేలా కృషి చేయాలి. సర్టిఫికెట్ల కోసం కాకుండా.. శ్రేష్టత కోసం చదవడం ముఖ్యమని గుర్తించాలి.

దేశంలో ఎన్నో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు..

ఇప్పుడు మన విద్యా రంగం ఉన్నతంగా ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఐఐటీలు, ఎన్ఐటీలతోపాటు మరెన్నో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు మన దేశంలో ఉన్నాయి. వీటిలో చదువుకున్నవారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది. వీటిని మరింత అభివృద్ధి చేస్తే.. మరింత నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థులు కూడా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలి.

మంచి వేతనాలు అందించాలి

విదేశీ విద్యకు వెళుతున్న విద్యార్థుల విషయంలో ప్రధానంగా వినిపిస్తున్న విషయం.. వారికి భవిష్యత్తులో లభించే వేతనాలు. మన దేశంలో చదువుకున్నవారికి కూడా మంచి వేతనాలు అందించేలా పారిశ్రామికవేత్తలు, సంస్థలు అడుగులు వేయాలి. నైపుణ్యాలకు అనుగుణంగా ఆకర్షణీయ వేతనాలివ్వాలి. ప్రతిభావంతులను నియమించుకుంటే సంస్థలను వృద్ధి బాటలో నడిపించొచ్చు. ఇది కార్యరూపం దాల్చితే యువత దేశంలోనే చదువుకునేందుకు ముందుకొస్తారు.

---

20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

- పాత జాబితాల్లో సవరణలకూ అవకాశం
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025 షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: కొత్త ఓటర్ల నమోదుతోపాటు పాత ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఏటా నిర్వహించే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఆగస్టు 20 నుంచి ఇంటింటి సర్వేతో ఈ కార్యక్రమం మొదలై వచ్చే ఏడాది జనవరి 1న తుది జాబితా విడుదల చేయనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు కూడా ఇప్పుడే కొత్త ఓటరుగా నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఆగస్టు 20 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి కార్యక్రమాలను చేపట్టి అక్టోబర్ 18వ తేదీకి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,500 మంది ఓటర్లకు మించకుండా అవసరమైన చోట్ల పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చేయాలని సూచించింది. గతంలో ఒకే చిరునామాపై అనేకమంది ఓటర్లు, జీరో ఇంటి నంబరుతో ఓటర్ల జాబితా ఉండటంతో ఇప్పుడు అటువంటి తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ ఫ్యామిలీ, డోర్ నంబర్లు, బిల్డింగ్, వీధి పేర్లు తప్పనిసరిగా నమోదు చేసే విధంగా కేవలం చిరునామ నమోదుకు 15 కాలమ్స్‌ను పూరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి అక్టోబర్ 29న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తుంది. దీనిపై సవరణలు, అభ్యంతరాలను నవంబర్ 28 వరకు స్వీకరిస్తారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025 షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	తేదీ
ఇంటింటి సర్వే	ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024
ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ	అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28, 2024
ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల	అక్టోబర్ 29, 2024
అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ	అక్టోబర్ 29, 2024 నుంచి నవంబర్ 28, 2024
ప్రత్యేక ప్రచారం	శని, ఆదివారాల్లో సీఈవో నిర్ణయిస్తారు
క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం	డిసెంబర్ 24, 2024
ఫైనల్ పబ్లికేషన్ కోసం పరిశీలన	జనవరి 1, 2025
తుది ఓటర్ల జాబితా ప్రకటన	జనవరి 6, 2025

15న ఎస్ఎస్ఎల్‌వీ డీ-3 ప్రయోగం

నింగిలోకి ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్



ప్రయోగానికి సిద్ధమైన రాకెట్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈ నెల 15న ఉదయం 9.17 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ3) ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకుగాను షార్ కేంద్రంలో మొదటి ప్రయోగ వేదికపై రాకెట్ అనుసంధాన పనులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన భూ పరిశీలన ఉపగ్రహం (ఈవోఎస్-08) ఉపగ్రహాన్ని భూమికి 475 కి.మీ ఎత్తులోని లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం ఏడాది మాత్రమే సేవలు అందిస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఎస్ఎస్ఎల్‌వీ డీ3 రాకెట్ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగం కావడం విశేషం.

ఉపగ్రహంతో ఉపయోగాలివీ..

- ఈవోఎస్-08 ఉపగ్రహంలో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్-రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీ యూవీ డోసీమీటర్ అనే 3 రకాల పేలోడ్స్‌ను అమర్చి పంపుతున్నారు. భూపరిశీలనలో ఈ ఉపగ్రహం ఎనిమిదవది.
- ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ అనే పేలోడ్ ద్వారా ఆధారిత నిఘా, విపత్తుల పర్యవేక్షణ, పర్యావరణ పర్యవేక్షణ, అగ్ని వంటి అనువర్తనాల కోసం పగలు రాత్రి రెండింటిలోనూ మిడ్-వేవ్, లాంగ్-వేవ్ బ్యాండ్‌ల సహాయంతో ఛాయాచిత్రాలను అందిస్తుందని ఇస్రో తెలిపింది.
- గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్-రిఫ్లెక్టోమెట్రీ పేలోడ్‌తో అగ్నిపర్వత కార్యకలాపాల పరిశీలన, పారిశ్రామిక, పవర్ ప్లాంట్ విపత్తు పర్యవేక్షణ, సముద్ర ఉపరితల గాలి విశ్లేషణ, నేల తేమ అంచనా, హిమాలయాల్లో క్రియో స్పియర్ అధ్యయనాలు, వరదలను ముందుగా గుర్తించడం, లోతట్టు జలాలను గుర్తించడం కోసం అధ్యయనం చేస్తారు.
- ఎస్ఐసీ యూవీ డోసీమీటర్ పేలోడ్ ద్వారా గగన్‌యాన్ మిషన్‌లోని క్రూ మాడ్యూల్ వీక్షణ రిపోర్ట్ వద్ద యూవీ కిరణాన్ని పర్యవేక్షిస్తుంది. గామా రేడియేషన్ కోసం అధిక మోతాదు అలారం సెన్సార్‌గా పనిచేస్తుంది. ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించాలనే దానిపై సమీక్ష నిర్వహించినట్లుగా సమాచారం. ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఢిల్లీలో వున్నారని ఆయన అక్కడి నుంచి వచ్చాక బుధవారం ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటిస్తారని షార్ వర్గాలు తెలిపాయి.

క్రయోజనిక్ ఇంజన్ ట్రయల్ రన్ విజయవంతం

సాక్షి, చెన్నై: తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలోని ఇస్రో కేంద్రంలో క్రయోజనిక్ రాకెట్ ఇంజన్ ట్రయల్ రన్ శనివారం విజయవంతమైంది. ఇస్రో శాటిలైట్ ప్రయోగాలకు క్రయోజనిక్, వికాస్, పీఎస్4 వంటి ఇంజన్లను మహేంద్రగిరిలో తయారు చేస్తున్నారు. గగన్‌యాన్ కోసం సీఈ20 క్రయోజనిక్ ఇంజన్ ఇక్కడ సిద్ధమవుతోంది. దీని ట్రయల్ రన్ శనివారం నిర్వహించారు. మహేంద్రగిరి ఇస్రో డైరెక్టర్ భాగ్యరాజ్ ఈ ట్రయల్ రన్‌ను పరిశీలించగా, తిరువనంతపురం నుంచి శాస్త్రవేత్త నారాయణన్, గగన్‌యాన్ డైరెక్టర్ మోహన్ వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు.

'అసైన్డ్' రిజిస్ట్రేషన్ల నిలిపివేత

- గత ప్రభుత్వం హక్కులిచ్చిన భూములన్నింటిపైనా విచారణ
- సక్రమంగానే ఉన్నా రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉంచాలని ఆదేశం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములపై కల్పించిన యాజమాన్య హక్కులను హరించేలా కూటమి సర్కారు చర్యలకు దిగింది. యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా గత ప్రభుత్వం 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై విచారణ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించింది. యాజమాన్య హక్కులు పొందిన తర్వాత రిజిస్ట్రేషన్లు జరగని లేదా ఎలాంటి లావాదేవీలు జరగని భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగిన భూములపై పూర్తి స్థాయి విచారణ జరపాలని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శనివారం కలెక్టర్లు, రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లకు సర్క్యులర్ జారీ చేశారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల వల్ల అనర్హులు లబ్ధి పొందారని, రిజిస్ట్రేషన్ల చట్టం 1908 సెక్షన్ 22ఏకి విరుద్ధంగా హక్కులిచ్చారని అందులో పేర్కొన్నారు. సామాజిక, పోరంబోకు భూములపై అక్రమంగా హక్కులిచ్చారని, అనంతరం వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులిచ్చిన చోట్ల విచారణ నిర్వహించి దీనిద్వారా ఎక్కడైనా భూకబ్జాలు జరిగాయా? హక్కుల నిర్ధారణలో వాస్తవికత ఉందో లేదో నిర్ధారించేందుకు వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. మూడు నెలలో వెరిఫికేషన్ పూర్తి కావాలని, ఇందుకోసం కలెక్టర్లు విచారణ సంస్థలను ఉపయోగించుకోవాలని సూచించారు. విచారణ సందర్భంగా ఏ కేసులోనైనా యాజమాన్య హక్కుల కల్పన అక్రమంగా జరిగినట్లు తేలితే వాటిని రద్దు చేసి ఆ భూమిని తిరిగి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చేలా రీ క్లాసిఫికేషన్ చేయాలని ఆదేశించారు. యాజమాన్య హక్కులిచ్చిన భూములను ఇంకా రిజిస్టర్ చేసుకోకపోతే ఇకపై వాటికి రిజిస్ట్రేషన్లు చేయవద్దని సూచించారు. విచారణలో యాజమాన్య హక్కులు సక్రమంగానే ఇచ్చినట్లు తేలినా వాటిపై రిజిస్ట్రేషన్లకు అనుమతించవద్దని స్పష్టం చేశారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి ఈ ఆదేశాలు వర్తించవని తెలిపారు.

నాటక రచయిత 'పల్లేటి' కన్నుమూత

- 250 నాటకాల రచనలతో రికార్డు
- నటి 'రోజా'ను తెలుగు తెరకు పరిచయం చేసింది ఈయనే



కడప కల్చరల్: తెలుగునాట సుప్రసిద్ధ నాటకకర్త.. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన పల్లేటి లక్ష్మి కులశేఖర్ (70) శుక్రవారం రాత్రి కన్ను మూశారు. రైల్వేకోడూరులో నివాసముంటున్న ఆయన గుంటూరు నుంచి వస్తూ మార్గమధ్యంలో గుండెపోటుతో కన్నుమూసినట్లు సమాచారం. తెలుగునాట పల్లేటి లక్ష్మీకులశేఖర్ దాదాపు అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. రేడియో నాటకాలు, రూపకాలు, టీవీలు, సినిమాలకు కథలు, పాటలు, సీరియళ్లు ఇలా దాదాపు 250కి పైగా రచనలు చేశారు. 88 నంది అవార్డులు సాధించిన ఆయన వ్యక్తిగతంగా పది నందులు పొందారు. ప్రతిష్టాత్మక హంస (కళారత్న) అవార్డు, ఎన్టీఆర్ అవార్డు, గురజాడ, పైడి లక్ష్మయ్య, గరుడ అవార్డులు సాధించారు. ప్రముఖ సినీనటి ఆర్‌కే రోజాను ఆయన రచన ప్రేమతపస్సు సినిమా ద్వారా సినీ రంగానికి పరిచయం చేశారు. పలువురు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని కడప రిమ్స్ వద్దగల కొత్తసమాధుల తోటలో ఖననం చేశారు.

మాజీమంత్రి రోజా సంతాపం

పల్లేటి లక్ష్మీకులశేఖర్ మృతి చెందడం పట్ల మాజీమంత్రి ఆర్కే రోజా సంతాపం వ్యక్తం చేశారు. సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు కులశేఖర్ ఎప్పటికప్పుడు సామాజిక చైతన్యంతో తన నాటకాలతో ప్రయత్నించారన్నారు. ఆయన మరణం తెలుగు నాటక రంగానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలే ముందుండాలి

తిరుపతి ఐఐటీ డీన్ రాఘవరావు



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు


రేణిగుంట: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలు ముందుండి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తిరుపతి ఐఐటీ డీన్ రాఘవరావు అన్నారు. తిరుపతి ఐఐటీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో శనివారం ఎంఎస్ఎంఈ (ఎంవోఎఫ్ఐ), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్తంగా జిల్లాలోని మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఫుడ్ ప్రోసెసింగ్‌పై శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల శిక్షణ తరగతులను కేంద్ర ఫుడ్ ప్రోసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ అధికారి ఆకాంక్ష శర్మ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. రాఘవరావు మాట్లాడుతూ నాణ్యతతో కూడుకున్న ఆహార పదార్థాలపై మక్కువ చూపుతున్నారని, ఆ దిశగా ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థ పయనించాలని కోరారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్లు అందించారు.

కొత్త అల్లుడికి 'శత' పిండివంటభోజనం



ఆషాఢ మాసం పూర్తయి శ్రావణ మాసం రానేవచ్చింది. ఎక్కడ చూసినా కొత్త అల్లుళ్ల సందడే సందడి. అల్లుడికి మర్యాదలు చేయడంలో గోదారోళ్ల (గోదావరి జిల్లాలు) తర్వాతే ఎవరైనా అంటారు పెద్దలు. ఈ నానుడికి అద్దం పట్టేలా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ గ్రామానికి చెందిన ఉద్దగిరి వెంకట రామారావు, రమణి దంపతులు కొత్త అల్లుడికి శనివారం 'శత' పిండి వంట భోజనం స్వయంగా వడ్డించి తమ ప్రేమను చాటుకున్నారు. అత్తారింట్లో తమ కుమారుడికి లభించిన మర్యాదలను చూసి కాకినాడకు చెందిన బాదం సతీష్, కుమారి దంపతులు మురిసిపోయారు. - కిర్లంపూడి

మహావృక్షం స్థలం మారింది



రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన భారీ రావి చెట్టు స్థలం మారింది. ఇదేంటి మనం ఇల్లు మారినట్లు రావి చెట్టు స్థలం మారిందా అనుకుంటున్నారా..! అనువు మారింది.. అదెలాగో చూద్దాం రండి.. ప్రకాశం జిల్లా ఒంగోలులోని చుండూరి పెట్రోలు బంకు ఆవరణలో బూచేపల్లి నాగలక్ష్మి స్థలంలో రావిచెట్టు ఉంది. అది రెండు శతాబ్దాలుగా స్థానికులకు ఆక్సిజన్ ఇస్తోంది. ఇప్పుడు ఆ స్థలం అవసరాల నిమిత్తం ఆ చెట్టును తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వృథా సుధ సంస్థ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆ సంస్థ ప్రతినిధి అశోక్ స్పందించి ఈ చెట్టును కాపాడాలని హైదరాబాద్‌లోని తమ సంస్థ నిర్వాహకులతో మాట్లాడారు. వారి సూచన మేరకు శనివారం తొలగించిన ఈ చెట్టును చీమకుర్తిలో ఆదివారం తిరిగి నాటేలా చర్యలు చేపట్టారు. ఈ మహావృక్షాన్ని స్థలం మార్చి మరీ బతికించేందుకు వారు చేస్తున్న కృషిని ప్రకృతి ప్రేమికులు ప్రశంసిస్తున్నారు. - ఒంగోలు

తెగిన నాలుకనుసరిచేశారు





ఏడాదిన్నర లోపు పాపకు తెగిన నాలుకను అరుదైన ఆపరేషన్ ద్వారా నెల్లూరు సర్వజన ఆస్పత్రిలో సరిచేసినట్లు ఈఎన్‌టీ సుకుమార్ వెల్లడించారు. పులుగోడు గ్రామానికి చెందిన కృష్ణ, శాంభవి దంపతుల కుమార్తె పావని నాలుగు రోజుల కిందట ఆడుకుంటుండగా కుక్కలు తరమడంతో ఇనుప కమ్ములపై పడింది. ఒక కమ్మి గుచ్చుకుని నాలుక మధ్యలో తెగిపోయింది. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా.. పాపకు ఆపరేషన్ చేయాలంటే శరీరం మొత్తం మత్తు ఇవ్వాల్సి ఉంటుందని తేల్చారు. దీనివల్ల ఇబ్బందులు రావొచ్చని భావించి సర్జరీ చేసేందుకు ముందుకు రాలేదు. ఈ స్థితిలో ఆ దంపతులు పెద్దాస్పత్రికి రాగా, అక్కడి ఈఎన్‌టీ సుకుమార్ టీం రిస్క్‌ను లెక్క చేయకుండా వెంటనే బిడ్డకు ఆపరేషన్ పూర్తి చేసి తెగిన నాలుకకు కుట్లు వేసింది. - నెల్లూరు (అర్బన్)

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943